




# ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 25-6-2019 మంగళవారం సిటీ సంపుటి 45 సంచిక 316

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi







# వరదను వదలొద్దు

**శ్రీశైలానికి గోదారి.. వయా ప్రకాశం బ్యారేజీ?**

- వరద జలాల తరలింపుపై కొత్త యోచన
- పరిశీలనలో మరో రెండు ఆలోచనలు
- 250-300 టీఎంసీల నీటిని తరలించడమే లక్ష్యం
- జూన్-ఆగస్టు మధ్య అనువైన కాలంగా భావన
- 28న కేసీఆర్-జగన్ భేటీ నేపథ్యంలో అధికారుల కసరత్తు
- సీఎంల ప్రధాన చర్చ దీనిపైనే!

**3 రకాల ఆలోచనలు**

1. ఇంద్రావతి నది గోదావరిలో కలిసిన తర్వాత గోదావరి నీటిని శ్రీశైలానికి మళ్లించడం
2. దుమ్ముగూడెం నుంచి గోదావరి నీటిని నాగార్జునసాగర్‌కు మళ్లించి అక్కడి నుంచి శ్రీశైలానికి తరలించడం
3. పోలవరం నుంచి గోదావరి నీటిని ప్రకాశం బ్యారేజీకి తరలించి అక్కడి నుంచి నది ద్వారానే నాగార్జునసాగర్‌కు తీసుకురావడం



ఈనాడు - హైదరాబాద్

గోదావరి వరద నీటిని కృష్ణా నదిలోకి మళ్లించాలన్న యోచనకు పదును పెరుగుతోంది. పలు ఆలోచనలపై కసరత్తు చేస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులు ముఖ్యంగా మూడు రకాల ఆలోచనలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. తెలంగాణలోని మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు ఎక్కువ నీటి వినియోగం జరగాలంటే గోదావరి నీటిని ఎక్కడి నుంచి మళ్లించేలా చేపడితే ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్నదానిపై చర్చిస్తున్నారు.

### ఎజెండాపై ముఖ్యమంత్రుల సూచన

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య

...మిగతా 2లో



దిల్లీలో పురస్కారాలతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ నీతూకుమారి ప్రసాద్, పెద్దపల్లి కలెక్టర్ శ్రీదేవసేన, మొండి భిక్షపతి, రాము, మెరుపు రమ తదితరులు

# స్వచ్ఛ మహోత్సవ్‌లో తెలంగాణకు అవార్డుల పంట

- జాతీయ స్థాయిలో పెద్దపల్లి జిల్లాకు మూడో స్థానం
- జిల్లాల ప్రత్యేక విభాగంలో వరంగల్ అర్బన్‌కు చోటు

ఈనాడు - దిల్లీ

స్వచ్ఛ మహోత్సవ్-2019 పోటీల్లో అయిదు అవార్డులతో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. మరుగుదొడ్ల వినియోగం, ఆకర్షణీయ రీతిలో మరుగుదొడ్ల నిర్మాణం, పరిశుభ్రత తదితర అంశాల ప్రాతిపదికన ఈ అవార్డులకు ఎంపిక చేశారు. దిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ విజేతలకు సోమవారం అవార్డులు ప్రదానం చేశారు. అవార్డుల్లో రెండో స్థానంలో నిలిచినందుకుగాను తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ నీతూకుమారి ప్రసాద్‌కు కేంద్ర మంత్రి అవార్డు అందజేశారు. బహిరంగ మల విసర్జన రహిత జిల్లాల్లో దేశంలో మూడో స్థానం, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో పెద్దపల్లి జిల్లా నిలవడంతో ఆ జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన, జిల్లాల ప్రత్యేక విభాగంలో వరంగల్ అర్బన్ నిలవడంతో ఆ జిల్లా డీఆర్డీఏ పథక సంచాలకుడు రాము, ప్రత్యేక వ్యక్తిగత విభాగంలో సిద్దిపేట జిల్లా ఎర్రవల్లికి చెందిన మొండి భిక్షపతి, జగిత్యాల జిల్లా శాంతక్కపల్లికి చెందిన మెరుపు రమ అవార్డులు స్వీకరించారు. అవార్డుల స్వీకరణ అనంతరం గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ నీతూకుమారి మాట్లాడుతూ.. అవార్డుల్లో రాష్ట్రం దేశ స్థాయిలో రెండో స్థానంలో నిలవడం గర్వకారణంగా ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రాన్ని 98 శాతం ఓడీఎఫ్‌గా మార్చామని, రానున్న రోజుల్లో వంద శాతం ఓడీఎఫ్‌గా మారుస్తామని తెలిపారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్‌కి పెద్దపల్లి జిల్లా దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మహాత్ముని 150వ జయంతి నాటికి శుభ్రతలో దేశంలోనే పెద్దపల్లి జిల్లా మొదటి స్థానంలో ఉంటుందని ఆమె తెలిపారు.



సిరిసిల్లలో సోమవారం నిర్వహించిన తెరాస కార్యాలయ భూమిపూజ కార్యక్రమంలో మాట్లాడుతున్న తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, పక్కన వేములవాడ ఎమ్మెల్యే రమేష్‌బాబు, జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణ

# రూ. 34 లక్షల కోట్లు!

**విదేశాల్లో భారతీయులు దాచిన నల్లధనమిది**

- పార్లమెంటరీ స్థాయీ సంఘం పేర్కొన్న అంచనా ప్రకారం.. విదేశాల్లో మూలుగుతున్నసల్లధనమెంతో తెలుసా?
- రూ15,00,000 కోట్ల నుంచి రూ.34,00,000 కోట్లు
- ఇది మన దేశ వార్షిక బడ్జెట్ (రూ.27,84,200 కోట్లు) కన్నా ఎక్కువ!
- విదేశాల్లో ఉన్న ఈ మొత్తంతో కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు కనీసం 19, పోలవరం వంటివైతే 30 కట్టొచ్చు.
- పోలవరం ప్రాజెక్టు వ్యయ అంచనా: రూ.55,548 కోట్లు
- కాళేశ్వరం అంచనా: రూ.80,499 కోట్లు!!

దిల్లీ: మన దేశం నుంచి తరలివెళ్లిన నల్లధనంపై విస్తుగొల్పే వివరాలు వెలుగులోకి వచ్చాయి. రూ.లక్షల కోట్లు మన తీరాలను దాటి వెళ్లాయని వెల్లడయింది. భారతీయులు 1980 నుంచి 2010 మధ్య వివిధ సమయాల్లో విదేశాల్లో దాచిన అక్రమ సంపద దాదాపు 216.48 బిలియన్ డాలర్ల నుంచి 490 బిలియన్ డాలర్ల వరకు (ప్రస్తుత విలువ ప్రకారం చూస్తే సుమారు రూ.15లక్షల కోట్ల నుంచి రూ.34 లక్షల కోట్ల వరకు) ఉందని అగ్రశ్రేణి

...మిగతా 2లో

## ఘనంగా తెరాస కార్యాలయాల శంకుస్థాపన

- 29 జిల్లాల్లో భూమి పూజ
- మంత్రులు, జడ్పీ ఛైర్‌పర్సన్ల ఆధ్వర్యంలో నిర్వహణ
- సిరిసిల్లలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరు

2లో

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్

## విరాల్ ఆచార్య నిష్క్రమణ



ఆర్‌బీఐ స్వతంత్రతపై గొంతు విప్పింది ఈయనే

- వివరాలు 'ఈనాడు బిజినెస్'లో

## ఫీజుల పిడుగు

- రుసుము రూ.3 లక్షలు?
- వచ్చే మూడేళ్లకు ఫీజులు భారీగా పెంచాలని ఇంజినీరింగ్ కళాశాలల ప్రతిపాదన
- ఏఎఫ్ఆర్సీ ఛైర్మన్ లేనందున వాటిని ఆమోదించాలని మరో 75 కళాశాలలు హైకోర్టుకు

5లో

## పీసీసీ అధ్యక్షుడిని మార్చేది లేదు

- ఉత్తమ్ కుమార్‌రెడ్డినే కొనసాగిస్తాం
- కుంతియా స్పష్టీకరణ

3లో






# సర్కారు బడికి పంపితేనే ధ్రువపత్రాలు

- ముల్కనూరు పంచాయతీ తీర్మానం

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు లేక మూతపడుతున్న ప్రభుత్వ బడులను సమష్టిగా కాపాడుకునేందుకు వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామం ఒక అడుగు ముందుకేసింది. నూతన జడ్పీటీసీ సభ్యుడు వంగ రవీందర్, సర్పంచి మాడ్గుల కొమురయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపించని కుటుంబాలకు గ్రామ పంచాయతీ ధ్రువపత్రాలు, ప్రభుత్వ పథకాలు వర్తించవని సోమవారం పంచాయతీలో తీర్మానం చేశారు. ప్రైవేట్ పాఠశాలల వాహనాలను గ్రామంలోకి అనుమతించబోమని పేర్కొన్నారు. సర్కారు బడిలో ఒకటో తరగతి నుంచి పది వరకు చదవని విద్యార్థులకు గ్రామ పంచాయతీ తరఫున ఎలాంటి ధ్రువపత్రాలు జారీ చేయబోమంటూ ఇంటింటి ప్రచారం చేశారు.




ముల్కనూరు గ్రామ పంచాయతీ తీర్మానం

## ఆగస్టు నెలాఖరులో సచివాలయ నిర్మాణం

- భవన నమూనా ఖరారయ్యాకనే పనులు
- ఆర్అండ్‌బీ భవనాల్లో శాసనసభ కార్యాలయాలు
- ఖాళీ భవనాల గుర్తింపులో సాధారణ పరిపాలనశాఖ నిమగ్నం

2లో

## ఎర్రమంజిల్ భవనాల కూల్చివేతను అడ్డుకోండి

- హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం
- 'సచివాలయం కూల్చివేత'పై 28న విచారణ

6 లో






Eenadu epaper

# ఘనంగా తెరాస కార్యాలయాల శంకుస్థాపన

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రసమితి రాష్ట్రంలో 29 పార్టీ జిల్లా కార్యాలయాలకు సోమవారం శంకుస్థాపన నిర్వహించింది. మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, మండలి సభ్యులు, జడ్పీ ఛైర్‌పర్సన్లు, పార్టీ నేతలు, కార్యకర్తలతో ఘనంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తెరాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు సిరిసిల్ల జిల్లాలో పార్టీ కార్యాలయ భూమిపూజకు హాజరవ్వగా... తొమ్మిది జిల్లాల్లో మంత్రులు, మిగిలిన 19 జిల్లాల్లో జడ్పీ ఛైర్‌పర్సన్ల చేతుల మీదుగా శంకుస్థాపనలు జరిగాయి. పార్టీ నిర్దేశించిన విధంగా అన్నిచోట్ల 10- 11 గంటల మధ్య భూమిపూజ నిర్వహించారు. అనంతరం సమావేశాలను నిర్వహించారు.

- మహబూబ్‌నగర్‌లో కార్యాలయ భవనానికి ఎక్సైజ్‌శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, సాట్స్ ఛైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డి.పోచంపల్లిలో భవన నిర్మాణానికి మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ, తెరాస యువజన విభాగం రాష్ట్రాధ్యక్షుడు శంభీపూర్‌రాజు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యేలు కేపీవివేకానంద్, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు జనార్దన్‌రెడ్డి, యెగ్గె మల్లేశం, నవీన్‌రావు, ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్, నూతనంగా ఎన్నికైన జడ్పీ ఛైర్మన్ శరత్‌చంద్రారెడ్డి పాల్గొన్నారు.
- జోగులాంబ గద్వాల జిల్లా పార్టీ కార్యాలయ నిర్మాణానికి వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అబ్రహం, ప్రస్తుత జడ్పీ ఛైర్‌పర్సన్ బండారి భాస్కర్, నూతన జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత పాల్గొన్నారు.
- మెదక్ జిల్లా పార్టీ కార్యాలయ నిర్మాణానికి జడ్పీ ఛైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి భూమిపూజ చేశారు.
- నిర్మల్‌లో దేవాదాయ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.
- జనగామలో పార్టీ భవన నిర్మాణానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ విప్ బి.వెంకటేశ్వర్లు, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే టి.రాజయ్య, జనగామ జడ్పీ ఛైర్‌పర్సన్ పాగాల సంపత్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, కొమురవెల్లి ఆలయ ఛైర్మన్ సంపత్ పాల్గొన్నారు.
- నారాయణపేట జిల్లా కార్యాలయ భవనానికి జడ్పీ ఛైర్‌పర్సన్ వనజమ్మ శంకుస్థాపన చేయగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.
- సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి, కరీంనగర్ జిల్లాలో ఈటల రాజేందర్, నిజామాబాద్‌లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, జగిత్యాలలో ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్‌లు శంకుస్థాపనల్లో పాల్గొన్నారు.



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డి.పోచంపల్లిలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, పక్కన ఎమ్మెల్సీ నవీన్‌రావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

# రాష్ట్ర ప్రజలకు తెరాస శ్రీరామరక్ష

- కాళేశ్వరంపై దేశవ్యాప్త చర్చ
- 27న పార్టీ సభ్యత్వ కార్యక్రమాలు ప్రారంభం: కేటీఆర్

ఈనాడు డిజిటల్, సిరిసిల్ల: కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్ల రికార్డు సమయంలో పూర్తి చేయడంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారకరామారావు అన్నారు. సోమవారం సిరిసిల్లలో తెరాస జిల్లా పార్టీ కార్యాలయ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ ఏవిధంగా సాధించారో.. అదే ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రంలో పరిపాలన, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు తెరాస శ్రీరామరక్షగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో తెరాసను ఒక మహత్తరశక్తిగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలను నిర్మించనున్నామన్నారు. భవిష్యత్తులో తెరాస చేపట్టబోయే కార్యక్రమాలపై పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఇప్పటికే ఒక ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ముందుగా గ్రామస్థాయి బూత్ కమిటీ నుంచి రాష్ట్ర కమిటీ వరకు పటిష్ఠంగా నిర్మించాలనేది ప్రధానాంశమన్నారు. కార్యకర్తలందరికీ సంస్థాగత శిక్షణ కార్యక్రమాలు చేపడతామన్నారు.

### ఎన్నికల ఫలితాల్లో తెరాస రికార్డు

దేశచరిత్రలో అన్ని రాజకీయ పార్టీల రికార్డులను తిరగరాస్తూ.. ప్రజలు తెరాసకు అధికారాన్ని కట్టబెట్టారని కేటీఆర్ చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం ఓట్లు.. 75శాతం స్థానాలు కైవసం చేసుకున్నామన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో 16 స్థానాలకు 9 స్థానాలు కట్టబెట్టారని తెలిపారు. పరిషత్ పోరులో 32 జిల్లా పరిషత్‌లపై గులాబీ జెండా ఎగురవేశామన్నారు. మండల పరిషత్‌లలో 85 శాతం తెరాస కైవసం చేసుకుందని చెప్పారు. ఈ నెల 27న హైదరాబాద్‌లో పార్టీ సభ్యత్వ నమోదును లాంఛనంగా ప్రారంభించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. తొలుత పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సభ్యత్వం తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే రమేష్‌బాబు, జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణ, టెస్కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు పాల్గొన్నారు.

# తెరాస కార్యకర్తలు గర్వించదగ్గ రోజు

- మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపనలు జరగడం ఆనందంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. దేశ రాజకీయ చరిత్రలో ఒకే రోజు ఎక్కువ జిల్లాల్లో ఈ ప్రక్రియ జరగడం ఇదే మొదటిసారని, తెరాస కార్యకర్తలు గర్వించదగ్గ రోజు అని అన్నారు. సిద్దిపేట శివారు పొన్నాల పరిధిలో సోమవారం నిర్వహించిన తెరాస సిద్దిపేట జిల్లా కార్యాలయ భవననిర్మాణ పనుల భూమి పూజకు హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడారు. 2001లో కేసీఆర్ తెరాసను ఏర్పాటు చేసినపుడు హైదరాబాద్‌లో రాష్ట్ర కార్యాలయానికి స్థలం దొరకలేదని, కొండా లక్ష్మణ్ బాపూజీకి చెందిన జలదృశ్యంలో ఏర్పాటు చేశామన్నారు. తర్వాత ప్రభుత్వం కుట్రపన్ని రాత్రికి రాత్రే కార్యాలయంలోని సామగ్రిని బయట పడేయడంతో బూర్గుల రామకృష్ణారావు భవన్ వద్ద ధర్నా చేపట్టి నిరసన తెలిపామన్నారు. పార్టీ కార్యాలయానికి అద్దెకు కూడా భవనం లభించకపోవడంతో కేసీఆర్ ఇంట్లోనే రెండేళ్లు నిర్వహించామన్నారు. తర్వాత బంజారాహిల్స్‌లో అద్దె భవనం లభించినా, అక్కడి నుంచి ఖాళీ చేయించడానికి ప్రభుత్వం విఫలయత్నం చేసిందన్నారు. ఉద్యమంలో ఎన్నో అవమానాలు, ఆటంకాలు ఎదుర్కొన్నామని, ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఉద్యమించి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో తెరాస బలీయమైన శక్తిగా ఎదిగిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ తరుణంలో అన్ని జిల్లాల్లోనూ పార్టీ కార్యాలయాల ఏర్పాటుకు పూనుకోవడం సంతోషంగా ఉందన్నారు.

## విజయం దిశగా నడిపించిన 'మిరాజ్ 2000': బి.ఎస్.ధనోవా

గ్వాలియర్: 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో మిరాజ్ 2000 విమానాల వల్లే విజయలక్ష్మి మనవైపు మొగ్గు చూపిందని ఎయిర్ చీఫ్ మార్షల్ బి.ఎస్.ధనోవా పేర్కొన్నారు. అప్పటి నుంచి స్క్వాడ్రన్ (18) విమానాలను ఆధునికీకరించామని, మరిన్ని చేస్తున్నామన్నారు. ఇప్పటికీ భారత వైమానిక దళం(ఐఏఎఫ్)లో ఇవే ప్రధాన ఆయుధాలని చెప్పారు. మిరాజ్ 2000 యుద్ధ విమానాలను మోహరించడం, గగనతలం నుంచి ఆర్మీకి అందిన సహాయ-సహకారాలతో యుద్ధంలో విజయావకాశాలు భారత్ వైపు మొగ్గాయన్నారు.

# రూ.34 లక్షల కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అండ్ ఫైనాన్స్ (ఎన్‌ఐపీఎఫ్‌పీ), నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసర్చ్ (ఎన్‌సీఏఈఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐఎఫ్‌ఎం) నిర్వహించిన మూడు వేర్వేరు అధ్యయనాల్లో తేలింది. సోమవారం ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం ఈ వివరాలతో ఒక నివేదికను లోక్‌సభ ముందు ఉంచింది. ప్రధానంగా రియల్ ఎస్టేట్, గనులు, ఔషధాలు, పాన్ మసాలా, గుట్కా, పొగాకు, బంగారం, కమోడిటీలు, సినిమాలు, విద్యా రంగాలలో ఇలా లెక్కల్లోకి రాని ఆదాయం ఉన్నట్లు అధ్యయనాలు పేర్కొన్నాయి.

అయితే నల్లధనం ఎక్కడి నుంచి వస్తోంది, ఎక్కడ పోగుపడుతోందన్న విషయమై కచ్చితమైన అంచనాలు లేవని, అలాంటి అంచనాలు వేయడానికి కచ్చితమైన, ఆమోదయోగ్యమైన పద్ధతి కూడా లేదని 'దేశం లోపల, వెలుపల లెక్కల్లోకి రాని ఆదాయం/ఆస్తుల పరిస్థితి- ఓ శాస్త్రీయ విశ్లేషణ' అనే పేరుతో రూపొందించిన నివేదికలో స్థాయీ సంఘం పేర్కొంది. అంచనాలన్నీ పలు సర్దుబాట్లను పరిగణనలోకి తీసుకొని ఊహల ఆధారంగానే రూపొందించారని వివరించింది. ఇందుకు ఉపయోగించాల్సిన అత్యుత్తమ పద్ధతి లేదా విధానంపై ఏకరూపత, ఏకాభిప్రాయం రాలేదని తెలిపింది. నల్లధనంపై వివిధ సంస్థలు వేరువేరుగా కట్టిన అంచనాల వివరాలు ఈ నివేదికలో ఉన్నాయి.

- ఎన్‌సీఏఈఆర్ విశ్లేషణ: 1980-2010 మధ్య విదేశాల్లో మూలుగుతున్న భారతీయుల అక్రమ సంపద రూ.26.65 లక్షల కోట్ల నుంచి రూ.34 లక్షల కోట్ల వరకు ఉండొచ్చు.
- ఎన్‌ఐఎఫ్‌ఎం అంచనాలు: ప్రస్తుత విలువల ప్రకారం చూస్తే 1990-2008 మధ్య అక్రమంగా దేశం వెలుపలకు తరలిన నల్లధనం సుమారు రూ.15 లక్షల కోట్లు. లెక్కల్లోకి రాని ఆదాయంలో దేశం వెలుపలకు వెళ్తున్న అక్రమాదాయం సుమారు 10 శాతం ఉండొచ్చు.
- ఎన్‌ఐపీఎఫ్‌పీ అంచనాలు: 1997 నుంచి 2009 మధ్య కాలంలో అక్రమంగా దేశం వెలుపలకు వెళ్లిన సొమ్ము స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 0.2 శాతం నుంచి 7.4 శాతం.

దేశం లోపల, వెలుపల ఉన్న అక్రమ ఆదాయంపై విశ్వసనీయ అంచనాలు కట్టడం చాలా కష్టసాధ్యమని స్థాయీ సంఘం నివేదిక తెలిపింది. ఈ మూడు సంస్థలు వేసిన లెక్కల్లో తీవ్ర వైరుధ్యమున్న అంచనాలు రావడమే ఇందుకు నిదర్శనమని వివరించింది. ఆ సంస్థలిచ్చిన మూడు నివేదికలను కలగలపడం ద్వారా ఒక అంచనాను ఖరారు చేయడానికి ఆస్కారం లేదని ముఖ్య ఆర్థిక సలహాదారు అభిప్రాయపడినట్లు పేర్కొంది. కొందరు సాక్షులనూ విచారించాల్సి ఉందని తెలిపింది. ఈలోగా దేశం లోపల, వెలుపల ఉన్న నల్లధనం/ సంపదను వెలికి తీయడానికి కేంద్ర ఆర్థిక శాఖ తీవ్రంగా కృషి చేయాలని కోరింది. నల్లధనంపై ఏర్పడ్డ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇచ్చిన ఏడు నివేదికలపైన, తాజా మూడు నివేదికలపైన తదనంతర చర్యలు తీసుకోవాలని సూచించింది. దేశంలోని ప్రత్యక్ష పన్నుల చట్టాన్ని సరళీకరించి, హేతుబద్ధీకరించే ఉద్దేశంతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రత్యక్ష పన్ను కోడ్‌ను సాధ్యమైనంత త్వరగా ఖరారు చేసి, పార్లమెంటులో ప్రవేశపెట్టాలని కోరింది.

ఈ స్థాయీ సంఘానికి ఎం.వీరప్ప మొయిలీ అధ్యక్షత వహించారు. ఈ ఏడాది మార్చి 28న స్థాయీ సంఘం లోక్‌సభ స్పీకర్‌కు తన నివేదికను సమర్పించింది. దేశం లోపల, వెలుపల లెక్కల్లోకి రాకుండా పోతున్న ఆదాయం, సంపద ఎంతో లెక్కించాలని 2011 సంవత్సరంలో ఈ మూడు సంస్థలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ కోరింది.

# ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- యువకుడి మృతి, యువతి పరిస్థితి విషమం

బోరబండ, చైతన్యపురి, మలక్‌పేట్ న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుందామని కలలుగన్న ఓ ప్రేమజంట శీతల పానీయంలో గుళికల మందు కలుపుకొని తాగి సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రేమికుడు సందీప్‌రెడ్డి మృతిచెందగా, ప్రియురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చైతన్యపురి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నల్గొండ జిల్లా రాగన్నగూడకు చెందిన బంధువులైన యువతీ యువకులు ప్రేమించుకున్నారు. త్వరలోనే పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఇద్దరి తల్లిదండ్రుల వద్ద ఈ విషయమై గొడవ జరగడంతో దిల్‌సుఖ్‌నగర్ రాజధాని థియేటర్ సమీపంలో యువకుడు అద్దెకుండే గదిలో ప్రేమికులిద్దరూ ఆత్మహత్యాయత్నం చేశారు. అపస్మారక స్థితికి చేరుకున్న ఇద్దరినీ కమలా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. మెరుగైన చికిత్స కోసం యువతిని మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది..

# వరదను వదలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

గోదావరి జలాల వినియోగంపై చర్చ జరిగింది. ఇంద్రావతి గోదావరిలో కలిసిన తర్వాత నీటి లభ్యత ఎక్కువగా ఉంటుందని, ఇక్కడి నుంచి నేరుగా శ్రీశైలానికి నీటిని మళ్లించడానికి అవకాశం ఉంటుందని, పూర్తి సహకారంతో కరవు జిల్లాలకు గోదావరి వరద జలాలను వినియోగించుకోవచ్చన్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. దీనిపై ఉన్నతస్థాయి అధికారులతో కూడా ఆయన చర్చించారు. హంద్రీ-నీవా ఎత్తిపోతల పథకం నీటి మళ్లింపు సామర్థ్యాన్ని రోజుకు ఒక టీఎంసీకి పెంచడంపైనా ముఖ్యమంత్రుల మధ్య ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఈ నెల 28న హైదరాబాద్‌లో సమావేశం కావాలని నిర్ణయించిన ఇద్దరు ముఖ్యమంత్రులు ఇందుకు సంబంధించిన ఎజెండా ఇతర అంశాలపై సిద్ధం కావాలని అధికారులకు సూచించారు.

### వరద నీటి మళ్లింపుపైనే ప్రధాన చర్చ?

గోదావరి వరద నీటిని శ్రీశైలానికి మళ్లించడంపైనే ముఖ్యమంత్రుల మధ్య ప్రధాన చర్చ ఉంటుందని భావిస్తున్నారు. రెండు రాష్ట్రాల అధికారులతో ఓ కమిటీని ఏర్పాటు చేసి నివేదిక కోరే అవకాశం ఉన్నట్లు కూడా సమాచారం. వరద ఉండే మూడు నెలల సమయంలో 250 నుంచి 300 టీఎంసీల నీటిని మళ్లించడమే లక్ష్యంగా కొత్త పథకానికి రూపకల్పన చేయాలన్నది యోచనగా చెప్తున్నారు. నీటి అవసరం ఉన్న ప్రాజెక్టుల సామర్థ్యం, కృష్ణాలో లభ్యమయ్యేనీరు, అదనంగా ఎంతమేరకు అవసరం అన్నదాని ఆధారంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. జల వివాదాలకు సంబంధించిన ఇతర అంశాలకు అంత ప్రాధాన్యం ఇవ్వకపోవచ్చని భావిస్తున్నారు.

### సాగర్‌కు గత ఎనిమిదేళ్లలో 150 టీఎంసీల కంటే తక్కువే



- నాగార్జునసాగర్‌లోకి జూన్ నుంచి ఆగస్టు నెలల మధ్య వచ్చిన కృష్ణా జలాలను పరిశీలిస్తే 2007–08 నుంచి 2017–18 మధ్య ఎనిమిదేళ్ల కాలంలో 150 టీఎంసీల కంటే తక్కువే వచ్చాయి.
- ఐదు సంవత్సరాల్లో సుమారు 50 టీఎంసీలు మాత్రమే వచ్చాయి.
- 2012–13లో 7.24 టీఎంసీలు వస్తే, 2015–16లో 4.35 టీఎంసీలు, 2017–18లో 3.21 టీఎంసీలు మాత్రమే వచ్చాయి.
- ఈ సంవత్సరాల్లో శ్రీశైలంలోకి కూడా ఏమీ ప్రవాహం లేదు. ఆలమట్టి ఎత్తు పెంపు తర్వాత, తుంగభద్ర ఎగువన కర్ణాటక వినియోగం పెరిగిన అనంతరం ఆగస్టు వరకు శ్రీశైలానికి నీటి లభ్యత మరింత తగ్గిపోయింది.

### సమాచారాన్ని సిద్ధం చేసుకుంటున్న అధికారులు

ఈ నెల 28న సమావేశం గురించి అధికారికంగా సమాచారం లేకున్నా సీఎంల సూచన మేరకు రెండు రాష్ట్రాల అధికారులు కసరత్తు ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్‌తోనూ, తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్ ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావుతో చర్చించారు. నీటిని మళ్లించే ప్రతిపాదనల గురించి ప్రస్తుతం రెండు రాష్ట్రాల ఇంజినీర్లు అవసరమైన సమాచారాన్ని సిద్ధం చేసుకొంటున్నారు.

### నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి ఎలాగంటే?

ప్రస్తుతం కృష్ణా నది విషయంలో శ్రీశైలం జలాశయం నిండిన తర్వాత నాగార్జునసాగర్‌కు జలాలు వస్తాయి. తాజా ఆలోచన ప్రకారం గోదావరి నుంచి పోలవరం ప్రాజెక్టు ద్వారా ప్రకాశం బ్యారేజీకి తీసుకువచ్చిన నీటిని కృష్ణా నది ద్వారానే పులిచింతలకు, అక్కడి నుంచి నాగార్జునసాగర్‌కు నీటిని మళ్లించి, ఇక్కడి నుంచి శ్రీశైలంలోకి ఎత్తిపోత ద్వారా నింపడంపై ఆలోచిస్తున్నారు. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు. నీటిమట్టాన్ని 560 అడుగుల వరకూ నిర్వహిస్తే ఇందులో నిల్వ చేసిన నీటిని రివర్సిబుల్ టర్బైన్స్ ద్వారా శ్రీశైలంలోకి ఎత్తిపోయవచ్చు. ప్రస్తుతం విద్యుత్తు ఉత్పత్తి ద్వారా వదిలిన నీటిని తిరిగి శ్రీశైలంలోకి ఎత్తిపోసే వ్యవస్థ ఉంది. దీనినే వినియోగించుకొని నీటి ఎత్తిపోత చేపట్టడానికి అవకాశం ఉందనే అభిప్రాయాన్ని రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

### ఏది సరైన సమయం?

శ్రీశైలంలోకి ఆగస్టు రెండో వారం తర్వాతే నీటి ప్రవాహం ఉంటోంది. ఈలోగా సుమారు 45 రోజులు నాగార్జునసాగర్‌కు, అక్కడి నుంచి శ్రీశైలానికి గోదావరి జలాలను నాగార్జునసాగర్ ద్వారా ఎత్తిపోయవచ్చు. తద్వారా సాగర్ కుడి, ఎడమకాలువ, సోమశిల, ఎ.ఎం.ఆర్.పి ప్రాజెక్టుల కింద జాప్యం కాకుండా నీటిని ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. శ్రీశైలానికి వచ్చే నీటిని ఆ ప్రాజెక్టుపై ఆధారపడిన కల్వకుర్తి, శ్రీశైలం ఎడమగట్టు కాలువ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, ప్రస్తుతం తెలంగాణలో నిర్మాణంలో ఉన్న పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలకు ఇవ్వొచ్చు. దీనిపై ఇంజినీర్లు అధ్యయనం చేస్తున్నారు. ఇంద్రావతి గోదావరిలో కలిసిన తర్వాత అక్కడి నుంచి నేరుగా శ్రీశైలానికి నీటిని మళ్లించడం కంటే నాగార్జునసాగర్ ద్వారా మళ్లించడమే ఉత్తమం అన్న అంశంపై రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారుల్లో విస్తృత చర్చ జరుగుతోంది.

### మనకెందుకీ కొరత?

మేధస్సుకూ, శారీరక శ్రమకూ మధ్య బంధాలు తెగిపోవటం వల్లనే మన దేశం.. బహుశా ప్రపంచంలోనే అత్యంత దోపిడీకి గురవుతున్న, అత్యంత వనరుల కొరతలో కొట్టుమిట్టాడుతున్న దేశంగా మిగిలిపోతోందని నా అభిప్రాయం.

– మహాత్మా గాంధీ

### గ్రహం అనుగ్రహం

25–6–2019 మంగళవారం

శ్రీ వికారి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
అష్టమి: రా. 12.50 తదుపరి నవమి
ఉత్తరాభాద్ర నక్షత్రం: రా. 3.08 తదుపరి రేవతి
అమృత ఘడియలు: రా. 9.51 నుంచి 11.37 వరకు
వర్జ్యం: ఉ. 11.19 నుంచి 1.04 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8.07 నుంచి 9.00 వరకు
తిరిగి రా. 10.56 నుంచి 11.40 వరకు
రాహుకాలం: మ. 3.00 నుంచి 4.30 వరకు
సూర్యోదయం: ఉ.5-31; సూర్యాస్తమయం: సా.6.33

## భారత్‌తో అవకాశాలు కోల్పోతున్న బ్రిటన్

- పార్లమెంటరీ సంఘం వ్యాఖ్య

లండన్: భారత్‌తో సంబంధాలు మెరుగుపరచుకునే విషయమై దేశాల మధ్య జరుగుతున్న పోటీలో బ్రిటన్ వెనుకబడిపోతోందని పార్లమెంటరీ సంఘం అభిప్రాయపడింది. ప్రపంచ వేదికపై భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతకు అనుగుణంగా వ్యూహాలను మార్చుకోవడం లేదని పేర్కొంది. బ్రిటన్-భారత్ వారోత్సవాల్లో పార్లమెంటులో సోమవారం తొలిసారిగా భారత్ దినోత్సవాన్ని నిర్వహించారు.

GATE
Govt. Jobs Coaching
Attend 40 Hours Free
Networks & Aptitude
Classes and get upto 100%
Fee Concession in GATE
Contact @ 9848485698
SPACE Engg. Academy GATE ESE PSUs
Koti, Hyd : 9849713451

# ఆగస్టు నెలాఖరులో సచివాలయ నిర్మాణం

- భవన నమూనా, గుత్తేదారు ఖరారయ్యాకే పనులు

ఈనాడు - హైదరాబాద్

నూతన సచివాలయం, శాసనసభ భవనాల నిర్మాణాలను ఆగస్టు చివర్లో లేదా సెప్టెంబరు నుంచి చేపట్టేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. ఈ నెల చివరివారం తరువాత మంచి ముహూర్తాలు లేకపోవడంతో గురువారం శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. భవనాల నమూనా తయారీకి ఆర్కిటెక్ట్‌ను కన్సల్టెంటుగా నియమించాల్సి ఉంది. ఇంకా గుత్తేదారు ఖరారయ్యేటప్పటికి ఆగస్టు లేదా సెప్టెంబరు వరకు సమయం పట్టవచ్చని అధికారుల అంచనా. ప్రస్తుతమున్న సచివాలయంలోని వివిధ కార్యాలయాలను ఎక్కడికి తరలించాలన్న కసరత్తును సాధారణ పరిపాలన శాఖ చేపట్టింది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించే పని ఒకట్రెండు రోజుల్లో కొలిక్కి వస్తుందని ఓ ఉన్నతాధికారి సోమవారం 'ఈనాడు'తో చెప్పారు. సచివాలయ నిర్మాణం కోసం అన్ని భవనాలను ఒకే దఫా తొలగించాల్సిన అవసరం లేదన్న అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతోంది. భవన నిర్మాణానికి కావాల్సినంత వరకు గుర్తించి తొలిదశలో అంతవరకే కూల్చివేసి, మిగిలిన భవనాల్లోకి ఆయా కార్యాలయాలను సర్దుబాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం తుది నిర్ణయం ఖరారు చేయాల్సి ఉంది.

### అసెంబ్లీ సెక్రటేరియట్‌గా ఆర్‌అండ్‌బీ భవనాలు

ఎర్రమంజిల్‌లో శాసనసభ, శాసనమండలి, సెంట్రల్ నిర్మాణాలు పూర్తయిన తరువాత రహదారులు భవనాలశాఖ నూతన భవన సముదాయాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. శాసనసభ, శాసనమండలి సెక్రటేరియట్‌గా ఆ భవనాలను మార్చాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. భద్రత కారణంగా రహదారులు-భవనాల శాఖ అక్కడ ఉండకూడదని చెబుతున్నారు. నూతన భవన సముదాయం సిద్ధమయ్యేంత వరకు రహదారులు-భవనాల శాఖ అక్కడే కొనసాగనుంది. రవాణా, అటవీ, మున్సిపల్, వైద్య ఆరోగ్యం, రహదారులు-భవనాలు, గృహనిర్మాణం, వాణిజ్య పన్నులు, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖలకు ప్రత్యేక భవనాలు ఉన్నాయి.

వాటిల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అప్పట్లో కేటాయించిన భవనాలను ఖాళీ చేశారు. వాటిల్లో స్వల్ప మార్పులు చేసి ఆయా మంత్రులు, ముఖ్యకార్యదర్శుల కార్యాలయాలను అక్కడ ఏర్పాటు చేసేందుకు అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. మిగిలిన కార్యాలయాలను ఖాళీగా ఉన్న ఇతర భవనాల్లోకి మార్చవచ్చని ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు.

### జలసౌధ తొలగింపు అనివార్యం!

ఎర్రమంజిల్‌లో అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలని నిర్ణయించడంతో భద్రతాకారణాల దృష్ట్యా పక్కనే ఉన్న జలసౌధ భవన సముదాయాన్ని కూడా కూల్చివేయాల్సి ఉంది. రహదారులు-భవనాల శాఖ పాత భవనాలు, జలసౌధ భవనాలను తొలగించిన తరువాత ఇప్పటికే ఖాళీగా ఉన్న స్థలంలో వాస్తులోపాలు సరిదిద్ది భవన నిర్మాణాలను చేపట్టాలన్నది అధికారులు భావిస్తున్నారు. ఆ ప్రాంగణమంతా భద్రతావలయంలోకి తీసుకురావాల్సి ఉంటుంది. దీంతో జలసౌధ తొలగింపు అనివార్యమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| ఖమ్మం | 40.0 | 29.0 |
| నెల్లూరు | 39.0 | 27.0 |
| నల్గొండ | 39.0 | 24.0 |
| తిరుపతి | 38.6 | 26.0 |
| సూర్యాపేట | 38.0 | 29.5 |
| మెదక్ | 37.8 | 23.2 |
| గుంటూరు | 37.7 | 28.2 |
| రామగుండం | 37.2 | 25.2 |
| విజయవాడ | 36.6 | 27.1 |
| ఆదిలాబాద్ | 35.3 | 24.0 |
| విశాఖపట్నం | 35.0 | 26.4 |
| హన్మకొండ | 35.0 | 25.0 |
| హైదరాబాద్ | 34.6 | 25.1 |
| మహబూబ్‌నగర్ | 34.0 | 24.5 |
| కరీంనగర్ | 34.0 | 24.0 |
| నిజామాబాద్ | 32.9 | 23.5 |

Eenadu epaper

# పుర ఎన్నికల ప్రక్రియ షురూ

- లోక్‌సభ ఓటర్ల జాబితానే ప్రాతిపదిక
- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారీగా ప్రత్యేక జాబితాలు
- జులై 19 నాటికి సిద్ధమయ్యేలా షెడ్యూల్

ఈనాడు – హైదరాబాద్

రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నిర్వహణకు ఆ శాఖ సన్నద్ధమవుతోంది. జులై నెలాఖరునాటికి ఎన్నికలు నిర్వహిస్తామని ఇటీవల సీఎం ప్రకటించిన నేపథ్యంలో ఏర్పాట్లపై పురపాలక శాఖ దృష్టిసారించింది. కీలకమైన ముందస్తు ఘట్టాలను మొదలుపెట్టింది. రిజర్వేషన్ల ప్రాతిపదికగా ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించింది. జులై 19వ తేదీ నాటికి ఈ ప్రక్రియను ముగించి ఓటర్ల జాబితాలను సిద్ధం చేయనున్నారు.

తెలంగాణలోని 53 పురపాలక సంఘాలు, మూడు నగరపాలక సంస్థలకు జులై రెండో తేదీన పాలకవర్గాల గడువు ముగుస్తోంది. వీటితోపాటు కొత్తగా ఏర్పాటైన 68 పురపాలక సంఘాలకూ ఎన్నికలు జరగాల్సి ఉంది. దీంతో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రక్రియకు పురపాలక శాఖ శ్రీకారం చుట్టింది. వార్డుల నిర్ణయం, పునర్విభజన, వార్డులవారీగా ఓటర్ల జాబితాల ప్రచురణ, రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను పూర్తి చేసి అధికారికంగా వివరాలు అందించాకే రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుడుతుంది. ఈ నేపథ్యంలో ముందస్తుగా చేపట్టాల్సిన ప్రక్రియపై దృష్టిసారించాలని ఎన్నికలు జరగాల్సిన అన్ని పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల కమిషనర్లను రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ టి.కె.శ్రీదేవి ఆదేశించారు.

### వర్గాలవారీగా ఓటర్ల జాబితా

తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల ఓటర్ల జాబితా ఆధారంగా పురపాలక సంఘాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలవారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తించి పంపాలని పురపాలక శాఖ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాలకవర్గాల గడువున్న చోట్లా బీసీ ఓటర్ల గణన చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ నెల 21న శిక్షణతో ప్రారంభమైన ప్రక్రియను 28 రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. మొత్తం మీద జులై 19వ తేదీకి పురపాలక శాఖ డైరెక్టర్‌కు ఓటర్ల జాబితా అందజేయాలని ఆదేశించారు.

### జులై 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలన

రాష్ట్రంలోని 53 పురపాలక సంఘాలు, మూడు నగరపాలక సంస్థల పాలకవర్గాల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రత్యేక అధికారుల నియామకంపైనా పురపాలక శాఖ దృష్టిసారించింది. జులై రెండో తేదీతో ప్రస్తుత పాలకవర్గాల గడువు ముగుస్తుండటంతో అదే రోజు సాయంత్రంలోపు ప్రత్యేక అధికారులను నియమించేలా చర్యలు చేపడుతున్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

### ఇదీ షెడ్యూల్

| | |
|---|---|
| పోలింగ్ కేంద్రాలవారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు పూర్తి: | జులై 4 |
| ఓటరు జాబితాలు సిద్ధం : | జులై 5 |
| పోలింగ్ కేంద్రాలవారీగా ఓటర్ల జాబితాముసాయిదా ప్రచురణ: | జులై 6 |
| ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ: | జులై 7–11 |
| అభ్యంతరాల పరిశీలన : | జులై 12–14 |
| అభ్యంతరాలపై క్షేత్రస్థాయి పరిశీలన: | జులై 15, 16 |
| అభ్యంతరాల అనంతరం ఓటర్ల జాబితా: | జులై 17 |
| పోలింగ్ కేంద్రాలవారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల జాబితాలు తుది ప్రచురణ: | జులై 18 |
| పురపాలక డైరెక్టర్ కార్యాలయానికి ఓటర్ల జాబితాల అందజేత : | జులై 19 |



## అనుకోకుండా వాగొచ్చింది

### విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం

రెబ్బెన, న్యూస్‌టుడే: కుమురం భీం జిల్లా రెబ్బెన మండలం కైరిగూడ గ్రామానికి చెందిన గ్రామస్థులకు వర్షాకాలం వస్తే చాలు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిరోజూ గోలేటిలోని వివిధ పాఠశాలలకు వాగు గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. సోమవారం సాయంత్రం పలువురు విద్యార్థులు వాగు దాటేందుకు ప్రయత్నిస్తుండగా అంతకు ముందే కురిసిన వర్షంతో ఒకేసారి నీటి ప్రవాహం పెరిగింది. దీంతో వారంతా వాగు మధ్యలోనే ఎత్తైన ప్రదేశంపై ఉండిపోయారు. గంట తరువాత వరద శాంతించడంతో విద్యార్థులు సురక్షితంగా ఇంటికి వెళ్లిపోయారు. వరద ఇంకా పెరిగి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది.

## డిజిటలీకరణ బాటలో తెరాస

- కొత్త పంథాలో పార్టీ సభ్యత్వాల నమోదు
- ఐటీ నిపుణులతో చర్చించిన కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రసమితి సభ్యత్వాల నమోదును పూర్తిగా డిజిటలీకరించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సభ్యత్వ నమోదులో నూతన ఆవిష్కరణలు జరగాలని కేటీఆర్ ఆకాంక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన డిజిటలీకరణ, ఇతర మార్పులపై సోమవారం ఐటీ నిపుణులతో చర్చించారు. ఇందుకుగాను ప్రతి కార్యకర్తకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించనున్నారు. సభ్యత్వ నమోదు సమయంలో సభ్యుని ఫోన్ నంబరు, ఆధార్, ఇతర వివరాలను తీసుకుంటారు. వాటిని డిజిటలీకరిస్తారు. సభ్యులకు బీమా సదుపాయం కల్పన, సమస్యల్లో ఉన్నప్పుడు వారికి సత్వరసాయం అందించాలని కేటీఆర్ భావిస్తున్నారు. విపత్తు సమయాల్లో తెలంగాణభవన్‌లోని సహాయ కేంద్రం నుంచి వారి వివరాలను సమన్వయం చేసుకుని సత్వరసాయం అందించేలా ఏర్పాట్లు చేయనున్నారు. పార్టీ సందేశాన్ని అందజేయడం, టెలికాన్ఫరెన్స్‌ల నిర్వహణకు ఇది దోహదపడుతుందని అంచనా వేస్తున్నారు. డిజిటలీకరణ, ఐటీ సేవల కోసం పార్టీ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

### కోటి సభ్యత్వాలు లక్ష్యం

రెండేళ్ల క్రితం జరిగిన సభ్యత్వ నమోదులో 70 లక్షల మంది తెరాసలో చేరారు. ఈసారి కోటి సభ్యత్వాలను నమోదు చేయాలని పార్టీ భావిస్తోంది. ప్రతి ఎమ్మెల్యేకు 50 వేల నుంచి 70 వేలు, కొన్నిచోట్ల లక్ష చొప్పున సభ్యత్వాల నమోదుకు లక్ష్యాన్ని నిర్దేశించనున్నారు. సభ్యత్వ నమోదుకు సంబంధించి తెరాసభవన్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. 27న సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు, రాష్ట్ర కార్యవర్గ నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలు సభ్యత్వం తీసుకోనున్నారు. అదేరోజు సభ్యత్వ పుస్తకాల పంపిణీ జరుగుతుంది. మంగళవారం కేటీఆర్ సీనియర్ పార్టీ నేతలను సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జులుగా నియమించనున్నట్లు సమాచారం. కేసీఆర్ ఆమోదంతో వీరిని ఖరారు చేయనున్నట్లు తెలిసింది.

## త్వరలో 2.67 లక్షల రెండు పడక గదుల ఇళ్లు పూర్తి: కేటీఆర్

తెలంగాణలో అతి త్వరలో 2.67 లక్షల రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఇందులో లక్ష ఇళ్లు హైదరాబాద్ నగరంలోనివేనని అన్నారు. రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని సోమవారం ట్విటర్‌లో చెప్పారు. రెండు పడకగదుల నిర్మాణంపై ఒక నెటిజన్ చేసిన ట్వీట్‌కు ఆయన ఈ విధంగా రీట్వీట్ చేశారు.

### యూఏఈలోని భారత కాన్సులేట్ అధికారులకు కృతజ్ఞతలు

దుబాయ్‌లోని తెలంగాణ కార్మికులకు స్థానిక సంస్థ నుంచి వేతన బకాయిలు ఇప్పించేందుకు చొరవ చూపిన యూఏఈలోని భారత కాన్సులేట్ అధికారులకు కేటీఆర్ ట్విటర్‌లో కృతజ్ఞతలు తెలిపారు. బకాయిల చెల్లింపులకు దుబాయ్ కంపెనీ మొరాయించగా కార్మికులు, వారి కుటుంబసభ్యులు కేటీఆర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. ఆయన వెంటనే కాన్సులేట్ అధికారులతో మాట్లాడారు. వారు సోమవారం కంపెనీ ప్రతినిధులను పిలిపించి కార్మికుల సమక్షంలో మాట్లాడగా వేతన బకాయిలను ఇవ్వడానికి అంగీకరించారు. ఈ సమాచారాన్ని కాన్సులేట్ అధికారులు కేటీఆర్‌కు ట్విటర్‌లో తెలపగా వారికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# పీసీసీ అధ్యక్షుడిని మార్చేది లేదు

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు కుంతియా స్పష్టీకరణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్ రెడ్డే కొనసాగుతారని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు రామచంద్ర కుంతియా ప్రకటించారు. కొద్దిరోజులుగా పీసీసీ అధ్యక్షుని మార్పుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయని.. ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటామని, జరగబోయే మున్సిపల్ ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులను ఇప్పటి నుంచే సమాయత్తం చేయాలని నిర్ణయించామన్నారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ ఇన్‌ఛార్జి కార్యదర్శి బోసురాజు, ఏఐసీసీ కార్యదర్శులు సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ తదితరులతో కలిసి కుంతియా సోమవారం గాంధీభవన్‌లో మాట్లాడారు. ఆదివారం రాత్రి జరిగిన టీపీసీసీ కోర్‌కమిటీ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. ప్రతినెలా 1, 2, 3 తేదీల్లో జిల్లా మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీల సమావేశాలు విధిగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీనే కొనసాగాలని ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. మున్సిపల్ ఎన్నికలను ఎదుర్కొనేందుకు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో కమిటీ వేశామన్నారు. 29న నాగార్జునసాగర్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్మానించామని ఆయన చెప్పారు.

### ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిపై చర్యలుంటాయ్

ఏఐసీసీ, టీపీసీసీ నాయకత్వంపైనా, నాయకులపైన అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే విషయాన్ని పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంటుందని కుంతియా తెలిపారు. క్రమశిక్షణ సంఘం నోటీసు ఇచ్చిన తర్వాత కూడా రాజగోపాల్‌రెడ్డి తీరులో ఎలాంటి మార్పు రావడం లేదన్నారు. ఆయన ఎమ్మెల్సీ పదవీకాలం పూర్తికాకున్నా ఎమ్మెల్యే టికెట్ ఇచ్చామని, భార్యకు ఎమ్మెల్సీ టికెట్, వెంకట్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోయినా ఎంపీ టికెట్ ఇచ్చామని, మొదటి నుంచి పార్టీ రాజగోపాల్ కుటుంబానికి ఎంతో గౌరవం ఇస్తూ వచ్చిందని స్పష్టం చేశారు. క్రమశిక్షణ సంఘం వివరణ కోసం ఇచ్చిన గడువు పూర్తయిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. స్వలాభం కోసం పార్టీని వీడేవారిని ఆపడం కష్టమని.. కొందరు పార్టీని వీడినంత మాత్రాన కాంగ్రెస్‌కు వచ్చే నష్టమేమీలేదని కుంతియా అన్నారు.

## ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుపై చర్చించండి: పోచారం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తెలంగాణలో నియోజకవర్గాల వారీగా ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, అధికారులతో చర్చించాలని కేంద్రీయ ఆహార సాంకేతిక పరిశోధనా సంస్థ (సీఎఫ్‌టీఆర్‌ఐ)ను శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని సీఎఫ్‌టీఆర్‌ఐ వనరుల కేంద్రాన్ని పరిశీలించడానికి వచ్చిన ఆ సంస్థ డైరెక్టర్ రాఘవరావు ..సోమవారం సభాపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలం దూలపల్లిలో ఏర్పాటు చేయనున్న సుగంధ ద్రవ్యాల యూనిట్ అంశం వారి మధ్య చర్చకు వచ్చింది. అంతకు ముందు తెలంగాణ రాష్ట్ర ఉద్యాన సంచాలకులు వెంకట్రామిరెడ్డిని కలిసిన రాఘవరావు సుగంధద్రవ్యాల యూనిట్‌పై రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)పై సుదీర్ఘంగా చర్చించారు.

## 'వరంగల్ జిల్లాల' పేర్ల మార్పుపై అభిప్రాయ సేకరణ

ఈనాడు, హైదరాబాద్: వరంగల్ నగర, గ్రామీణ జిల్లాల పేర్లను హన్మకొండ, వరంగల్‌గా మార్చాలనే ప్రతిపాదనపై తెరాస అధిష్ఠానం సమాచారాన్ని సేకరించింది. ప్రజాభిప్రాయంపై ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా తీసింది. జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పిడి ప్రతిపాదన సోమవారం వెల్లడి కావడంతో ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోనూ ఇది చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధిష్ఠానం దీనిపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసనసభ్యులు, మండలి సభ్యులు, ఇతర ముఖ్యనేతల అభిప్రాయాలు తీసుకుంది. సీఎంవో అధికారులు సైతం కొత్త ప్రతిపాదన గురించి శాసనసభ్యులు, మండలి సభ్యులతో మాట్లాడారని తెలిసింది. కొత్త ప్రతిపాదనల నమూనాను సిద్ధం చేయాలని వరంగల్ నగర, గ్రామీణ జిల్లాల ఉన్నతాధికారులను సీఎం కార్యాలయం ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు వరంగల్ తూర్పు నియోజకవర్గ కేంద్రంగా గ్రామీణ జిల్లా పేరును వరంగల్‌గా మార్చాలనే ప్రతిపాదనకు మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

### త్వరలో సీఎం సమావేశం

వరంగల్ నగర, గ్రామీణ జిల్లాల హద్దులు, పేర్ల మార్పిడిపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకటి, రెండు రోజుల్లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసింది. మంత్రి, ప్రజాప్రతినిధులను దీనికి ఆహ్వానించనున్నారు. ఈ నెల 27న తెలంగాణభవన్‌లో జరిగే పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో దీనిపై తన నిర్ణయాన్ని వెల్లడించనున్నారని తెలిసింది. ఆ రోజు నుంచి పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభం కానుంది. జిల్లాల పేర్లను మార్చిన వెంటనే జిల్లా కేంద్రంతోపాటు కలెక్టరేట్, జిల్లా పరిషత్, ఇతర కార్యాలయాల నిర్మాణం, తెరాస జిల్లా కార్యాలయం ఏర్పాటుపై నిర్ణయం ప్రకటించే వీలుంది.

## టీపీసీసీ అధ్యక్ష పదవి రేసులో ఉన్నా: జగ్గారెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: టీపీసీసీ అధ్యక్ష పదవి రేసులో తాను కూడా ఉన్నట్లు సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు ఉత్తమ్ నేతృత్వంలోనే జరగాలని, ఇంకా ఏడాది ఆయననే టీపీసీసీ అధ్యక్షుడిగా కొనసాగించాలని పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జీ కుంతియాను కోరినట్లు పేర్కొన్నారు. ఉత్తమ్‌ను మార్చాల్సి వస్తే... తన పేరును పరిశీలించాలని విజ్ఞప్తి చేశానన్నారు. జగ్గారెడ్డి సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కొత్త పీసీసీ కంటే ముందు మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్‌కు చాలా ముఖ్యమని... పార్టీ శ్రేణులను ఇప్పటినుంచే సమాయత్తం చేయాలన్నారు.

## పురపాలక ఎన్నికల్లో సత్తా చాటుదాం

### భాజపా కోర్ కమిటీ సమావేశంలో నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్:రాష్ట్రంలో త్వరలో జరగనున్న పురపాలక ఎన్నికల్లో సత్తా చాటాలని భాజపా నిర్ణయించింది. ఎన్నికల నేపథ్యంలో ప్రతి పురపాలక సంఘానికి బాధ్యుల్ని నియమించి ఇప్పటి నుంచే పార్టీపరంగా కార్యాచరణ అమలు చేయాలని సోమవారం పార్టీ రాష్ట్రాధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగిన కోర్‌కమిటీ సమావేశంలో తీర్మానించారు. పురపాలక ఎన్నికలతో పాటు హుజూర్‌నగర్ శాసన సభ స్థానంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల దిశగా పార్టీని బలోపేతం చేయాలని నిర్ణయించారు. హుజూర్‌నగర్‌కు ఇన్‌ఛార్జి నియామకం, పార్టీ టికెట్ ఆశిస్తున్న అయిదుగురు ఆశావహులతో సమన్వయం చేసుకునేలా చర్చించారు. ఇప్పటివరకూ హుజూర్‌నగర్‌లో సంస్థాగతంగా బలంగా లేకున్నా కాంగ్రెస్, తెరాసల్లోని అసమ్మతిని సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై చర్చించారు. భాజపా సభ్యత్వ నమోదుపై చర్చిస్తూ ఇప్పుడున్న నమోదును రెట్టింపు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్రంలో 34 వేల పోలింగ్ బూత్‌లు ఉండగా ప్రతి బూత్‌కు కనీసం 50 మందిని కొత్తగా సభ్యత్వ నమోదు చేయించడం లక్ష్యంగా నిర్దేశించనున్నారు. పార్టీలో చేరికలను ప్రోత్సహించాలని.. వివిధ పార్టీల నేతలనే కాకుండా ఇతర రంగాలకు చెందిన వారిని చేర్చుకునేందుకు ప్రాధాన్యమివ్వాలని నేతలు అభిప్రాయపడ్డారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ఎమ్మెల్యే రాజాసింగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


Get benefit of subsidy upto Rs. 2.67 lakhs* on your home loan
Under Pradhan Mantri Awas Yojana Credit linked subsidy scheme
LIC HFL LIC HOUSING FINANCE LTD
Building homes. Nurturing relationships.
Presents
APNAGHAR
For first time home buyers
For additional benefits on your home loan log on
www.lichousing.com



WWW.LPU.IN
LOVELY PROFESSIONAL UNIVERSITY
Transforming Education Transforming India
Think BIG
NEW AGE COMPUTER SCIENCE & ENGINEERING PROGRAMMES
Today's advancing IT industry awaits the young minds with abundant opportunities in new age fields like Machine Learning, Big Data, Artificial Intelligence, and what not! LPU B.Tech. programmes in these specialized area are designed to help students excel in groundbreaking technologies.
PROGRAMMES DESIGNED FOR THE FUTURE
B.Tech. (CSE)
B.Tech. (CSE) (Hons.)
B.Tech. - M.Tech. (CSE)
B.Tech. (CSE) - MBA
CSE SPECIALISATIONS
Big Data, Android Application Development, Machine Learning, Cloud Computing, Cyber Security, Data Science, Full Stack Web Development, Robotics & Automation, DevOps, Internet of Things (IoT)
OTHER B.TECH. STREAMS
ECE, CSE, IT, ME, ME- Mechatronics, Aerospace Engg., Automobile Engg., Civil Engg., Electrical Engg., Electrical & Electronics Engg., Biotechnology, Food Tech., Biomedical Engg., Chemical Engg., Petroleum Engg.
INDUSTRY COLLABORATED PROGRAMMES
All these specialisations are offered in collaboration with industry leaders including Google, Oracle, SAP, Cisco, Dell EMC, Juniper, Pegasystems, VMware, Informatica, CompTIA, Automation Anywhere.
UNBEATABLE PLACEMENTS
1000's of LPU students placed in top MNCs in USA, UK, Canada, Australia etc. 500+ multinational & national companies including Google, Amazon, Lutron, HP, Bosch have recruited LPU Students. 110+ companies that recruit from IITs, NITs and IIMs also recruit from LPU.
Scholarships SCHOLARSHIP OF UPTO ₹ 3 LAKH PER STUDENT
LAST DATE OF ADMISSION WITH SCHOLARSHIP 30th JUNE 2019
Meet our Counsellors in Telangana | Time: 10 AM to 7 PM | Toll Free: 1800-102-4428
KHAMMAM | Budget Hotel, 2-2-58, Gandhi chowk, Near Gandhi Statue | 25-26 June
WARANGAL | City Grand Hotel, S.V.P. Road, Rangampet | 27-30 June
LOVELY PROFESSIONAL UNIVERSITY (LPU), Jalandhar-Delhi G.T. Road, Phagwara, Punjab
admissions@lpu.co.in | SMS LPU to 53030 | Toll Free: 1800-102-4428 SUNDAY OPEN



తెలంగాణ రాష్ట్రంలో ఖరీఫ్ 2019 ఋతువులో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పి.ఎమ్.ఎఫ్.బి.వై.) మరియు పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్.డబ్ల్యు.బి.సి.ఐ.ఎస్.) అమలు

IFFCO-TOKIO GENERAL INSURANCE Muskurate Raho

తెలంగాణ రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాల సహకారంతో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పి.ఎమ్.ఎఫ్.బి.వై.) - ఖరీఫ్ 2019
UIN: IRDAN106RP0001V01201617
మరియు పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్.డబ్ల్యు.బి.సి.ఐ.ఎస్.)- ఖరీఫ్ 2019
UIN: IRDAN106RP0009V01201718

బీమా చేయుటకు అర్హులైన రైతులు: అన్ని రకాల రైతులు ( భూమి హక్కుదారు / భాగస్వామ్య / కౌలు )
అర్హత: తప్పనిసరి: బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల నుంచి వారు మంజూరు చేసిన ఋణ పరిమితికి అనుగుణంగా ఖరీఫ్ 2019వ సంవత్సరంలో ఆయా గ్రామము/ మండలంలో గల ఎంపిక చేసిన పంటలకు ఋణాలు తీసుకొను రైతులు.
ఐచ్ఛికంగా: ఋణాలు పొందని రైతులు కూడా స్వచ్ఛందంగా ప్రతిపాదన పత్రాన్ని మరియు అవసరమైన ఇతర పత్రాలను జత చేస్తూ ప్రీమియం మొత్తాన్ని దగ్గరలో గల వాణిజ్య బ్యాంకులలో / జిల్లా కేంద్ర సహకార బ్యాంకులలో/ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులలో/ కామన్ సర్వీస్ సెంటర్ (CSC) / ఇఫ్కో టోకియో లేదా ఆన్‌లైన్ ద్వారా www.pmfby.gov.in చెల్లిస్తూ ఈ పథకంలో చేరవచ్చును.

| ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పి.ఎమ్.ఎఫ్.బి.వై.) క్రింద | |
|---|---|
| ఎంపిక చేసిన పంటలు | ఎంపిక చేయబడిన జిల్లాలు |
| సోయాబీన్ | ఆదిలాబాద్, జగిత్యాల్, కొమరంభీమ్ (ఆసిఫాబాద్) |
| జొన్న | ఆదిలాబాద్, కొమరంభీమ్ (ఆసిఫాబాద్) |
| కంది | ఆదిలాబాద్, కొమరంభీమ్ (ఆసిఫాబాద్)మంచిర్యాల్, జగిత్యాల్, కరీంనగర్, సిద్ధిపేట్, జనగాం |
| మినుము | ఆదిలాబాద్ |
| పెసర | ఆదిలాబాద్, కొమరంభీమ్ (ఆసిఫాబాద్), జగిత్యాల్, జనగాం |
| పసుపు | జగిత్యాల్ |
| వరి | సిద్ధిపేట్, కొమరంభీమ్ (ఆసిఫాబాద్),మంచిర్యాల్, జగిత్యాల్, పెద్దపల్లి, జయశంకర భూపాలపల్లి, ములుగు, కరీంనగర్, జనగాం, రాజన్న సిరిసిల్ల |
| మొక్కజొన్న | కొమరంభీమ్ (ఆసిఫాబాద్), జగిత్యాల్, పెద్దపల్లి, ములుగు, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జనగాం, సిద్ధిపేట్ |

| పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్.డబ్ల్యు.బి.సి.ఐ.ఎస్.) క్రింద | |
|---|---|
| ఎంపిక చేసిన పంటలు | ఎంపిక చేయబడిన జిల్లాలు |
| పత్తి | ఆదిలాబాద్, కొమరంభీమ్ (ఆసిఫాబాద్) మంచిర్యాల్, సిద్ధిపేట్, జయశంకర భూపాలపల్లి ములుగు, జనగాం, జగిత్యాల్, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల |
| టమాటో | ఆదిలాబాద్ |
| మిరప | మంచిర్యాల్, జయశంకర భూపాలపల్లి, ములుగు, జగిత్యాల్, జనగాం |

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పి.ఎమ్.ఎఫ్.బి.వై.) ముఖ్యోద్దేశాలు: ఈ పథకం క్రింద బీమా చేసిన వారికి ఆయా ఎంపిక చేసిన బీమా యూనిట్ (గ్రామము/మండలం)లో ప్రకృతి వైపరీత్యాల వలన మరియు ఇతర పేర్కొనబడిన ప్రమాదాల వలన పంట నష్టం సంభవించిన యెడల పాలసీలో పొందుపరిచిన నిబంధనలు మరియు పరిస్థితులకు అనుగుణంగా పరిహారం చెల్లించబడుతుంది.

పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్.డబ్ల్యు.బి.సి.ఐ.ఎస్.) ముఖ్యోద్దేశాలు: ఈ పథకం క్రింద బీమా చేసిన వారికి పంట నష్టం జరిగినపుడు (మండల వారీగా) రైతులకు పరిహారం చెల్లించుటలో వాతావరణ పరిమితులను పంట దిగుబడులను ప్రత్యామ్నాయంగా (ప్రోక్సీ ఇండికేటర్స్) భావించబడుతున్న పంట నష్టాలకు ఉపయోగిస్తుంది. ఈ పథకం క్రింద చెల్లింపు విధి విధానాల నియమావళి అనగా - టర్మ్-షీట్స్, భావించబడిన పంట నష్టాల మేరకు నిర్దిష్ట కాలానికి, వాస్తవ వాతావరణ సమాచారాన్ని పంటకు అనువైన వాతావరణ ట్రిగ్గర్స్‌తో పోల్చి తయారు చేస్తారు.

బీమా చేయించుకోవటం ఎక్కడ మరియు ఎలా: దగ్గరలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోగానీ, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు / ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు / వాణిజ్య బ్యాంకు / కామన్ సర్వీస్ సెంటర్ (CSC) / ఇఫ్కో టోకియో లేదా ఆన్‌లైన్ ద్వారా www.pmfby.gov.in

| రైతుల నుండి ప్రీమియం సేకరణకు ఆఖరు తేదీ: | |
|---|---|
| పంటల పేర్లు | ఆఖరి తేది |
| పత్తి | 15.7.2019 |
| జొన్న, మొక్కజొన్న, కంది, పెసర, మినుము, సోయాబీన్, పసుపు | 31.7.2019 |
| వరి, మిరప, టమాటో | 31.8.2019 |

★ పంటల బీమా గురించి అధిక సమాచారం కొరకు దయచేసి కేంద్ర ప్రభుత్వము యొక్క వెబ్ పోర్టల్ www.pmfby.gov.in ను సంప్రదించగలరు.
★ బీమా అనేది అభ్యర్థనకు సంబంధించిన విషయం.
★ నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి.
★ ప్రమాద కారకాలు, నిబంధనలు మరియు షరతులు గురించి, అధిక వివరాల కొరకు అమ్మకం ముక్తాయింపు ముందు దయచేసి అమ్మకాలు కరపత్రాన్ని జాగ్రత్తగా చదవగలరు.
★ ఏదైనా వివాదం వున్న యెడల అంతిమంగా ఆంగ్ల అనువాదం వర్తిస్తుంది.

అధిక సమాచారం కొరకు కార్యాలయ చిరునామా:
కార్పొరేట్ కార్యాలయం : ఇఫ్కో టవర్ 2, ప్లాట్ నెం. 3,సెక్టారు-29, గుర్‌గావ్ (హర్యానా)-122001.
కాల్ సెంటర్ : 1800-103-5499 (టోల్‌ఫ్రీ నెం) లేదా 0124-4285499. వెబ్‌సైట్: www.iffcotokio.co.in
IRDAI Regd.No.106 CIN:U74899DL2000PLC107621 UAN:ITGI/19-20/InsAdvt/Rural-01

ఈనాడు

## విష సంస్కృతిపై బ్రహ్మాస్త్రం

నారీమణుల్ని గౌరవించిన చోట దేవతలు నడయాడతారని శతాబ్దాలుగా విశ్వసించిన పుణ్యధరిత్రి ఇది. మహిళను మాతృస్వరూపంగా సంభావించిన ఉత్కృష్ట సంస్కృతీ సంప్రదాయాలకు, యావత్ ప్రపంచాన్నీ అబ్బురపరచిన మానవీయ విలువలకు నెలవుగా పేరెన్నికగన్న దేశమిది. అటువంటి భారతావనిలో అమ్మాయిలపై పెచ్చరిల్లుతున్న లైంగిక వేధింపులు జాతి గౌరవప్రతిష్ఠల్ని కుళ్లబొడుస్తున్నాయి. అడ్డూఅపూ లేకుండా రెచ్చిపోతున్న మానవ మృగాల పైశాచికత్వానికి దేశం నలుమూలలా ఉదాహరణలెన్నో పోగుపడుతున్నాయి. వరంగల్ జిల్లా హన్మకొండలో, తల్లిపొత్తిళ్ల నుంచి తొమ్మిది నెలల పసిగుడ్డును అపహరించుకుపోయి అఘాయిత్యానికి తెగబడి హతమార్చిన హోటల్ క్లీనర్ దురంతం సభ్య ప్రపంచాన్ని నిశ్చేష్టపరచింది. ఆ వార్తాకథనాల సిరా తడి ఆరక ముందే ఒంగోలులో పదిహేడేళ్ల బాలిక మీద సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ ఆరుగురి ఉదంతం గగ్గోలు పుట్టిస్తోంది. నిందితుల్లో ముగ్గురు మైనర్లు! భాగ్యనగరంలో పిల్లలపై లైంగిక దాడులు మూన్నాళ్లలో నాలుగు వెలుగుచూశాయి. ఈ మధ్య హోలీ విందులో మత్తు తలకెక్కిన ఓ మృగాడు ఆరేళ్ల పసికందుపై హత్యాచారానికి ఒడిగట్టిన హైదరాబాద్ నగరాన ఏడాది వ్యవధిలోనే పసివాళ్లపై అమానుష దాడుల సంఖ్య వెయ్యికి పైబడింది. 'అయిదేళ్ల పసిపాప మీదా క్రూర అత్యాచారమా? ఎక్కడో ఏదో లోపం ఉంది!' అని లోగడ దిల్లీ ఉన్నత న్యాయస్థానం దిగ్భ్రమ చెందడం తెలిసిందే. అనంతర కాలంలో దేశం నలుమూలలా అటువంటి దారుణోదంతాలు పునరావృతమయ్యే వేగం పెరిగి, బాలికల పాలిట ఇది అభద్ర భారతమని పదేపదే రుజువవుతోంది. కేంద్రప్రభుత్వం నిర్వహింపజేసిన జాతీయ నమూనా సేకరణ నివేదికే- లేతమొగ్గలకు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులతోపాటు సన్నిహితులు, కుటుంబ సభ్యుల నుంచీ రక్షణ, భరోసా కొరవడుతున్న యథార్థాన్ని కుండ బద్దలు కొట్టింది. ముమ్మరిస్తున్న ఈ మానవ తోడేళ్ల ఉరవడి, విస్తృత దిద్దుబాటు చర్యల ఆవశ్యకతను చాటుతోంది.

మూడు వారాల క్రితం ఒక కేసు విచారణలో బాంబే హైకోర్టు వ్యాఖ్యానించినట్లు- 'అత్యాచార బాధితులు ఎదుర్కొనే వేదన జీవితకాలం ఉంటుంది... హత్యకన్నా అత్యాచారమే దారుణమైన నేరం'! అంతటి తీవ్ర ఘాతుకాలూ ఎడాపెడా చోటుచేసుకుంటున్నాయంటే ఏమిటి అర్థం? నిబంధనలకేం- దేశంలో లెక్కకు మిక్కిలి పోగుపడ్డాయి. సుపరిపాలన కొరవడినందువల్లనే చట్టాలు చట్టుబండలై అభద్ర వాతావరణం రాజ్యమేలుతోందన్న జస్టిస్ జేఎస్ వర్మ మాటలు సమకాలీన భారతానికి యథాతథంగా అన్వయిస్తాయి. సమాజంలో కుబుసం విడిచిన కుసంస్కారానికి నిలువుటద్దమీ అత్యాచారాల పర్వం. శిక్షలంటే నేరగాళ్లలో బెదురన్నదే కరవై, పశుప్రవృత్తి ఎగదన్ని, అకృత్యాలు జోరెత్తుతున్నాయి. భారతీయ శిక్షాస్మృతిని, లైంగిక దాడులనుంచి బాలల రక్షణ చట్టాన్ని సవరించి కఠిన దండనలు పొందుపరచిన తరవాతా, పాశవిక నేరాలెన్నో వెలుగుచూస్తూనే ఉన్నాయి. శాసన నిర్మాణంతోనే నేరాలు ఘోరాలు సమసిపోవని నిర్ధారణ అయిన నేపథ్యంలో- మదోన్మత్తతకు బలైన వరంగల్ పసికందు కేసుకు సంబంధించి ఫాస్ట్‌ట్రాక్ విచారణ చేపట్టాలని జాతీయ బీసీ కమిషన్ సభ్యులు సూచిస్తున్నారు. అలా ఏ ఒక్క కేసునో శీఘ్రతర విచారణకు పరిమితం చేయడం కాదు. పసిమొగ్గల్ని కర్కశంగా చిదిమేస్తున్న మృగోన్మాదుల దాష్టీకాలన్నింటిపైనా శీఘ్రతర దర్యాప్తు, విచారణలే శిరోధార్యం. దోషులకు కఠిన శిక్షలు విధించి సత్వరం అమలుపరచే వాతావరణం, నేరప్రవృత్తి కలిగిన ఇతరుల్లో సహజంగానే బెదురు పుట్టిస్తుంది. అందుకు భిన్నంగా కేసుల విచారణ ఏళ్లూపూళ్లూ సాగే ఆనవాయితీ చెక్కుచెదరనన్నాళ్లు, వనితలపై కిరాతకాలు ఇంతలంతలవుతూనే ఉంటాయి.

ఐక్యరాజ్య సమితి రూపొందించిన బాలల హక్కుల ప్రకటనపై సంతకం చేసిన దేశాల్లో భారత్ సైతం ఒకటి. అమెరికా, ఇంగ్లాండ్ ప్రభృత దేశాలు కచ్చితమైన విధి నిషేధాలతో బాలల సంరక్షణ యోజనల్ని అమలుపరుస్తుండగా- దేశీయంగా స్వేచ్ఛ, రక్షణ, విశ్వాసాలతో కూడిన బాల్యదశను పొందే పిల్లల హక్కు ఎండమావిని తలపిస్తోంది. ఈ దురవస్థను బదాబదలు చేసే కసరత్తుకు బడిలోనే బీజావాపనం జరగాలి. తోటివారిని గౌరవించి సమాదరించడం, రాజీపడటం నేర్చుకుని మర్యాదగా సర్దుబాట్లు చేసుకోవడం, స్త్రీల పట్ల సభ్యతా సంస్కారాలు ఉట్టిపడేలా ప్రవర్తించడం... ఇవన్నీ పాఠ్యాంశాల్లో, బోధనలో అంతర్భాగమయ్యేలా విద్యాప్రణాళికల్ని ప్రక్షాళించాలి. ఉత్తమ విలువలతో కూడిన విద్యే నాగరిక జాతిని నిర్మించగలుగుతుంది. ఇంట్లో తల్లిదండ్రులు కూతుర్ని, కొడుకును సమానంగా పరిగణిస్తూ వారిలో సంస్కార బీజాలు నాటడమెంత ముఖ్యమో- పిల్లల ప్రవర్తనను ఒద్దిగ్గా తీర్చిదిద్దే బోధన విధానాలతో పాఠశాలలు పరిపుష్టం కావడం అంతే అత్యావశ్యకం. స్త్రీని ఆటబొమ్మగా, వినోద సాధనంగా పరిగణించే దుర్మార్గ సంస్కృతిని యువతకు మప్పుతున్న చౌకబారు వీడియోలపై; మనిషిలో మృగాన్ని రెచ్చగొడుతున్న మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలపైనా ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలి. దశాబ్దాలుగా వ్యూహనిర్ణేతలు ఈ పార్శ్వాన్ని విస్మరించిన పర్యవసానంగా- దేశంలో లైంగిక హింస, అమానుష దాడులు, అమ్మాయిల అక్రమ రవాణా ఇంతగా పోటెత్తుతున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారమే, రోజుకు 180 మంది బాలబాలికలు అదృశ్యమైపోతున్న దేశంలో- లైంగిక దాడుల ఉద్ధృతీ భీతిల్లజేస్తోంది. ఆసేతు హిమాచలం పాఠశాల స్థాయి నుంచీ నైతిక విద్యాబోధనను చురుగ్గా పట్టాలకు ఎక్కించడమే- హేయ, విష సంస్కృతిని పరిమార్చే బ్రహ్మాస్త్రం కాగలుగుతుంది!

# వాణిజ్యంలోనూ అదే పెడసరం

విదేశీ వాణిజ్యం దేశ ఆర్థికాభివృద్ధికి ఒక మూలస్తంభం. ప్రపంచంలో ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాల ప్రగతిలో విదేశీ వాణిజ్యం గణనీయమైన పాత్ర పోషించిందనేది చారిత్రక సత్యం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల నీతి ఆయోగ్ అయిదో వార్షిక సదస్సులో మాట్లాడుతూ 2024 నాటికల్లా భారత్ అయిదు లక్షల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందాలని, అది సాధించడంలో విదేశీ వాణిజ్యానిదే ప్రధాన పాత్ర అని నిర్దేశించారు. ఇది సాధించాలంటే ప్రపంచ దేశాల మధ్య స్వేచ్ఛావాణిజ్య వాతావరణాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉంది. కానీ, ప్రస్తుతం ప్రపంచ దేశాలు, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు, నియంత్రిత వాణిజ్యం వైపు అడుగులేస్తున్నాయి. ఈ దిశగా డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన అమెరికా ముందంజలో ఉంది. మొన్నటికి మొన్న చైనా దిగుమతులపై సుంకాలు పెంచి, వాణిజ్య యుద్ధానికి తెరతీసింది. తరవాత భారత్ విషయంలోనూ ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించేందుకు సిద్ధమైంది. ఫలితంగా అమెరికా, భారత్ పరస్పరం ప్రతీకార చర్యగా దిగుమతి సుంకాలు అధికంగా విధించుకుంటున్నాయి. దీనివల్ల షేర్ మార్కెట్లు పడిపోతున్నాయి. ఇదే కొనసాగితే, రెండు దేశాల ఆర్థికాభివృద్ధికి నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

అమెరికా- భారత్‌కు రెండో అతిపెద్ద దిగుమతిదారు, మూడో అతిపెద్ద ఎగుమతిదారు. భారత్- అమెరికాకు 15వ అతిపెద్ద దిగుమతిదారు, 11వ అతిపెద్ద ఎగుమతిదారు. 2018లో రెండు దేశాల మధ్య మొత్తం వాణిజ్యం విలువ 14,200 కోట్ల డాలర్ల పైచిలుకే. ఇందులో సుమారు 62 శాతం వస్తువుల రూపంలో, మిగతా 32 శాతం సేవల రూపంలో జరుగుతోంది. మన దేశ వాణిజ్య మిగులు సుమారు 2,400 కోట్ల డాలర్లు. రెండుదేశాల మధ్య వాణిజ్యంలో భారత్ ఎప్పుడూ వాణిజ్య మిగులును కలిగిఉండటం అమెరికాకు కొరుకుడు పడని విషయం. అమెరికా నిర్వహించే మొత్తం ప్రపంచ వాణిజ్యంలో భారత్‌తో చేసేది కేవలం రెండు శాతం. కానీ, వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ, పెరుగుతున్న మధ్యతరగతి ప్రజానీకం వల్ల భవిష్యత్తులో అమెరికా ఉత్పత్తులకు భారత్ పెద్ద విపణిగా కనిపిస్తోంది. 2014లో ఒప్పందం ప్రకారం రెండు దేశాల మధ్య వస్తుసేవల ద్వైపాక్షిక వాణిజ్యం 50 వేలకోట్ల డాలర్లకు చేరాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. దాని అమలులో మాత్రం చిత్తశుద్ధి చూపించక, భారత్‌ను లొంగదీసుకోవాలని అమెరికా యథాశక్తి ప్రయత్నిస్తోంది.

### ఇష్టానుసారంగా సుంకాల పెంపు

ప్రస్తుతం అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన దేశ ఆర్థిక పరిస్థితి మరింత కుంటుపడింది. నిరుద్యోగం పెరిగి, వాణిజ్య లోటు ఎక్కువైంది. దీంతో ఆ దేశం నియంత్రిత వాణిజ్యం వైపు మరింత వేగం పెంచింది. ఈ క్రమంలోనే వాణిజ్య లోటు ఎక్కువగా ఉన్న చైనా దిగుమతులపై సుంకాలు పెంచింది. దీనివల్ల అమెరికాకు భారత్ నుంచి ఎగుమతులు పెరిగి, భారత్ లాభపడుతుందని విశ్లేషకులు భావించినా, అందుకు విరుద్ధంగా భారత్ నుంచి వచ్చే దిగుమతుల మీదా అమెరికా సుంకం పెంచసాగింది. మొదట దేశ రక్షణ నెపంతో అమెరికా మనదేశం నుంచి దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియం ఇతర లోహ సంబంధిత వస్తువులపై 21.90 కోట్ల డాలర్ల మేర సుంకాలను పెంచింది. చర్చలు విఫలమైన తరవాత ప్రతీకార చర్యగా భారత్ కూడా అమెరికా నుంచి దిగుమతి చేసుకునే 28 రకాల వస్తువులపై అదే స్థాయిలో సుంకం విధించింది. తమ ఉత్పత్తులకు సమాన రీతిలో మార్కెట్ కల్పించడంలేదన్న నెపంతో 1976 నుంచి కొనసాగుతున్న జనరలైజ్డ్ సిస్టం ఆఫ్ ప్రిఫరెన్స్ (జీఎస్‌పీ) ద్వారా లబ్ధి పొందే దేశాల జాబితా నుంచి భారత్‌ను అమెరికా తొలగించింది. జీఎస్‌పీ విధానంలో అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి కొన్ని రకాల వస్తువులను... ముఖ్యంగా ముడిపదార్థాలను తక్కువ సుంకంతో లేదా సుంకాలు లేకుండా దిగుమతి చేసుకుంటాయి. ఇది అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. అమెరికా, ఐరోపా సమాఖ్య దేశాలు, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు జీఎస్‌పీని అమలు చేస్తున్నాయి.

అమెరికా జీఎస్‌పీ వల్ల సుమారు 120 అభివృద్ధి చెందుతున్న దేశాలు లబ్ధిదారులుగా ఉన్నాయి. 2018లో జీఎస్‌పీ కింద భారత్ నుంచి అమెరికా దిగుమతి చేసుకునే మొత్తం వస్తువుల విలువ 630 కోట్ల డాలర్లు. మొత్తం జీఎస్‌పీ దిగుమతుల్లో ఇది 11 శాతం. జీఎస్‌పీ నుంచి తొలగించడం వల్ల, భారత్ అమెరికాకు జీఎస్‌పీ కింద ఎగుమతి చేసే 1,900 రకాల వస్తువులపై ఒకటి నుంచి ఏడు శాతం దిగుమతి సుంకం విధించడం వల్ల 19 కోట్ల డాలర్ల భారం పెరుగుతుంది. దీనివల్ల మనదేశ ఎగుమతిదారులకే కాకుండా, అమెరికా దిగుమతిదారులకూ నష్టం వాటిల్లుతుంది. ఆయా వస్తువులను ముడిపదార్థాలుగా ఉపయోగించే కంపెనీల ఉత్పత్తి, ఉపాధి,



అమెరికా నియంత్రిత విధానాలతో చేటు

ఎగుమతుల సామర్థ్యం దెబ్బతింటుంది. అందువల్లే అమెరికాలో కొంత మంది చట్టసభ సభ్యులు జీఎస్‌పీ నుంచి భారత్ తొలగింపును వ్యతిరేకిస్తూ, దీనిపై పునరాలోచించాలని అభ్యర్థించారు.

భారత్‌ను జీఎస్‌పీ నుంచి అమెరికా తొలగించడానికి కారణం- వారి నాలుగు రకాల ఉత్పత్తులకు (వైద్య పరికరాలు, పాల ఉత్పత్తులు, టెలికాం పరికరాలు, ఈ-కామర్స్ సంబంధిత వినియోగదారుల సమాచారం) మన మార్కెట్‌ను పూర్తిగా తెరవకపోవడం. గుండె శస్త్రచికిత్సలో ఉపయోగించే స్టెంట్స్ వంటి వైద్య పరికరాలను అమెరికా నుంచే ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నాం. భారత ప్రభుత్వం వాటి ధరలను నియంత్రించడం అమెరికా కంపెనీలకు ఆమోదయోగ్యంగా లేదు. పాల సంబంధిత వస్తువుల దిగుమతుల విషయంలో, జంతువుల రక్తమాంసాలు కలిసిన ఆహారం తిన్న పశువుల నుంచి లభ్యమయ్యే పాల ఉత్పత్తులను భారత్ నివారించడం అమెరికా పాల ఉత్పత్తుల కంపెనీలకు రుచించడంలేదు. మన దేశంలో ఈ అంశం మత సంస్కృతుల దృష్ట్యా సున్నితమైంది. కాబట్టి, వాటి దిగుమతులకు అవకాశం కల్పించలేదు. ఇక టెలికాం సంబంధిత పరికరాల మీద కస్టమ్ సుంకాలను మరింత తగ్గించాలనే అమెరికా డిమాండుకు భారత్ తలొగ్గకపోవడం, మన దేశ ఈ-కామర్స్ సంబంధిత వినియోగదారుల సమాచారాన్ని అమెరికా బహుళ జాతి కంపెనీలకు అందనివ్వకుండా మన దేశం చట్టం తేవాలనుకోవడం అమెరికా కంపెనీలకు మింగుడుపడటం లేదు.

### నియమాలకు విరుద్ధం...

దేశాల మధ్య స్వేచ్ఛావాణిజ్యాన్ని పెంపొందించి, పరిరక్షించాలనే ఉద్దేశంతో 1995లో 'ప్రపంచ వాణిజ్య సంస్థ'ను స్థాపించారు. ఈ సంస్థ ఏర్పాటులో పెద్దన్న పాత్ర పోషించిన అమెరికాయే ఇప్పుడు దాని నియమాలకు వ్యతిరేకంగా పనిచేస్తోంది. దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఉల్లంఘనలపై ప్రపంచ వాణిజ్య సంస్థ ఫిర్యాదు చేస్తే వాటి నిమిత్తం పని చెయ్యాల్సిన 'వివాదాల పరిష్కార సంస్థ' కఠిన చర్యలు తీసుకునే స్థితిలో లేదు. అత్యున్నత సమస్యలను పరిష్కరించే 'అప్పిలేట్ బోర్డు' సైతం తగినంత మంది న్యాయవాదులు లేక సరిగ్గా పని చేయడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో, సభ్య దేశాలు వాణిజ్య ఉల్లంఘనలు జరిగినప్పుడు ప్రపంచ వాణిజ్య సంస్థకు ఫిర్యాదు చేసే బదులు, పక్క మార్గాలను ఎంచుకుంటున్నాయి. ఒక దేశాన్ని జీఎస్‌పీ నుంచి తొలగించడం ప్రపంచ వాణిజ్య సంస్థ నియమాల ప్రకారం 'నాన్-ప్రిఫరెన్షియల్ ట్రీట్‌మెంట్' కిందకు వస్తుంది. దీని ప్రకారం మనదేశం ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన వివాద పరిష్కార సంస్థకు ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నప్పటికీ, అక్కడ న్యాయం లభించే అవకాశం లేదనే భావనతో, దీర్ఘకాల సత్సంబంధాలను దృష్టిలో పెట్టుకుని మన దేశం చర్యలు తీసుకోవడంలేదు. 2003లో ఇదే విషయంలో మనదేశం ఐరోపా యూనియన్‌కు వ్యతిరేకంగా ప్రపంచ వాణిజ్య సంస్థ వివాద పరిష్కార సంస్థలో కేసు గెలిచింది. కాబట్టి, ఇప్పుడూ భారత్ ఈ అవకాశాన్ని వదులుకోకూడదు.

అమెరికా తనకు లాభసాటిగా ఉన్నంతవరకు స్వేచ్ఛావాణిజ్య సూత్రాన్ని వల్లెవేసింది. ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశాలు- అనేక సంస్కరణల ప్రయాసలకోర్చి, తమ నవకల్పనలు, చవకైన శ్రామిక శక్తితో తయారుచేసిన వస్తు సేవలతో ప్రపంచ వాణిజ్యంలో అవకాశాలను అందిపుచ్చుకొంటున్నాయి. ఇదే సమయంలో అమెరికా నియంత్రిత వాణిజ్యం వైపు అడుగులేస్తోంది. స్వేచ్ఛా వర్తక వాణిజ్యంలో ఇలాంటి పోకడలకు వ్యతిరేకంగా భారత్ మిగతా దేశాలను కలుపుకొని ముఖ్యంగా బ్రిక్స్ వంటి సంస్థల సాయంతో గట్టిగా దౌత్య పరమైన పోరాటం చేయవలసిన అవసరం ఉంది. భారత్ కూడా అమెరికాకు ఎగుమతులు చేసే వస్తువుల రకాలను మార్చవలసిన అవసరం ఉంది. ఇప్పటికీ అమెరికాకు ముడిసరకులు ఎగుమతి చేసే దేశంగానే భారత్ ఉంది. అలాకాకుండా, అదనపు విలువ జోడించిన అంతిమ స్థాయి మూలధన, వినియోగ వస్తువులను ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి. ఎగుమతులను ప్రోత్సహించే అన్ని రకాల మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలి. అప్పుడే ఎగుమతులు దిగుమతులు ఇనుమడించి ప్రపంచ వాణిజ్య రంగం భారత్‌లోనూ ఊపందుకుంటుంది. ప్రధాని మోదీ కలలు కంటున్న ఆర్థికాభివృద్ధికి అది ఎంతగానో దోహదపడుతుంది.

**భారత్-అమెరికాల మధ్య మొత్తం వస్తు సేవల వాణిజ్య విలువ** (వందల కోట్ల డాలర్లలో)

| సంవత్సరం | వస్తువులు | | సేవలు | | మొత్తం వస్తుసేవలు | | |
|---|---|---|---|---|---|---|---|
| | ఎగుమతులు | దిగుమతులు | ఎగుమతులు | దిగుమతులు | ఎగుమతులు | దిగుమతులు | వాణిజ్యం మిగులు |
| 2013 | 41.8 | 21.8 | 20.4 | 13.3 | 62.2 | 35.1 | 27.1 |
| 2014 | 45.4 | 21.5 | 22.4 | 15.3 | 67.8 | 36.8 | 31.0 |
| 2015 | 44.8 | 21.5 | 24.7 | 18.5 | 69.4 | 40.0 | 29.4 |
| 2016 | 46.0 | 21.6 | 25.8 | 20.6 | 71.8 | 42.3 | 29.5 |
| 2017 | 48.6 | 25.7 | 28.1 | 23.7 | 76.7 | 49.4 | 27.3 |
| 2018 | 54.4 | 33.1 | 28.8 | 25.8 | 83.2 | 58.9 | 24.3 |

ఆధారం: అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం

– డాక్టర్ చీరాల శంకర్ రావు
(రచయిత– ఆర్థిక రంగ నిపుణులు)

# ప్రాణాలు తోడేస్తున్న వాయు కాలుష్యం

తీవ్రమైన వాయు కాలుష్యం బారినపడి భారతావని ఉక్కిరిబిక్కిరి అవుతోంది. నగరాల్లోని 80శాతం ప్రజలు వాయు కాలుష్యం కారణంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) నివేదిక ప్రకారం మరే దేశంతో పోల్చినా భారత నగరాల్లోనే పీల్చేగాలి ప్రాణాంతకంగా మారిన దురవస్థ అధికంగా కనిపిస్తోంది. ప్రపంచంలో వాయు కాలుష్యం స్థాయి అత్యధికంగా ఉన్న పన్నెండు నగరాల జాబితాలో భారత్‌లోనే పదకొండు ఉండటమన్నది బాధ కలిగించే వాస్తవం. ఆ జాబితాలో భారత్‌లోని కాన్పూర్, ఫరీదాబాద్, వారణాసి నగరాలు తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. వాహనాల పొగ, బొగ్గును మండించడం, విచ్చలవిడిగా వంటచెరకు వాడకం, ప్రమాదవశాత్తు అడవులు తగలబడటం వంటివన్నీ భారత్‌ను వాయు కాలుష్య కేంద్రంగా మారుస్తున్నాయి. మనదేశం భౌగోళికంగా కొండలు, పర్వతాలతో నిండిన ప్రాంతం కావడంతో, ఆవరించిన విష వాయు మేఘాలు కొన్ని సందర్భాల్లో ఎక్కడివక్కడే నిలిచిపోవడమూ సమస్యలకు అంటుకడుతోంది. జనం ఆరోగ్యాన్ని, ప్రాణాలను తోడేస్తున్న వాయు కాలుష్యాన్ని అడ్డుకోకపోతే భారతావని భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందనడంలో మరో మాట లేదు.

కాలుష్యభరిత వాయువులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నా, జనాభా పెరుగుతున్న అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సమస్య జోరు అధికం! 'వాయు కాలుష్యం అందరినీ భయపెడుతోంది. బడుగులు, పేద వర్గాలపై ఈ సమస్య తీవ్రత చాలా ఎక్కువగా ఉంది'- డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ చేసిన ఈ వ్యాఖ్య కఠిన వాస్తవాలను ఆవిష్కరిస్తోంది. కట్టెల పొయ్యిల ఉపయోగం, పిడకలను వంటచెరకుగా వాడటం, దీపాలను వెలిగించేందుకు కిరోసిన్ వినియోగం వంటివన్నీ అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే ఎక్కువగా దర్శనమిస్తాయి. కాలుష్య నియంత్రణకు రూపొందించిన చట్టాలు, నిబంధనలు ఎంత పకడ్బందీగా ఉన్నప్పటికీ- క్షేత్రస్థాయిలో వాటిని సమర్థంగా అమలు చేయగలిగిన పాలనా పరిణతి వర్ధమాన దేశాల్లో కనిపించడం లేదు. కనీస ప్రమాణాలు లేని వాహనాలనుంచి వెలువడే కాలుష్య ధూమాన్ని అడ్డుకోవడంలో దారుణ వైఫల్యం కనిపిస్తోంది. పంట వ్యర్థాలను కుప్పగా పోసి పెద్దయెత్తున తగలబెట్టడంవల్ల ప్రాణవాయువులో విషపూరిత రసాయనాలు చేరిపోతున్నాయి. మరోవంక నిర్మాణ రంగ పనుల కారణంగా గాలిలోకి కాలుష్యధూళి భారీయెత్తున చేరిపోతోంది. విష గాలులు ప్రజారోగ్యానికి తూట్లు పొడుస్తున్న నేపథ్యంలో చైనా వంటి దేశాలు నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. మనదేశంలో చట్టాలకు మన్నన దక్కుతున్న జాడలే లేవు. కోటీ 90 లక్షలమందికి నెలవైన దేశ రాజధాని దిల్లీ నగరం కాలుష్యం కోరల్లో చిక్కి ఉక్కిరిబిక్కిరవుతోంది. విషవాయు ధూమాల పాలబడి పాలరాతి కట్టడమైన తాజ్‌మహల్ సైతం ఛాయామాత్రంగా ఆకుపచ్చ రంగులోకి మారుతున్న దుస్థితి నేడు మనముందుంది. కిందటేడు వాయు కాలుష్యం దిల్లీ నగరాన్ని పట్టికుదిపింది. దట్టంగా కమ్ముకున్న కాలుష్య మేఘాల కారణంగా ఒక దశలో దిల్లీకి విమాన సర్వీసులనూ నిలిపివేయాల్సి వచ్చింది. రహదారి ప్రమాదాలు పెచ్చుమీరాయి. పాఠశాలలను మూసివేశారు. నగర జీవనం స్తంభించిన పరిస్థితుల్లో నిరసన ప్రదర్శనలూ హోరెత్తాయి. స్వయంగా ఓ మంత్రి దిల్లీని 'గ్యాస్ చాంబర్'గా అభివర్ణించారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

దేశంలో పదుల సంఖ్యలో ఉన్న నగరాలు ఇంచుమించుగా దిల్లీ తరహా పరిస్థితులనే ఎదుర్కొంటున్నాయి. క్రమంగా గ్రామీణ ప్రాంతాలకూ తీవ్రత విస్తరిస్తోంది. 2015లో దేశంలో సంభవించిన మరణాల్లో 75శాతానికి వాయు కాలుష్యమూ ఓ కారణంగా ఉంది. దేశంలో మూడింట రెండొంతుల జనాభా ఇప్పటికీ గ్రామాల్లోనే నివసిస్తోంది. పంట వ్యర్థాలను ఎక్కడికక్కడ పొలాల్లో కాల్చిపారేయడమూ క్రమం తప్పకుండా జరుగుతోంది. ఈ పొగ క్రమంగా విస్తరించి నగరాలకు పాకి అక్కడి వాహనాలు, కర్మాగారాలు, నిర్మాణ పనులవల్ల వెలువడే కాలుష్య ధూళితో కలిసిపోయి అత్యంత ప్రమాదకరంగా రూపాంతరం చెందుతోంది. మరోవంక దేశంలోని అనేక నగరాల్లో చెత్త నిర్వహణకు సంబంధించి సరైన విధానాలు లేవు. తద్వారా చెత్తను ఎక్కడబడితే అక్కడే కాల్చివేస్తున్నారు. కట్టెలపొయ్యి, పిడకలు ఉపయోగించి వంటచేసే ఇళ్లలో జన్మించే పిల్లలు ఉండాల్సిన దానికన్నా తక్కువ బరువుతో జన్మిస్తున్నట్లు డబ్ల్యూహెచ్ఓ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. వాయు కాలుష్యాన్ని కట్టడి చెయ్యడం ఖరీదైన వ్యవహారమన్న దుర్భ్రమ సర్వత్రా వ్యాపించి ఉంది. విష గాలుల కట్టడిపై పెట్టే ప్రతి రూపాయి ఖర్చు వల్ల; ప్రజారోగ్యం మెరుగుదల, కొత్త ఉద్యోగాల కల్పన, పనినాణ్యత ఇనుమడించడం తదితరాలవల్ల పరోక్షంగా 30 రూపాయల లాభం చేకూరుతుంది. కిరోసిన్ స్టవ్‌ల తొలగింపు, డీజిల్ వాహనాలకు చెక్‌పెట్టడం, శిలాజ ఇంధనాలను బహిరంగంగా కాల్చివేయడానికి స్వస్తి చెప్పడంవంటి మూడు పనులు చేస్తే వాయు కాలుష్యాన్ని పెద్దయెత్తున అరికట్టవచ్చునని నిపుణులు వెల్లడిస్తున్నారు. కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలను తొలగించి- నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణమైన వాహనాలనే రహదారులపై అనుమతించాలి. దిల్లీలో కొంతమేరకు ఆ దిశగా కదలిక ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా ఇదే తరహా చైతన్యం ఇప్పుడు విస్తరించాల్సి ఉంది.



### ప్రమాదంలో ప్రజాజీవనం

– పీవీ రావు

## ఈనాడు లేఖలు

### భద్రత కల్పనే ముఖ్యం

కోల్‌కతా నడిరోడ్డుపై ఆకతాయిలు తనతో అనాగరికంగా ప్రవర్తిస్తున్నారని ఇటీవల మాజీ మిస్ ఇండియా యూనివర్స్ ఉషోషి సేన్‌గుప్తా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు వెళితే, అది తమ పరిధిలోని సమస్య కాదని తాత్సారం చేయడం- పోలీసు వ్యవస్థ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతోంది. సమాజంలో ఎంతో గుర్తింపు ఉన్న వారి పరిస్థితినే పట్టించుకోని పోలీసులు సామాన్య ప్రజలకు ఏ విధంగా భద్రత కల్పిస్తారు? సమస్య తీవ్రతను బట్టి ఏ పరిధిలోని పోలీసులైనా సామాజిక భద్రతే తమ ప్రథమ బాధ్యతగా పౌరులను రక్షించాల్సిన అవసరం ఉంది. పరిధులు, అవధులను పట్టించుకోకుండా శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు కృషి చేసినప్పుడే సమాజంలో అఘాయిత్యాలకు పాల్పడేవారి సంఖ్య తగ్గుముఖం పడుతుంది.

- పులిశేరు వేణు, వరంగల్

### ప్రక్షాళన అవసరం

రెవిన్యూశాఖలో ఏ పని కావాలన్నా ముడుపులు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. సిబ్బంది దస్త్రానికో ధర నిర్ణయించి మరీ చేతివాటం చూపుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెవిన్యూశాఖను ఆమూలాగ్రం ప్రక్షాళన చేయాలనే కసరత్తు జరిగినా, అది పూర్తిస్థాయిలో నెరవేరలేదు. పాలకులు ఈ దిశగా దృష్టి సారించి, రైతులను ఆదుకోవాలి. మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో రెవిన్యూ కార్యాలయాల్లో సమయపాలన ఉండటం లేదు. పహాణీతో సహా పలు పనులకు రూ.50 నుంచి రూ.200 వరకూ వసూలు చేస్తున్నారు. రైతుల భూములకు సంబంధించిన ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి, చెల్లించేవరకూ పని చేయకుండా కాలయాపన చేస్తున్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతులు తప్పనిసరై ముడుపులిచ్చి పనులు చేయించుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ వ్యవహారంపై ప్రభుత్వం నిఘా పెట్టి, మామూళ్లకు అలవాటు పడిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి. రైతుల సమస్యను సత్వరం పరిష్కరించాలి.

- కులకర్ణి బాబురావు, జెక్లేరు, నారాయణపేటజిల్లా

## స్థాన విలువ

ఎటువంటి కార్యం చేపట్టాలన్నా ఎవరి సామర్థ్యంపై వారికి సరైన అంచనా అవసరం. తాత్కాలిక భావావేశంతో తొందరపడి చేపడితే అర్ధాంతరంగా వదిలిపెట్టాల్సిన స్థితి రావచ్చు. స్వయంగా దింపుకోవడానికి అనువుగాని బరువులు అహంభావంతో తలకెత్తుకుంటే పర్యవసానం సమస్యాత్మకం కావచ్చు.

స్వానుభవాలతో సాగేదే జీవితం. జీవితాన్ని నిర్వచించమంటే ఎవరి అనుభవాలనుబట్టి వారు చెబుతారు. అది కొంతమందికి పూలబాటగాను, మరి కొంతమందికి ముళ్లబాటగాను అనిపించవచ్చు. స్వానుభవంతో నేర్చుకునే పాఠాలే ఉత్తమ ఫలితాలిస్తాయి.

కొన్నిసార్లు పూర్వానుభవంగల ఇతరులతో సంప్రతింపులు అవసరమవుతాయి. దానితో ప్రతీ కష్టం స్వయంగా చవి చూడవలసిన స్థితిని అధిగమించవచ్చు. వారి అనుభవాలకు, అభిప్రాయాలకు ఇచ్చే విలువకైనా తమ వివేకమే ప్రధానం. కేవలం పరుల నిర్వచనాల ఆధారంగా ఒక నిర్ణయానికి రావడం సరికాదని జిడ్డు కృష్ణమూర్తి అంటారు. 'వినదగు నెవ్వరు చెప్పిన' అనే పద్ధతి పాటించాలి. విన్న వ్యాఖ్యలన్నీ సమ్మేళనం చేసి సారం గ్రహించాలి. ప్రతీ మనిషిలోను ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. ముఖేముఖే సరస్వతి అంటారు. స్వ సారం తెలియజేసే దేవతే సరస్వతి. ఆత్మజ్ఞాన సందేశాత్మకమే శ్రీవిద్య. లౌకిక స్పృహతో, పరిమిత జ్ఞానంతో కూడినది అవిద్య అంటారు.

తన సామర్థ్యం గురించి కచ్చితమైన అవగాహనతోనే స్థితప్రజ్ఞత సాధ్యపడుతుంది. తనను తాను ఎక్కువగా భావిస్తే అహంభావం, తక్కువగా భావిస్తే ఆత్మన్యూనత ఏర్పడతాయి. రెండింటిలో ఏది కలిగినా జీవితం సమస్యాత్మకం అనిపిస్తుంది. ఏ సమస్యకైనా తన గురించి తనకున్న జ్ఞానహీనతే కారణం అంటారు రమణ మహర్షి.

సృష్టిలో దేన్నికైనా స్వతస్సిద్ధమైన ప్రయోజనం తెలియనంతసేపు, అది ఏ విలువా లేని సున్నాగా అనిపిస్తుంది. విలువగల అంకె పక్కన చేర్చినప్పుడు సున్నా సైతం విలువ పొందుతుంది. అది దానికి విలువ కలిగించే అంకెకు సైతం విలువను పెంచుతుంది. ఉదాహరణకు ఒకటికి పక్కన చేరిన సున్నాల ఆధారంగా ఆ సంఖ్యకు పదులు, వందల నుంచి కోట్లను మించి విలువ కట్టవచ్చు.

జగత్తు అంతటికీ శాశ్వతమైన విలువను కల్పించే ఆత్మస్వరూపం భగవంతుడు. అశాశ్వతమై తాత్కాలిక విలువల అనంతరం సున్నాలుగా మారిపోయేవి జీవుల శరీరాలు.



అంతర్యామి

పరమాత్మ ఆసరాతోనే సున్నాలకు స్థాన విలువ కలిగేది అనే ఎరుక ప్రధానం. పరమాత్మ జీవాత్మల సంబంధం గ్రహిస్తేనే జీవిత గమనం సుగమం అవుతుంది. జీవాత్మల సమష్టి రూపమే, పరమాత్మ విశ్వరూపం.

ఏదైనా పనిమీద వేరే చోటుకు వెళ్తే, అక్కడి పరిస్థితుల వల్ల వెళ్లిన పని మరిచిపోవచ్చు. మళ్ళీ మొదటి చోటుకు చేరేవరకు ఆ పని గుర్తురాదు. అక్కడే ఉండి వచ్చిన పని గుర్తు చేసుకోవడం కష్టం. అక్కడి ధ్యాసను మరల్చి తన ధ్యేయ జ్ఞప్తికై ధ్యానం చేయాల్సి వస్తుంది. విశాలవిశ్వంలో ఎక్కడి నుంచి ఎందుకీ స్థానానికి చేరానో, గమ్యం ఏమిటో అనే ప్రశ్నల సమాధానాన్నికై ఎవరికి వారే అన్వేషించాలి.

వర్తమాన పరిస్థితుల్లో జీవన సత్యాల స్ఫురణ చాలా కష్టతరం. సత్యార్థులకు సత్యదేవుడి సాయం తథ్యం. జన్మతః లభించిన సామర్థ్యపు విలువ గురించి అంచనా లోపిస్తే జీవితానికి న్యాయం చేయలేం. కుటుంబంలో అయినా, దేశంలో అయినా జన్మతః ప్రాప్తించిన విలువ పరమాత్మ ప్రసాదితం. అందరి పట్ల బాధ్యతాయుతంగా జీవిస్తే పరమార్థం సాధ్యపడుతుంది. పరమాత్మకైనా తన శరీరంలో ప్రతీ జీవాణువు సమైక్యతతో శుద్ధమైతన్య సమన్వయంతో ఆనందించడమే పరమానందం. ఆ ఎరుకే విశ్వమానవ మనుగడకు చిరకాలం ఆరోగ్యదాయకం.

– దువ్వూరి రామకృష్ణ వరప్రసాదు

Eenadu epaper

# ఫీజుల పిడుగు!

**వచ్చే మూడేళ్లకు భారీగా పెంచాలని ఇంజినీరింగ్ కళాశాలల ప్రతిపాదన**



ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో అత్యధిక రుసుము రూ.3 లక్షలు కానుంది. ఫలితంగా తమ పిల్లల్ని బీటెక్ చదివించాలంటే ఎగువ మధ్య తరగతి కుటుంబాలు సైతం వెనకాముందు ఆలోచించాల్సిన పరిస్థితి రానుంది. ప్రతిభావం తులైనా బోధన రుసుములకు అర్హత లేకుంటే ఆ రుసుములు చెల్లించడం తలకు మించిన భారం కానుంది. ఇటీవల ఆరు కళాశాలలు ప్రతిపాదించుకున్న రుసుములకు హైకోర్టు పచ్చ జెండా ఊపడంతో ఇదే అవకాశంగా తాజాగా మరో 75 కళాశాలలు న్యాయస్థానం బాట పట్టాయి. ప్రతి మూడేళ్లకు ఒకసారి తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ(టీఏఎఫ్ఆర్సీ) ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యాకళాశాలల వార్షిక రుసుములను ఖరారు చేస్తుంది. ఈసారి 2019-20 నుంచి 2021-22 వరకు ఫీజులను నిర్ణయించాలి. అందుకు ప్రభుత్వం ఏడాది నుంచి ఏఎఫ్ఆర్సీ ఛైర్మన్‌ను నియమించకపోవడం వల్ల శ్రీనిధి, గోకరాజు రంగరాజు, కేఎంఐటీ, సీవీఆర్, గీతాంజలి, వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలు హైకోర్టును ఆశ్రయించాయి. ఛైర్మన్ లేనందున తాము ప్రతిపాదించుకున్న రుసుములను ఖరారు చేయాలని కోరగా అందుకు ఆమోదించిన హైకోర్టు.. ఛైర్మన్ నియామకం తర్వాత నిర్ణయించేదే తుది ఫీజు అని తీర్పునిచ్చింది. ఛైర్మన్‌ను నియమించి... ప్రతిపాదనలను పరిశీలించి...నిర్దేశించి... ఆ తర్వాత ప్రభుత్వం ఆమోదించే వరకు నెలల సమయం పట్టనుంది. కళాశాలలు ప్రతిపాదించిన రుసుములకు అంగీకరించకపోయినా.. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రస్తుతానికి తల్లిదండ్రులు మాత్రం యాజమాన్యాలు ప్రతిపాదించిన రుసుములను చెల్లించాల్సిందే. ఆరు కళాశాలలపై తీర్పు నేపథ్యంలో తాజాగా మరో 75 కళాశాలలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు ఉన్నత విద్యా మండలి వర్గాలు ధ్రువీకరించాయి. వాటిపై ఏం తీర్పు వెలువడనుందన్న ఉత్కంఠ నెలకొంది. ఈనెల 27వ తేదీన ఎంసెట్ ఆప్షన్లు ప్రారంభమవుతాయి. అప్పటివరకు వచ్చే మూడేళ్లకు రుసుములు ఎంతన్నది వెబ్‌సైట్లో ఉంచడం తప్పనిసరి. ప్రస్తుతం సీబీఐటీలో రూ.2 లక్షలు, ఎంజీఐటీ, వాసవి యాజమాన్యాలు రూ.1.60 లక్షల చొప్పున రుసుము వసూలు చేసుకునేందుకు న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. దీనిపై ఇంకా సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

**కొన్ని ప్రముఖ కళాశాలలు ప్రతిపాదించిన వార్షిక రుసుములు**

| కళాశాల | సీబీఐటీ | వీఎన్ఆర్ | ఎంజీఐటీ | వాసవి | కిట్స్ (వరంగల్) | ఎంవీఎస్ఆర్ | నారాయణమ్మ | బీవీఆర్ఐటీ |
|---|---|---|---|---|---|---|---|---|
| పాత రుసుము (రూ) | 1.13 లక్షలు | 95 వేలు | 1 లక్ష | 86 వేలు | 1.05 లక్షలు | 95 వేలు | 95 వేలు | 95 వేలు |
| ప్రతిపాదన (రూ.లక్షల్లో) | 3 | 2.72 | 2.30 | 1.90 | 1.80 | 1.57 | 1.35 | 1.25 |



## 'కన్యాశుల్కం బుచ్చమ్మ' ఇక లేరు

**ఆకాశవాణి విశ్రాంత నాటక ప్రయోక్త శ్యామలాదేవి కన్నుమూత**



రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఆకాశవాణి విశ్రాంత నాటక ప్రయోక్త, స్టాఫ్ ఆర్టిస్ట్, స్వాతంత్ర్య సమరయోధురాలు ఎంజీ శ్యామలాదేవి(88) సోమవారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ప్రముఖ స్వాతంత్ర్య సమయోధుడు, ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య మనవరాలు అయిన శ్యామలాదేవికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కృష్ణా జిల్లాకు చెందిన ఆమె ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో, ఆ తర్వాత 1960 నుంచి హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో సుదీర్ఘకాలంపాటు పనిచేశారు. కన్యాశుల్కం నాటకంలో బుచ్చమ్మగా ఆమె నటన ఎన్నోతరాల శ్రోతలను అలరించారు. ఉదర నిమిత్తం-బహుకృత వేశం సహా అనేక నాటకాలలో శ్యామలాదేవి ప్రముఖ పాత్రలను పోషించారు. నాటకాలు, రూపకాల నిర్మాణంలో పాలు పంచుకున్నారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రసారం చేసే ఉదయ తరంగిణి కార్యక్రమంలో ఆమె పోషించిన అమ్మ పాత్రకు ఎంతో పేరొచ్చింది. స్వాతంత్ర్య సమరయోధురాలైన శ్యామలాదేవి మచిలీపట్నంలో మహిళా సేవామండలి సభ్యురాలిగా ఉద్యమంలో పాల్గొన్నారు. యువతులు, మహిళలను ఖాదీ ఉద్యమంలో భాగస్వాముల్ని చేశారు. శ్యామలాదేవి మృతిపై ఆకాశవాణి సిబ్బంది సంతాపాన్ని ప్రకటించారు.

## రాచకొండ సీపీకి అమెరికా కాన్సుల్ జనరల్ అభినందనలు

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: రాచకొండ సీపీ మహేష్ భగవత్‌ను అమెరికా కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డా సోమవారం ట్విటర్‌లో అభినందించారు. కమిషనరేట్ పరిధిలో ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న 850 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించడంతోపాటు వారికి చదువు చెప్పించినందుకు సీపీకి అభినందనలు తెలిపారు. దీనిపై స్పందించిన సీపీ.. ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. తన పని తాను చేశానని, సమాజ హితం కోసం నిరంతరం కృషి చేయడం తన ధర్మమని ఆయన బదులిచ్చారు.

## ఐఈడీ బాంబుల నిర్వీర్యం

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌లోని జాతీయ రహదారి ప్రాంతంలో సోమవారం మావోయిస్టులు అమర్చిన ఐఈడీ(ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్) బాంబులను బీడీఎస్(బాంబు డిస్పోజల్ స్క్వాడ్) బృందం నిర్వీర్యం చేసింది. పోలీస్ బలగాలను మట్టుబెట్టడమే లక్ష్యంగా రెండు చోట్ల 20 కిలోల చొప్పున మావోయిస్టులు ఐఈడీ బాంబులను అమర్చారు. భద్రతా బలగాలు గాలింపు జరుపుతున్న సమయంలో వీటిని కనిపెట్టడంతో బీడీఎస్ టీం అధికారి ప్రభారీలాల్ చంద్రకార్ నేతృత్వంలో నిర్వీర్యం చేశారు. దీంతో భద్రతా బలగాలకు ప్రాణాపాయం తప్పింది. గతంలో ఇదే రహదారిలో పెగడపాలీ గ్రామం వద్ద రాష్ట్ర అటవీ శాఖ మంత్రి మహేష్ గగడ్‌ను కారులో వెళ్తుండగా మావోయిస్టులు ఐఈడీ బాంబులు అమర్చి పేల్చడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

## నయీం అనుచరులపై మరోమారు పీడీ చట్టం

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: గ్యాంగ్‌స్టర్ నయీం భార్య, అతడి అనుచరులపై రాచకొండ పోలీసులు పీడీ చట్టాన్ని ప్రయోగించారు. నయీం చనిపోయిన తర్వాత అతని అనుచరులు, భార్య ఇటీవల అక్రమాస్తులు, భూమికి సంబంధించిన లావాదేవీలు జరుపుతున్నట్లు వెలుగులోకి రావడంతో మరోమారు వారిపై పీడీచట్టం కింద కేసులు నమోదు చేశారు. నయీం ప్రధాన అనుచరుడు పాశం శ్రీను, మహ్మద్ అబ్దుల్ నాసిర్, మహ్మద్ అబ్దుల్ ఫయీం, నయీం భార్య హసీనా బేగంపై పీడీ చట్టాన్ని ప్రయోగిస్తూ రాచకొండ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## భాజపా ర్యాలీపై కాల్పులు

**15 మందికి గాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం**

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా కేస్‌పూర్‌లో భాజపా కార్యకర్తల ర్యాలీపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. దీంతో 15 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ భాజపా సోమవారం ర్యాలీ నిర్వహించింది. కేస్‌పూర్‌లోని పంచమా ప్రాంతానికి చేరుకోగానే గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు.

# నాలుగు రోజుల నరకయాతనకు ముగింపు

- సురక్షితంగా నేపాల్‌కు చేరిన తెలుగు యాత్రికులు
- వాతావరణం అనుకూలించకే ఈ పరిస్థితి అన్న ట్రావెల్స్ సంస్థ



హిల్సాలో తెలుగు బాధితులు

షాపూర్‌నగర్, ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు మానస సరోవర్ యాత్రికులు చైనా, నేపాల్ సరిహద్దుల్లో చిక్కుకుని నాలుగు రోజులపాటు అవస్థలు పడ్డారు. వారిని తీసుకెళ్లిన సదరన్ ట్రావెల్స్ హెలికాప్టర్.. వాతావరణం అనుకూలించక తిరిగి రాకపోవడంతో కొండల మధ్య బిక్కుబిక్కుమంటూ గడిపారు. చివరకు సోమవారం సాయంత్రానికి వారంతా సురక్షితంగా నేపాల్‌కు చేరుకోగలిగారు.

హైదరాబాద్ నుంచి 11 మంది సహా విజయవాడ, విశాఖపట్నం, చెన్నై, దిల్లీ నుంచి మొత్తం 44 మంది యాత్రికులు సదరన్ ట్రావెల్స్ ద్వారా మానస సరోవర్ యాత్రకు ఈ నెల 13న బయల్దేరారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం వారు ఈ నెల 23న తిరిగి నగరానికి చేరుకోవాల్సి ఉంది.

హైదరాబాద్ నుంచి విమానంలో దిల్లీ మీదుగా కాఠ్‌మాండూ వరకూ వెళ్లి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మానస సరోవర్‌కు వెళ్లారు. ఇక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో హిల్సా, అక్కడి నుంచి సిమీకోర్ట్, తదుపరి నేపాల్‌గంజ్, చివరకు కాఠ్‌మాండూకు చేరుకోవాల్సి ఉంది. అయితే యాత్రికుల బృందం హిల్సా చేరుకున్నాక వారికి కష్టాలు మొదలయ్యాయి. వారు అక్కడి స్థానిక ప్రదేశాలను తిలకించి వచ్చేసరికి తిరిగి తీసుకెళ్లాల్సిన హెలికాప్టర్ కనిపించలేదు. ఎంతసేపు ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. మంచు కురుస్తుండడం, ఆ ప్రదేశంలో నివాస స్థలాలు లేకపోవడం, చరవాణులకు సిగ్నళ్లు అందకపోవడంతో ఎవరికీ తమ పరిస్థితిని వివరించలేకపోయారు. దిక్కుతోచక హిల్సాలోని గుడారాల్లో ఉంటూ హెలికాప్టర్ కోసం ఎదురుచూశారు. ఉన్న కొద్దిపాటి ఆహారం, నీటితోనే మూడు రోజులు గడిపారు. నాలుగో రోజు ఒకచోట సెల్‌ఫోన్ సిగ్నల్ అందడంతో ఓ వీడియో తీసి అతి కష్టం మీద యాత్రికుల్లో ఒకరైన హైదరాబాద్ కుత్బుల్లాపూర్ నివాసి మదన్‌గౌడ్ తమ బంధువులకు పంపారు. మదన్‌గౌడ్ కుటుంబసభ్యులు సదరన్ ట్రావెల్స్ ప్రతినిధులను సంప్రదించగా హెలికాప్టర్ వెళ్లడానికి అనువైన వాతావరణం లేకనే తీసుకురాలేదని ఆందోళన చెందవద్దని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ట్రావెల్స్ మేనేజర్ మంగతాయారు తెలిపారు. చివరకు వాతావరణం అనుకూలించడంతో హెలికాప్టర్‌ను ఏర్పాటు చేశామని, యాత్రికులంతా సోమవారం సాయంత్రానికి యాత్రికులంతా నేపాల్ చేరుకున్నారని వివరించారు. బుధవారానికి నగరవాసులంతా హైదరాబాద్ చేరుకుంటారని వివరించారు. అయితే ముందస్తుగా నిర్ణయించుకొన్న ప్రణాళిక దెబ్బతినడంతో పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని యాత్రికులు ఆవేదన వ్యక్తం చేశారు.

## యాత్రికులను క్షేమంగా ఇంటికి చేరుస్తాం

**తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలచారి**

ఈనాడు, దిల్లీ: మానస సరోవర్ యాత్రకు వెళ్లి ఇబ్బందులు పడుతున్న తెలుగు యాత్రికులను క్షేమంగా ఇంటికి చేరుస్తామని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలచారి ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని ఆయన సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నేపాల్‌లోని భారత రాయబారితో తెలుగు యాత్రికుల క్షేమం గురించి ఫోనులో సంప్రదించినట్లు ఆయన తెలిపారు. యాత్రికుల కుటుంబసభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## ఎయిమ్స్ ప్రారంభానికి చర్యలు తీసుకోండి

**కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌కు ఎంపీ కోమటిరెడ్డి వినతి**

ఈనాడు, దిల్లీ: యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ ఎయిమ్స్‌తో పాటు ఆగస్టు మొదటివారంలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్‌కు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం దిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన కలిశారు. మొదటి సంవత్సరం విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా కళాశాల, వసతి గృహాలు ఏర్పాటు చేయాలని... బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న భవనాల్లో ఆరు నెలల్లోపే చికిత్స సదుపాయాలు కల్పించాలని.. కళాశాల, వసతిగృహాలకు శాశ్వత నిర్మాణాలు ప్రారంభించాలని.. పూర్తి స్థాయి సంచాలకుడిని నియమించాలని విన్నవించారు. రెండు మూడు రోజుల్లో ఈ అంశంపై సమీక్షించి సమాచారం అందజేస్తామని కేంద్ర మంత్రి తెలిపారని ఎంపీ కోమటిరెడ్డి చెప్పారు.

# కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వండి

- దేశాభివృద్ధి చర్యలకు మద్దతు ఇచ్చాం
- తెరాస లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు



ఈనాడు, దిల్లీ: ప్రపంచంలో అతి పెద్దదైన కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్లలో రూ.50 వేల కోట్ల వ్యయంతో రాష్ట్రప్రభుత్వం నిర్మించిందని తెరాస లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చ సందర్భంగా లోక్‌సభలో సోమవారం ఆయన ప్రసంగించారు. "అయిదేళ్ల వయసున్న తెలంగాణలో మాప్రభుత్వం మూడేళ్లలోనే గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. 45 లక్షల ఎకరాలకు సాగు నీరు.. 1400 గ్రామాలకు.. హైదరాబాద్ నగరానికి తాగునీరు.. పరిశ్రమలకు అవసరమైన నీటిని ఈ ప్రాజెక్టు నుంచి ఇస్తాం. ఇలాంటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిస్తేనే ఆశించిన వృద్ధి సాధ్యమవుతుంది. గతంలో కేంద్రంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నా ప్రాజెక్టుల పనులు కాలేదు. తెలంగాణ ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లకు వెళ్లి ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించి వివాదాలు లేకుండా చేశారు. నేను 15వ లోక్‌సభలో సభ్యుడిగా ఉన్నప్పుడు మహారాష్ట్రలో గోదావరిపై ప్రాజెక్టు నిర్మాణాలు సాగుతున్నాయని తెలిసి చూసేందుకు వెళ్లాం. అక్కడి పోలీసులు నాపై దాడి చేశారు. అయిదు రోజులు జైలులో ఉంచారు. మేం ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టును చూసేందుకు అన్ని పక్షాల నాయకులను ఆహ్వానిస్తున్నాం. కేంద్రప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి గురించి చెబుతోంది. తెలంగాణలో ప్రతి ఎకరాకు రైతు బంధు కింద మేం రూ.10 వేలు ఇస్తున్నాం.. రైతు బీమా కింద రూ.5 లక్షల పరిహారం అందజేస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో కేంద్రం తీసుకున్న నోట్ల ఉపసంహరణ, జీఎస్టీ వంటి దేశాభివృద్ధి చర్యలకు మద్దతు ఇచ్చాం. మేం రాష్ట్రాభివృద్ధికి అడిగే అంశాలకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం.." అని నామా నాగేశ్వరరావు ప్రసంగించారు.

# కొకైన్ సరఫరా చేసే నైజీరియన్ ముఠా అరెస్టు

- 254 గ్రాముల కొకైన్ స్వాధీనం

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: ఇతర రాష్ట్రాల నుంచి కొకైన్ తీసుకువచ్చి హైదరాబాద్‌లో సరఫరా చేసే నైజీరియన్ ముఠాను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 254 గ్రాముల కొకైన్, రూ.3.20 లక్షల నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ డివిజన్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సి.వివేకానందరెడ్డి వివరాలు వెల్లడించారు. ఐవరీ కోస్ట్ దేశానికి చెందిన జాడి పాస్కల్ జనవరి నుంచి గోల్కొండ ఖాదర్‌బాగ్‌లో నివసిస్తూ కొకైన్ దందాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు. ఇతని స్నేహితుడు లక్కీ అలియాస్ ఒబి అలియా సై అనే వ్యక్తి ముంబయిలో ఉంటూ ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నాడు. లక్కీ సహచరుడు డాండి కొకైన్‌ను ముంబయి నుంచి వ్యక్తుల ద్వారా పాస్కల్‌కు చేరవేసేవాడు. లక్కీతో పాటు బెంగళూరుకు చెందిన ఎబుకా అనే స్మగ్లర్‌తో పాస్కల్ సంబంధాలు పెట్టుకుని అక్కడి నుంచి కొకైన్ తెప్పించి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో కొకైన్ తీసుకుని ముంబయి నుంచి వచ్చిన నైజీరియాకు చెందిన ఒకోరో ఉచెన్న శామ్యూల్ గోల్కొండలోని ఖాదర్‌బాగ్‌లో జాడి పాస్కల్ ఇంట్లో ఆశ్రయం పొందాడు. అదే విధంగా బెంగళూరు నుంచి కొకైన్ తీసుకువచ్చి డబ్బులు తీసుకెళ్లేందుకు వచ్చిన ఎబుకా సహచరుడు, నైజీరియాకు చెందిన ఒగోచుకు చిమ గుడ్‌లక్ కూడా పాస్కల్ ఇంట్లోనే ఉండిపోయాడు. నెల రోజుల నుంచి నిఘా పెట్టిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి జాడి పాస్కల్‌తో పాటు ఒకోరో ఉచెన్న శామ్యూల్, ఒగోచుకు చిమ గుడ్‌లక్‌లు కూడా ఉన్నారనే సమాచారంతో ఆ ఇంటిపై దాడి చేశారు. ఈ ముగ్గురినీ అరెస్టు చేసి వీరి వద్ద నుంచి 254 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. లక్కీ పరారీలో ఉన్నాడు. ఈ ముఠా నుంచి కొకైన్‌ను కొనుగోలుచేసే 11 మంది పేర్లను గుర్తించినట్లు సి.వివేకానందరెడ్డి వెల్లడించారు.



నైజీరియన్ ముఠా వివరాలను వెల్లడిస్తున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సి.వివేకానందరెడ్డి. పక్కన ఇన్‌స్పెక్టర్ ఇ.చంద్రకుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి

## రక్షిత గృహాల్లోకి అనుమతించలేం

**పెంపుడు తల్లుల పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు**

ఈనాడు, హైదరాబాద్: యాదాద్రిలోని వ్యభిచార గృహాల నుంచి విముక్తి లభించిన బాలికలను కలవడానికి అనుమతించలేమని వారి పెంపుడు తల్లులకు హైకోర్టు స్పష్టంచేసింది. యాదాద్రి వ్యభిచార గృహాల నుంచి తరలించి రక్షిత గృహాల్లో ఉంచిన తమ పిల్లలను చూడటానికి అనుమతించాలంటూ పెంపుడు తల్లులు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌లను కొట్టివేసింది. ఆడపిల్లలను కిడ్నాప్ చేసి వారిని వ్యభిచార కూపంలోకి దించుతున్నారంటూ పత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా హైకోర్టు విచారణకు స్వీకరించిన విషయం విదితమే. ఈ పిటిషన్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో రాచకొండ పోలీసు కమిషనర్ నివేదికను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తమ పిల్లలను చూడటానికి అనుమతించేలా అధికారులను ఆదేశించాలంటూ పెంపుడు తల్లులు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌లపై విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు న్యాయవాది వసుధా నాగరాజ్ వాదనలు వినిపిస్తూ 26 మంది బాలికలను పెంచిన వారికి బాధ్యత ఉందని, చూడటానికి అనుమతించాలని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.శరత్‌కుమార్ అభ్యంతరం తెలుపుతూ వీరిని అనుమతిస్తే పిల్లలపై ప్రభావం చూపుతారన్నారు. దీంతో ధర్మాసనం ఇంప్లీడ్ పిటిషన్‌లను కొట్టివేస్తూ విచారణను మంగళవారానికి(నేటికి) వాయిదా వేసింది.

## సీసీఎల్ఏ భవనానికి రెవెన్యూశాఖ

ఈనాడు, హైదరాబాద్: సచివాలయంలోని ప్రధాన శాఖల తరలింపులో భాగంగా రెవెన్యూశాఖను నాంపల్లి రోడ్డులోని భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయానికి తరలించనున్నారు. సచివాలయంలో డి బ్లాకులోని మూడో అంతస్తులో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కార్యాలయం, ముఖ్యమంత్రి సహాయ నిధి కార్యాలయం, రెవెన్యూశాఖకు చెందిన పలు సెక్షన్లు, డిప్యూటీ సెక్రటరీ కార్యాలయం ఉన్నాయి. మొదటి అంతస్తులో ప్రకృతి విపత్తుల నిర్వహణ విభాగం కార్యాలయం ఉంది. కొత్త సచివాలయం నిర్మాణంలో భాగంగా పాత భవనాలు ఖాళీచేయనున్నారు. దీంతో సీసీఎల్ఏ కార్యాలయంలో రెవెన్యూశాఖను తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్నారు. సీసీఎల్ఏ బాధ్యతలు కూడా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శే నిర్వర్తిస్తున్నారు.

## అమెరికాలో రోడ్డుప్రమాదం

**హైదరాబాద్ యువకుడి మృతి**



చంచల్‌గూడ, న్యూస్‌టుడే: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మలక్‌పేట నియోజకవర్గం చంచల్‌గూడకు చెందిన యువకుడు వాసిం (27) దుర్మరణం చెందినట్లు ఎంబీటీ అధికార ప్రతినిధి అమ్జదుల్లా ఖాన్ తెలిపారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో బే వ్యూ దగ్గరలోని పౌల్ అవెన్యూ వద్ద ఆదివారం తెల్లవారుజామున వాసిం వెళ్తున్న కారును మరో కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో సంఘటన స్థలంలోనే మరణించాడు. ఈ ఘటనలో మరో వ్యక్తి కూడా మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని భారత్‌కు రప్పించేందుకు సహాయం చేయాలని విదేశాంగ శాఖ మంత్రిని తాను ట్విటర్‌లో కోరినట్లు ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

**EDUCATION**
★ MBBS, BVSc, AgBSc, GUIDANCE SEATS AVAILABLE ✆ 9989747483

# ఐదో తరగతి విద్యార్థినిపై అత్యాచార యత్నం

- గోదావరిఖనిలో బడిలోనే స్వీపర్ నిర్వాకం
- నిందితుడికి దేహశుద్ధి

గోదావరిఖని, న్యూస్‌టుడే: మొన్న వరంగల్‌లో 9 నెలల చిన్నారిపై అత్యాచారం..హత్య. నిన్న హైదరాబాద్‌లో 9 ఏళ్ల బాలికపై అఘాయిత్యం. ఈ ఘటనలను మరవక మునుపే పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఐదో తరగతి విద్యార్థినిపై బడిలోనే స్వీపర్ అఘాయిత్యానికి యత్నించాడు. శుక్రవారం జరిగిన ఘటన సోమవారం వెలుగుచూసింది.

గోదావరిఖనిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలిక ఈ నెల 21న యథావిధిగా పాఠశాలకు వెళ్లింది. అప్పటికి ఎవరూ బడికి రాకపోవడంతో ఒంటరిగా తరగతి గదిలో కూర్చుంది. అదే పాఠశాలలో స్వీపర్‌గా పనిచేసే 50 ఏళ్ల వ్యక్తి ఇదే అదనుగా బాలికపై అఘాయిత్యానికి యత్నించాడు. బాలిక గట్టిగా ఏడవడంతో పారిపోయాడు. దీంతో బాలిక బడికి వెళ్లనంటూ మొరాయించింది. తల్లిదండ్రులు ఆరాతీయగా అసలు విషయం చెప్పింది. ఆగ్రహించిన వారు నిందితునికి దేహశుద్ధి చేశారు. స్వీపర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు ఎంఈవో ప్రకటించారు. నిందితునిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వడంతో నిరసనకారులు ఆందోళనను విరమించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నిందితునిపై పోక్సో, కులదూషణ, పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు గోదావరిఖని ఒకటో పట్టణ సీఐ పర్స రమేశ్ పేర్కొన్నారు.

### పదకొండేళ్ల బాలికపై మరో కామాంధుడు

బషీరాబాద్, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలానికి చెందిన గిరిజన దంపతులు కొంత కాలం క్రితం పుణెకు వలస వెళ్లారు. తమ ముగ్గురు పిల్లలను చదువు నిమిత్తం బషీరాబాద్ మండలంలోని బంధువుల వద్ద ఉంచారు. అక్కడే బాలిక ఆరో తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన టాక్యానాయక్(50) ఈ నెల 19వ తేదీన ఇంటి వద్ద ఉన్న బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. విషయాన్ని బాలిక బంధువులకు చెప్పగా.. వారు పుణెలో ఉన్న తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం గ్రామానికి చేరుకున్న వారు ఠాణాలో ఫిర్యాదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడిని హైదరాబాద్‌లో సోమవారం అదుపులోకి తీసుకున్నామని, అతనిపై నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేశామని బషీరాబాద్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి వెల్లడించారు.

### అయిదేళ్ల చిన్నారిపై అసభ్య ప్రవర్తన

రేగోడు, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా రేగోడు మండలంలో దారుణం చోటుచేసుకుంది. అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న అయిదేళ్ల వయసున్న చిన్నారిపై సోమవారం సాయంత్రం జైపాల్ అనే యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక అరవడంతో స్థానికులు అతన్ని పట్టుకున్నారు. ఈ ఘటనపై బాధిత బాలిక తల్లిదండ్రులు రాత్రి 10.30 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్.ఐ. కాశీనాథ్ తెలిపారు.



ఇంట్లో బయటపడ్డ పాములు

## బాబోయ్.. పాములు

తలమడుగు, న్యూస్‌టుడే: ఒకటి, రెండు పాములు కన్పిస్తేనే హైరానా పడుతుంటాం. అలాంటిది కుప్పలు, తెప్పలుగా పాములు బయటికి వస్తుంటే ఆశ్చర్యపోయారు స్థానిక ప్రజలు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన మరకం ఇస్తారి ఇంట్లో 60కిపైగా పాము పిల్లలు కన్పించాయి. స్థానికులు కొన్నింటిని చంపేశారు. మరికొన్ని బయటికి వెళ్లి పోయాయి.

**SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LIMITED**
Tender Notice No. 02 / 19-20
ID.SPDCLNLG01031
Tenders are invited from eligible vendors for Fabrication of Iron materials at District stores and other Civil works in Nalgonda Circle. Details are available at www.tssouthernpower.com and www.eprocurement.gov.in
PH. No. 08682-225244
Last Date: 02.07.2019
Sd/-
SUPERINTENDING ENGINEER, OPERATION CIRCLE, NALGONDA.

**తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్**
(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్య సంస్థ)
"టూరిజం హౌస్", # 3-5-891, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు నెం.03/SE/SD/TSTDC/2019-20, తేది:24.06.2019

| క్రమ సంఖ్య | పని పేరు | అంచనా వ్యయం (రూ. లక్షల్లో) |
|---|---|---|
| 1 | నాగర్‌కర్నూలు జిల్లాలో ఫేజ్-II క్రింద ట్రెక్కింగ్ ఫెసిలిటీ, ట్రెక్కింగ్ పాత్‌ను పటిష్టపర్చే చర్యలు, సందర్శకుల సదుపాయాలు, ల్యాండ్‌స్కేపింగ్, సీటింగ్ స్పేసెస్, పార్కింగ్, సాలిడ్ వేస్ట్ కలెక్షన్ బిన్స్ కొరకు ఉమా మహేశ్వరం బేస్ క్యాంప్‌లో ఎకో-టూరిజం సర్క్యూట్ యొక్క సమగ్రాభివృద్ధి. | 277.93 |

అర్హులైన కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం మీద బిడ్స్ కోరబడుతున్నవి. సమాచారాన్ని ప్రధానంగా Zip ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయవల్సిందిగా కాంట్రాక్టర్లకు విజ్ఞప్తి. డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది 1-7-2019 నుండి. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in నందు చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TSTDC లిమిటెడ్, హైదరాబాద్.

# కోరలు చాస్తున్న క్షయ



- గతేడాది 52 వేలు కొత్త కేసుల గుర్తింపు
- హైదరాబాద్‌లో అత్యధికంగా నమోదు
- నిర్దేశించిన లక్ష్యంలో గుర్తించింది 67 శాతమే
- అత్యధిక కేసుల గుర్తింపే సవాల్‌గా వైద్యశాఖ
- గత ఐదునెలల్లోనే 28 వేలకు పైగా నిర్ధారణ

ఈనాడు, హైదరాబాద్

**క్షయ కేసుల వివరాలు**

| సంవత్సరం | కొత్త కేసులు |
|---|---|
| 2015 | 41,343 |
| 2016 | 45,160 |
| 2017 | 48,550 |
| 2018 | 52,191 |
| 2019 మే నాటికి.. | 28,154 |

తెలంగాణలో క్షయ కోరలు చాస్తోంది. దశాబ్దాలుగా ఈ వ్యాధికి చికిత్స అందిస్తున్నా రాష్ట్రంలో ఏటా 40 వేలకు పైగా కొత్త కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో పరిపూర్ణ చికిత్స పొందిన వారిలో దాదాపు 90 శాతం మందిలో క్షయ పూర్తిగా నయమైందని గణాంకాలు చెబుతున్నాయి. కానీ అవగాహనలేమి కారణంగా తెలంగాణలో ఏటా సుమారు 2 వేల మందికి పైగా ఈ వ్యాధి బారిన పడి చనిపోతున్నారు. అందుకే గుర్తింపే లక్ష్యంగా క్షయ రహిత తెలంగాణ దిశగా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది.



టీబీ వార్డు

గత ఏడాది 77352 కొత్త క్షయ కేసులను గుర్తించడం లక్ష్యం కాగా.. ఆ ఏడాదిలో కేవలం 52191(67శాతం) కేసులను మాత్రమే ఆరోగ్యశాఖ గుర్తించగలిగింది. అందుకే ఈ ఏడాది అత్యధిక వ్యాధిగ్రస్తులను గుర్తించడమే లక్ష్యంగా పెట్టుకుంది. జనవరి నుంచి మే నెల వరకూ గత ఐదు నెలల్లోనే నిర్దేశించిన లక్ష్యంలో 28154(97శాతం) కొత్త క్షయ కేసులను నిర్ధారించింది. నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించడంలో రాష్ట్రం మొత్తమ్మీద ఖమ్మం జిల్లా (152శాతం) అగ్రభాగాన నిలిచింది. మరో 16 జిల్లాలు 100 శాతానికి పైగా లక్ష్యాన్ని సాధించాయి. గతేడాది మే నెలతో పోల్చితే ఈ ఏడాది మే చివరినాటికి రాష్ట్రంలో 25 శాతం అదనంగా కొత్త కేసులను గుర్తించగలిగారు. క్షయ గుర్తింపులో లక్ష్యాలను అధిగమించిన ఖమ్మం జిల్లా సహా రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్‌కు నీతిఆయోగ్ తాజాగా అభినందన సందేశం పంపించింది.

**రాష్ట్రంలో క్షయ తీవ్రంగా ఉన్న జిల్లాలు**

| జిల్లా | 2018 | 2019 మే |
|---|---|---|
| హైదరాబాద్ | 8540 | 4514 |
| రంగారెడ్డి | 3481 | 1602 |
| మేడ్చల్ | 3223 | 1573 |
| ఖమ్మం | 3207 | 1749 |
| నిజామాబాద్ | 2882 | 1378 |
| నల్గొండ | 2546 | 1359 |

| 2018 గణాంకాల ప్రకారం క్షయ వ్యాధిగ్రస్తులు | 0-14 ఏళ్ల లోపువారు | 15 ఏళ్ల పైబడినవారు | మహిళలు | పురుషులు | ఇతరులు | చికిత్స ఆపేయడంతో వ్యాధి తిరగబెట్టిన వారు |
|---|---|---|---|---|---|---|
| | 1808 | 50,383 | 18,933 | 33,209 | 49 | 7586 |

### వైద్యులు, బాధితులకు ప్రోత్సాహకాలు

*–డాక్టర్ యోగితా రాణా, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్*



క్షయ నిర్మూలన దిశగా కార్యాచరణను ముమ్మరం చేశాం. గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల భాగస్వామ్యంతో చికిత్స అందించేందుకు కృషి చేస్తున్నాం. వ్యాధి నిర్ధారణకు ఆధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చాం. 'నిక్షయ్ పోషణ్ యోజన' కింద వ్యాధిగ్రస్తులకు పోషకాహారాన్ని అందించడానికి నెలకు రూ.500 చొప్పున, గిరిజన వ్యాధిగ్రస్తులకు రూ.500కు అదనంగా ఒక్కసారి మాత్రం రూ.750 చొప్పున పారితోషికాన్ని అందిస్తున్నాం. చికిత్సను మధ్యలో మానేసి వ్యాధి తిరగబెట్టిన రోగులకు అదనంగా రూ.1200 రవాణా భత్యం ఇస్తున్నాం. ఈ పథకం కింద రాష్ట్రంలో 41 వేల మంది లబ్ధి పొందుతున్నారు. క్షయ వ్యాధిగ్రస్తుల సమాచారాన్ని అందించినవారికి రూ.500, సాధారణ క్షయ రోగికి ఆర్నెల్ల పాటు చికిత్స అందించినందుకు వైద్యునికి రూ.1000, వ్యాధి తిరగబెట్టిన రోగికి పరిపూర్ణ చికిత్స ఇచ్చినందుకు వైద్యునికి రూ.5 వేల చొప్పున పారితోషికాన్ని అందించి క్షయ నిర్మూలనలో భాగస్తులయ్యే విధంగా ప్రోత్సహిస్తున్నాం.

### ప్రైవేటుపై ప్రత్యేక దృష్టి

*–డాక్టర్ రాజేశం, జాతీయ ఆరోగ్య మిషన్ క్షయ నిర్మూలన పథకం సంయుక్త సంచాలకులు*



ఏటా కొత్తగా క్షయ కేసులు భారీగా నమోదవుతున్నాయి. ప్రభుత్వ వైద్యంలో గుర్తింపు దాదాపు 90 శాతం ఉంటున్నా.. ప్రైవేటు వైద్యంలో చికిత్స పొందుతున్నవారి సంఖ్య నమోదు కావడం లేదు. గత నాలుగేళ్లలో ఏ సంవత్సరం కూడా 30-40 శాతాలను మించి ప్రైవేటు ఆసుపత్రుల్లో క్షయ కేసుల చికిత్స సమాచారం నమోదు కాలేదు. ఈ ఏడాది మే వరకూ నమోదైన గణాంకాల్లో హైదరాబాద్ జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల నుంచి 181 శాతం కేసులు నమోదయ్యాయి. మొత్తంగా రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల భాగస్వామ్యం సగటున 70 శాతం మించాయి. ఈ ఏడాది చివరి నాటికి 100 శాతం లక్ష్యాన్ని ప్రైవేటులోనూ పూర్తి చేస్తాం.

## ఎర్రమంజిల్ భవనాల కూల్చివేతను అడ్డుకోండి

### హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం

**ఈనాడు, హైదరాబాద్:** రాజధాని హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ భవనాలను కూల్చివేసి అక్కడ శాసనసభ, మండలి భవనాలను నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో సోమవారం వ్యాజ్యం దాఖలైంది. ఈ భవనాలను కూల్చివేయకుండా అడ్డుకోవడంతోపాటు వాటి పరిరక్షణకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలంటూ జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన జె.శంకర్ అనే వ్యక్తి వ్యాజ్యం దాఖలు చేశారు. ఎర్రమంజిల్ భవనాన్ని 1870 సంవత్సరంలో నవాబ్ సఫ్దర్‌జంగ్ ముషీర్దౌలా ఫక్రుల్ ముల్క్ నిర్మించారని తెలిపారు. ఇది చారిత్రక భవనమని, దీన్ని కూల్చివేయాలంటే హెరిటేజ్ పరిరక్షణ కమిటీ అనుమతులు తప్పనిసరన్నారు. మరమ్మతులు చేయాల్సి ఉన్నా అనుమతులు తీసుకోవాల్సిందేనన్నారు. ప్రస్తుతం ఈ భవనంలో రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం ఉందన్నారు. ఈ భవనాన్ని కూల్చివేసి ఇప్పటికే చారిత్రక భవనాలున్న అసెంబ్లీ, శాసనమండలిలకు కొత్తగా భవనాలను నిర్మించడానికి ఈ నెల 27న భూమి పూజ నిర్ణయించారని, ఇది పూర్తయిన వెంటనే కూల్చివేత పనులు మొదలవుతాయన్నారు. కూల్చివేత పనులను నిలిపివేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఇందులో ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రోడ్లు, భవనాలశాఖ ముఖ్యకార్యదర్శి, సచివాలయ కార్యదర్శులను చేర్చారు.

### సచివాలయం కూల్చివేత పిటిషన్‌పై విచారణ చేపట్టండి

సచివాలయం కూల్చివేత వ్యవహారం హైకోర్టులో మరోసారి తెరపైకి వచ్చింది. ప్రస్తుత సచివాలయాన్ని కూల్చివేయకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి ఉన్నత న్యాయస్థానాన్ని కోరారు. ఎర్రగడ్డలో సచివాలయం నిర్మించాలని నిర్ణయించినపుడు 2016లో హైకోర్టులో జీవన్‌రెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. కేవలం వాస్తు కోసం సచివాలయం కూల్చివేయడం సమంజసం కాదన్నారు. సచివాలయం భవనాన్ని కూల్చబోమని సర్కారు తరఫున అప్పటి అడ్వొకేట్ జనరల్ రామకృష్ణారెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఏజీ వాంగ్మూలాన్ని గతంలో హైకోర్టు నమోదు చేసింది. కానీ ప్రభుత్వం హైకోర్టుకు ఇచ్చిన మాట మార్చిందని, సచివాలయం భవనాల కూల్చివేతకు రంగం సిద్ధమైందని తాజాగా సోమవారం జీవన్‌రెడ్డి తరఫు న్యాయవాది సత్యంరెడ్డి హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం సానుకూలంగా స్పందిస్తూ ఈ నెల 28న విచారణ చేపడతామని తెలిపింది.

### శంకుస్థాపన.. కోర్టు ధిక్కరణే: జీవన్‌రెడ్డి

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త సచివాలయం, శాసనసభ భవనాల నిర్మాణ అంశాన్ని తెరపైకి తెచ్చారని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. పాత సచివాలయం కూల్చివేతపై హైకోర్టులో కేసు విచారణలో ఉందని.. ఇప్పుడు దాన్ని కూల్చివేస్తే కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని తెలిపారు. ఏఐసీసీ కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డితో కలిసి జీవన్‌రెడ్డి సోమవారం గాంధీభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. 2016లో కొత్త సచివాలయం నిర్మాణ అంశం తెరపైకి వచ్చినప్పుడు శాసనసభ్యుడిగా తాను హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశానని, దానిపై తదుపరి ఉత్తర్వులు వెలువరించే వరకు పాత భవనాన్ని కూల్చొద్దంటూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇప్పటికీ ఆ ఉత్తర్వులు అమల్లోనే ఉన్నాయని.. ఈ నెల 27న కొత్త సచివాలయ భవనానికి సీఎం శంకుస్థాపన చేస్తే కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని చెప్పారు.

### టీఎంయూ సమ్మెకు సిద్ధపడాలి: ఎన్ఎంయూ

**ఈనాడు డిజిటల్, హైదరాబాద్:** టీఎస్ఆర్టీసీలో 27 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను తక్షణం చేపట్టాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిమాండ్ చేసింది. సమస్యల సత్వర పరిష్కారానికి గుర్తింపు సంఘమైన తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) నిరవధిక సమ్మెకు సిద్ధపడాలని కోరింది. సమ్మె చేస్తే ఎన్ఎంయూ నుంచి సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, మౌలానా, కమాల్‌రెడ్డి తెలిపారు.

## నేడు, రేపు ఓ మోస్తరు వర్షాలు

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. తూర్పు మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొంది. మరోవైపు కరీంనగర్, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. కరీంనగర్ జిల్లా ఖాసింపేటలో 6.2 సెం.మీటర్లు, మెదక్ జిల్లా నాగాపూర్‌లో 5.8, వాడిలో 5.4 సెం.మీటర్ల వర్షం కురిసింది. దాదాపు అన్ని జిల్లాల్లో ఓ మోస్తరు జల్లులు కురిశాయి.

## 'బీసీ బిల్లుకు తెరాస మద్దతివ్వాలి'

**నల్లకుంట, న్యూస్‌టుడే:** బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని వైకాపా రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లుకు మద్దతు తెలపాలని బీసీ సంఘాల నేతలు తెరాస పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావును కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్, బీసీ ఐకాస ఛైర్మన్ భూపేష్‌సాగర్ సోమవారం హైదరాబాద్ బంజాహిల్స్‌లోని కేకే నివాసంలో ఆయనను కలిశారు. అనంతరం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో కృష్ణయ్య విలేకరులతో మాట్లాడారు. బీసీ బిల్లు ఆమోదానికి సహకరిస్తానని కేకే చెప్పినట్లు కృష్ణయ్య తెలిపారు.

## విత్తన ఎగుమతితో అన్నదాతకు ఆదాయం

- ఆఫ్రికా, ఆసియా దేశాల్లో అపార అవకాశాలు
- స్పీకర్ పోచారం, రైసస ఛైర్మన్ గుత్తాల వెల్లడి
- విత్తన ఉత్పత్తి, నాణ్యత, మార్కెటింగ్‌లపై కార్యశాల ప్రారంభం



జ్యోతి వెలిగించి కార్యశాలను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి. పక్కన గుత్తా సుఖేందర్‌రెడ్డి, పార్థసారథి తదితరులు

**ఈనాడు డిజిటల్, హైదరాబాద్:** నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేసే మన రాష్ట్రం నుంచి ఆఫ్రికా, ఆసియా దేశాలకు విత్తనాలు మార్కెటింగ్ చేసేందుకు అపార అవకాశాలున్నాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారమిక్కడ హెచ్ఐసీసీలో విత్తన ఉత్పత్తి, నాణ్యత, మార్కెటింగ్‌లపై కార్యశాలను రైతు సమన్వయ సమితి(రైసస) ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథిలతో కలిసి స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విదేశాలకు రైతు ఆధారిత విత్తనాలు ఎగుమతి చేసి, వారి ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్‌తో అన్నదాతలకు మేలు చేసినట్లే, విత్తన ఎగుమతులతోనూ వారికి ఆదాయం సమకూరుస్తున్నారని చెప్పారు. సరిహద్దులతో సంబంధం లేకుండా విత్తన ఎగుమతులు, మార్కెటింగ్‌కు అన్ని దేశాలు అంగీకరించాలని గుత్తా సుఖేందర్ రెడ్డి కోరారు. భారత్ నుంచి విత్తన ఎగుమతులు పెరగాలంటే ఆయా దేశాల సాగు పరిస్థితులు, పంటలపై అవగాహన పెంచుకోవాలని పార్థసారథి సూచించారు. గడిచిన రెండేళ్లలో ఓఈసీడీ ద్వారా విత్తనాలు ఎగుమతి చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. నాణ్యతాపరంగా ఆఫ్రికా దేశాల్లో భారత విత్తనానికి ఆదరణ ఎక్కువగా ఉందని చెప్పారు. మొక్కజొన్న, వరి, సోయా చిక్కుడు, సజ్జ, జొన్న పంటల హైబ్రీడ్ విత్తనోత్పత్తిలో దేశంలో 60 శాతం వాటా రాష్ట్రానిదేనని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 1500 గ్రామాల్లో మూడు లక్షల ఎకరాల్లో 65 లక్షల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనం ఉత్పత్తి అవుతుంటే. 1.90 లక్షల మంది రైతులు ఇందులో భాగస్వాములవుతున్నారని వెల్లడించారు. విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ కేశవులు, విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఐఎస్‌టీఏ అధ్యక్షుడు క్రెయిగ్ మంసిగర్, ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ ప్రతినిధి చికెలు ఉంబా, వివిధ దేశాల విత్తన నిపుణులు, ప్రతినిధులు కార్యశాలలో పాల్గొన్నారు.

## సినీ నటుడు రామ్‌కు జరిమానా

### బహిరంగ ధూమపానం చేసినందుకు



చార్మినార్ వద్ద సిగరెట్ కాలుస్తున్న సినీనటుడు రామ్

**చార్మినార్, న్యూస్‌టుడే:** హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద సోమవారం 'ఇస్మార్ట్ శంకర్' సినిమా షూటింగ్ విరామ సమయంలో సిగరెట్ కాల్చినందుకు ఆ చిత్ర కథానాయకుడు రామ్‌కు పోలీసులు రూ.200 జరిమానా విధించారు. చార్మినార్ పరిసరాల్లోని బహిరంగ ప్రదేశాల్లో ధూమపాన నిషేధాన్ని కచ్చితంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చార్మినార్ పోలీసులు తెలిపారు. రామ్‌తో కలిపి ఇప్పటికి వరకు చార్మినార్ పరిసరాల్లో సిగరెట్ కాల్చిన 22మందికి 'కోప్టా'(సిగరేట్ అదర్ టోబాకో ప్రొడక్ట్) చట్టం కింద జరిమానాలు విధించినట్లు ఎస్సై డి.పండరి వివరించారు.

## కచ్చితమైన వాతావరణ సమాచారంతోనే అప్రమత్తత

- పాశ్చాత్య దేశాల స్థాయిలో సాంకేతికత: రాజేశ్వర్ తివారీ
- కొద్ది రోజుల్లో అమరావతిలో వాతావరణ కేంద్రం: వైకే రెడ్డి

**ఈనాడు, హైదరాబాద్:** రైతులు, ప్రజలకు కచ్చితమైన వాతావరణ సమాచారం అందినప్పుడే అన్ని విధాలుగా అప్రమత్తం అవుతారని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక కమిషనర్ రాజేశ్వర్ తివారీ అన్నారు. సోమవారం హైదరాబాద్ వాతావరణ శాఖ (ఐఎండీ) ఆధ్వర్యంలో ప్రసార మాధ్యమాల కోసం నిర్వహించిన కార్యశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. వడగాడ్పులు, వర్షాలు, పిడుగుపాట్లకు సంబంధించిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో ఐఎండీ ప్రజలకు అందుబాటులోకి తెస్తోందని తెలిపారు. ఈ సమాచారాన్ని ప్రసార మాధ్యమాలు ప్రజలకు చేర్చితేనే ఫలితం ఉంటుందన్నారు. అమెరికా, బ్రిటన్ దేశాల స్థాయిలో మన దేశంలో సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని దాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఆ దేశాల్లో ప్రజలు రానున్న ఐదారు గంటల్లో వాతావరణం ఎలా ఉండబోతోందన్న వివరాలు చూసుకుని కార్యాలయాలు, ఇళ్ల నుంచి బయటకు అడుగుపెడతారన్నారు. రాష్ట్రంలో పది చదరపు కిలోమీటర్లకు ఒక వాతావరణ కేంద్రం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఐఎండీ హైదరాబాద్ డైరెక్టర్ వైకే రెడ్డి మాట్లాడుతూ.. కొద్ది రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు అమరావతిలో వాతావరణ కేంద్రం ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త జి.శ్రీనివాస్, ఐఎండీ శాస్త్రవేత్తలు నాగరత్న, శ్రావణి, రాజారావ్ పాల్గొన్నారు.

## గవర్నర్‌తో వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి భేటీ

- అంతర్జాతీయ విత్తన సదస్సుకు ఆహ్వానం

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సోమవారం గవర్నర్ నరసింహన్‌తో రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ విత్తన సదస్సుకు ఆయనను ఆహ్వానించారు. 28న సదస్సు ముగింపు సమావేశానికి హాజరు అవుతానని గవర్నర్.. మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వర్షపాతం, పంటల సాగు ఇతర అంశాలను నిరంజన్‌రెడ్డి గవర్నర్‌కు వివరించారు.

### కుమురం భీం వారసులకు కొలువులు

**ఆసిఫాబాద్, న్యూస్‌టుడే:** ఆదివాసీల ఆరాధ్య దైవం కుమురం భీం వారసులకు ప్రభుత్వం ఉద్యోగాలను కల్పించింది. భీం మనుమడు సోనేరావు కుమార్తె వరలక్ష్మికి ఐటీడీఏ పరిధిలో దిగువ శ్రేణి సహాయకురాలిగా, కుమారుడు మాధవరావుకు సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగాలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో సోమవారం సోనేరావు.. కుటుంబ సభ్యులతో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## మధ్యకాలిక వరి వంగడాల సాగే ఉత్తమం

- సాగుపై రుతుపవనాల ఆలస్య ప్రభావం
- వ్యవసాయ శాస్త్రవేత్త జి.శ్రీనివాస్

**ఈనాడు, హైదరాబాద్:** ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాగుకు అక్కరకు వచ్చేలా లేవు. నిర్ణీత కాలానికి 16 రోజులు ఆలస్యంగా వచ్చాయి. వర్షాలు ఆలస్యం కావడం పంటలసాగుపై ప్రభావం పడుతోంది. కాలానికి తగినట్లు మేలైన రకాల వంగడాలను ఎంపిక చేసుకుని సాగుచేయాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆదిలోనే హంసపాదు అన్నట్లు తొలకరిలో వర్షాలు తగిన మోతాదులో కురవకపోవడం కూడా సాగులో రైతులు వెనక్కు తగ్గినట్లు అయింది. సోమవారం హైదరాబాద్ వాతావరణ కేంద్రంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రుతుపవనాలు, సాగు తీరును విశ్లేషించారు.

### ఇప్పటి వరకు 37 శాతం లోటు వర్షం

రుతుపవన కాలం ప్రారంభమయ్యే జూన్‌లో రాష్ట్రంలో ఇప్పటి వరకు 37 శాతం లోటు వర్షపాతం నమోదయింది. 97.9 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 61.6 మిల్లీమీటర్ల వర్షం నమోదయింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబాబాద్, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వరంగల్ అర్బన్, గ్రామీణ జిల్లాల్లో యాభై శాతానికి పైన లోటు వర్షపాతం ఉంది. జగిత్యాల, జనగామ, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, రంగారెడ్డి, సంగారెడ్డి, వనపర్తి, వికారాబాద్ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా భిన్నమైన వాతావరణం ఏర్పడింది. మరోవైపు జూన్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు 52 శాతమే వర్షం కురవడంతో నేలలో తగినంత తేమ లేదు.

### దుక్కులు సిద్ధం

రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు ఆలస్యమైన వర్షాల కారణంగా విత్తులు వేసేందుకు కొంత ఆలోచిస్తున్నారు. మధ్యకాలిక రకాల వరి నారు ఇప్పుడు పోస్తే 20-25 రోజుల తర్వాత నాటు వేసుకోవచ్చని వ్యవసాయ వాతావరణ కేంద్రం శాస్త్రవేత్త జి.శ్రీనివాస్ తెలిపారు. దీనివల్ల పంటలు సకాలంలో చేతికి వస్తాయన్నారు. దీర్ఘకాలిక రకాల వరి వంగడాలు వేస్తే పంటలో త్వరగా గొలుసు వచ్చే అవకాశాలు ఉన్నాయని, తద్వారా నష్టాల పాలవుతారని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు ఆలస్యమైనా వచ్చే నెలలో స్వల్పకాలిక రకాలను సాగుచేసుకునే వెసులుబాటు ఉందన్నారు. మెట్ట పంటల్లో జొన్న, పెసర మాత్రం ఈ నెలాఖరులోపే సాగుచేయాలని సూచించారు. మిగిలిన సోయ, పత్తి, మొక్కజొన్న, కంది, ఆముదం రకాలను వచ్చే నెల 15 వరకు సాగుచేసుకోవచ్చని తెలిపారు. వాతావరణ కేంద్రం అధికారి రాజారావ్ మాట్లాడుతూ.. భారత వాతావరణ శాఖ వెబ్‌సైట్ ప్రకారం జూన్ 5న తెలంగాణకు నైరుతి రుతుపవనాలు రావాల్సి ఉందని, దీనికి భిన్నంగా 16 రోజులు ఆలస్యంగా వచ్చాయన్నారు.



జి.శ్రీనివాస్

## ఏ తల్లి కడుపు పంటో!

- 6 నెలల బాలుడిని రూ.4 వేలకు అమ్మేసిన భిక్షగత్తె
- బాలుడిని కొనుగోలు చేసిన వ్యక్తి అరెస్టు
- శిశు సంక్షేమ కేంద్రంలో చిన్నారి అప్పగింత



పోలీసులు కాపాడిన పసివాడు

**కంటోన్మెంట్, న్యూస్‌టుడే:** ఆరు నెలల పసివాడిని తల్లి పొత్తిళ్ల నుంచి దూరం చేశారు. బిడ్డ అమాయకత్వాన్ని భిక్షాటనతో సొమ్ము చేసుకున్నారు. చివరికి రూ.4 వేలకు అమ్మేశారు. బాలుణ్ని కొనుగోలు చేసిన వ్యక్తిపై అనుమానంతో విచారించిన పోలీసులు చిన్నారిని కాపాడి శిశు సంక్షేమ కేంద్రానికి తరలించారు. నిజామాబాద్ జిల్లా, వర్ని మండలం, మున్సాపూర్ గ్రామానికి చెందిన పాత నేరస్థుడు సీహెచ్ ప్రసాద్(40) ప్రస్తుతం లంగర్‌హౌస్‌లోని కాళీమందిర్ వద్ద కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. కుమారుడు కావాలన్న కోరికతో ఎవర్నయినా దత్తత తీసుకునేందుకు కొంతకాలంగా ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీ రాత్రి స్వగ్రామానికి బయల్దేరాడు. మద్యం మత్తులో నిజామాబాద్ బస్టాప్‌లో పడుకున్నాడు. ఉదయం నిద్రలేచిన అతను బస్టాప్‌లో భిక్షాటన చేసే వారి వద్ద పిల్లలు ఉండటాన్ని గుర్తించాడు. ఆర్నెల్ల వయసు బాలుడిని తనకివ్వాలంటూ ఓ మహిళతో బేరమాడాడు. ఆమె రూ.10 వేలు డిమాండ్ చేయగా.. చివరికి రూ.4 వేలు ఇచ్చి కొనుగోలు చేశాడు. బాలుడితోపాటు బోయిన్‌పల్లికి వచ్చాడు. బోయిన్‌పల్లి పరిసరాల్లో ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ప్రసాద్‌ను పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. విచారణలో బాలుడి కొనుగోలు అంశం వెలుగులోకి రావడంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని బోయిన్‌పల్లి ఠాణా ఇన్‌స్పెక్టర్ రాజేశ్ వెల్లడించారు. నిందితుడు గతంలో ఓ ఆటో చోరీ కేసులో అరెస్టయినట్లు గుర్తించామని, బాలుడిని బషీర్‌బాగ్‌లోని శిశు సంక్షేమ కేంద్రం అధికారులకు అప్పగించామని తెలిపారు.

# వానొచ్చె.. జబ్బొచ్చె..

తొలకరి చినుకులు పడగానే ప్రకృతి పులకరిస్తుంది. మన మనసూ పరవశిస్తుంది. అప్పటివరకూ ఉడికించిన ఎండల మంట చల్లబడుతుంది. ఉక్కిరిబిక్కిరి చేసిన ఉక్కపోత మాయమవుతుంది. చల్లటి పిల్ల గాలులు, వానజల్లుల తుంపర ఒంటిని తాకుతుంటే ఎక్కడలేని హాయి, హుషారు పెల్లుబుకుతాయి. అలాగని అంతా ఆనందమే అనుకోవటానికీ లేదు. వాన కాలం.. చినుకులతో పాటు కొన్ని సమస్యలనూ మోసుకొస్తుంది. చాలావరకివి వాటంతటవే తగ్గిపోయేవే కావొచ్చు. అయినా జాగ్రత్త అత్యవసరం. లేకపోతే గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకున్నట్టు అవుతుంది.

## జలుబు

దీనికి మూలం రైనో వైరస్ తరగతికి చెందిన వైరస్‌లు. ఇవి మహా గట్టి పిండాలు. ఎప్పటికప్పుడు రూపం మార్చేసుకుంటుంటాయి. కొన్ని కొత్తగానూ పుట్టుకొస్తుంటాయి. అందువల్ల మన రోగనిరోధక వ్యవస్థకు వీటిని గుర్తుంచుకోవటం, వీటిని ఎదిరించే యాంటీబాడీలను తయారుచేసుకోవటం కష్టం. మనకు జలుబు తరచుగా పట్టుకోవటానికి ఇదీ ఒక కారణమే. పడిశం పది రోగాల పెట్టు అంటారు. ఇది ముక్కు కారటం, ముక్కు దిబ్బడ, గొంతు నొప్పి, తుమ్ములు, దగ్గు, కళ్ల వెంట నీరు కారటం, ఒళ్లు నొప్పులు, అలసట, బడలిక, జ్వరం వంటి వాటితో బాగా వేధిస్తుంది. సాధారణంగా వారం పాటు ఉంటుంది. ఆ తర్వాత చాలావరకు దానంతటదే తగ్గిపోతుంది. ముక్కు కారటం, ఒళ్లు నొప్పుల వంటివి మరీ ఎక్కువగా ఉంటే ఉపశమనానికి మందులు వాడుకోవచ్చు. జ్వరం ఎక్కువగా ఉంటే తడిబట్టతో ఒళ్లు తుడుచుకోవాలి, ప్యారాసెటమాల్ వంటి మాత్రలు వేసుకోవాలి. నీరు, ద్రవాలు, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలి. చాలామంది చేసే పొరపాటు జలుబు మొదలవగానే యాంటీబయోటిక్స్ ఆరంభించెయ్యటం. ఇవి జలుబుకు పనిచెయ్యవు. వారం దాటినా బాధలు తగ్గకుండా.. పసుపు లేదా ఆకుపచ్చ కఫంతో దగ్గు వేధిస్తున్నా బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ మొదలైందని అనుకోవచ్చు. అప్పుడు మాత్రమే యాంటీబయోటిక్స్ వాడాలి. అదీ వైద్యుల సలహా మేరకు.. పూర్తి మోతాదులో, పూర్తి కాలం వేసుకోవాలి.

## ఫ్లూ జ్వరం

దీనికి మూలం ఫ్లూ వైరస్‌లు. ఫ్లూ జ్వరంలో శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల కన్నా ఎక్కువగా ఉంటుంది. ఒళ్లు నొప్పులు విపరీతంగా వేధిస్తాయి. గొంతునొప్పీ ఉండొచ్చు. ఇవి రెండు మూడు రోజుల తర్వాత తగ్గిపోతాయి. మొదట్లో పెద్ద చికిత్సలేం అవసరం లేదు. ప్యారాసెటమాల్ మాత్రల వంటివి తీసుకుంటే చాలు. మూడు రోజులైనా బాధలు తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఎందుకంటే కొందరిలో ఫ్లూ వైరస్ ఊపిరితిత్తులకూ వ్యాపించి న్యుమోనియాగా మారొచ్చు. శ్వాస కష్టమవుతున్నా, దగ్గు, ఆయాసం వేధిస్తున్నా, జ్వరం తగ్గకుండా కొనసాగుతున్నా, తెమడతో పాటు రక్తం పడుతున్నా ఏమాత్రం తాత్సారం చేయరాదు. ముఖ్యంగా 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, మధుమేహంతో బాధపడేవారు, గర్భిణులు, గుండెజబ్బులు గలవారు, ఉబ్బసం వంటి శ్వాస సమస్యలు గలవారు, పసి పిల్లల విషయంలో మరింత జాగ్రత్త అవసరం.

## వైరల్ జ్వరాలు

వీటిని 'విష జ్వరాలు' అనీ పిలుచుకుంటుంటారు. జలుబు వంటి లక్షణాలేవీ లేకుండా ఇవి ఉన్నట్టుండి, తీవ్రంగా మొదలవుతాయి. జ్వరం 102 డిగ్రీల కన్నా ఎక్కువే ఉండొచ్చు. విపరీతమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులు, బడలిక వేధిస్తాయి. కొందరిలో ఒంటి మీద దద్దు, వాంతులు, అరుదుగా విరేచనాలూ ఉండొచ్చు. వైరల్ జ్వరాలు తీవ్రంగా ఉన్నప్పటికీ 3, 4 రోజుల్లో వాటంతటవే తగ్గిపోతాయి. జ్వరం తగ్గటానికి ప్యారాసెటమాల్ మాత్రల వంటివి తీసుకుంటే సరిపోతుంది. తగినంత విశ్రాంతి అవసరం. ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కొన్నిసార్లు డెంగీ, మలేరియా వంటివీ విష జ్వరాల్లా అనిపించొచ్చు. కాబట్టి జ్వరం మరీ తీవ్రంగా ఉంటే తప్పకుండా వైద్యులను సంప్రదించాలి. కొందరు జ్వరం ఉన్నప్పుడు నొప్పి నివారణ మాత్రలు వేసుకుంటుంటారు. ఇది తప్పు. కొన్ని వైరల్ జ్వరాల్లో ప్లేట్‌లెట్ కణాలు తగ్గుతాయి. నొప్పి మందులు వాడితే ఇవి మరింత తగ్గిపోయి, ఒంట్లో రక్తస్రావం జరిగే ప్రమాదముంది.

## నీళ్ల విరేచనాలు (డయేరియా)

వీటికి మూలం బ్యాక్టీరియా, వైరల్, పరాన్నజీవుల ఇన్‌ఫెక్షన్లు. రోజుకు మూడు, అంతకన్నా ఎక్కువసార్లు నీళ్ల విరేచనాలు అవుతుంటే డయేరియాగా భావించొచ్చు. ఇది రెండు మూడు రోజుల తర్వాత దానంతటదే తగ్గిపోతుంటుంది. అయితే నీళ్ల విరేచనాలతో ఒంట్లో నీటిశాతం తగ్గే ప్రమాదముంది. దీన్ని నివారించుకోవటం చాలా కీలకం. పరిస్థితి ముదరకుండా కాచి, చల్లార్చిన నీటిలో ఓఆర్ఎస్ పొడిని కలుపుకొని తరచుగా తాగుతుండాలి. విరేచనమైన ప్రతిసారీ ఈ ద్రావణాన్ని తప్పకుండా తాగాలి. ఓఆర్ఎస్ పొడి అందుబాటులో లేకపోతే గ్లాసు నీటిలో చారెడు పంచదార, చిటికెడు ఉప్పు కలుపుకొని అయినా తాగొచ్చు. మజ్జిగ, కొబ్బరినీళ్లు, సగ్గుబియ్యం జావ, పప్పు ఉడకబెట్టిన నీళ్ల వంటివీ తీసుకోవచ్చు. తగినన్ని ద్రవాలు తీసుకోకపోతే ఒంట్లో నీటిశాతం బాగా పడిపోయి ప్రమాదకరంగా పరిణమించొచ్చు. పసి పిల్లలకు, వృద్ధులకు ఇది మరింత హాని కలిగించొచ్చు. ఇలాంటి సమయాల్లో ఆసుపత్రిలో చేర్చి సెలైన్ పెట్టాల్సి పరిస్థితి తలెత్తుతుంది.



గ్రాఫిక్ : బాలు

మనం 'కాల జీవులం'. మన జీవనం, ఆరోగ్యం అన్నీ కాలాలతో ముడిపడినవే. వీటికి అనుగుణంగా నడచుకోవటంలోనే ఉంది ఆరోగ్య రహస్యం. ముఖ్యంగా కాలాలు మారిపోయే సమయంలో మరింత అప్రమత్తత తప్పనిసరి. ఉన్నట్టుండి మారిపోయే వాతావరణం.. ఒక్కసారిగా తగ్గిపోయే ఉష్ణోగ్రతలు. వైరస్‌లకు, సూక్ష్మక్రిములకు ఇంతకన్నా ఇంకేం కావాలి? వానకాలంలో ఇలా హఠాత్తుగా ఉష్ణోగ్రతలు మారిపోయే సమయంలోనే కొన్ని వైరస్‌లు తెగ విజృంభించేస్తుంటాయి. జలుబు, తుమ్ములు, దగ్గు, గొంతునొప్పి, ఫ్లూ జ్వరాల వంటి ఇన్‌ఫెక్షన్లను తెచ్చిపెడుతుంటాయి. ఇదొక్కటే కాదు.. వర్షపు నీరు మూలంగా మనం తాగే నీరూ కలుషితమవుతుంటుంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఇది రకరకాల సమస్యలకు దారితీస్తుంది. కడుపునొప్పి, వాంతులు, నీళ్ల విరేచనాలు, కామెర్లు, టైఫాయిడ్ వంటివన్నీ దీని ఫలితాలే. ఇక వానకాలంలో దోమల గురించి చెప్పేదేముంది? ఎక్కడికక్కడ వాన నీరు నిలిచిపోవటం వల్ల వీటి సంతతి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతుంది. దోమ కాటు చాలా ప్రమాదకరమైంది. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువమందిని బలితీసుకుంటున్నది ఇదే. ఏటా 70 కోట్ల మంది దోమలతో వ్యాపించే మలేరియా, డెంగీ వంటి జబ్బుల బారినపడుతుండగా.. వీరిలో 10 లక్షల మంది చనిపోతుండటం గమనార్హం. ఇలాంటి సమస్యలు వానకాలంలో మరింత ఎక్కువ. కాబట్టి వర్షకాల జబ్బులపై అవగాహన పెంచుకోవటం, తగు జాగ్రత్తలతో ముందుగానే నివారించుకోవటం ముఖ్యం.

## కామెర్లు

దీనికి ప్రధాన కారణం హెపటైటిస్ ఎ, హెపటైటిస్ ఇ వైరస్‌లు. ఇవి చాలావరకు కలుషితమైన తాగునీరు, ఆహారం ద్వారానే వ్యాపిస్తాయి. ఈ వైరస్‌లతో వచ్చే కామెర్లు రెండు మూడు వారాల్లో సహజంగానే తగ్గిపోతాయి. కొన్నిసార్లు పెద్దవారిలో నెలల తరబడీ వేధించొచ్చు. తగ్గకుండా వేధించే కామెర్లను నిర్లక్ష్యం చేయటానికి వీల్లేదు. దీని బారినపడ్డవారిలో కళ్లు, చర్మం పసుపు పచ్చగా మారిపోతుంటాయి. ఆకలి తగ్గిపోతుంది. మొదట్లో వాంతులు, కొద్దిగా జ్వరం, ఒళ్లు నొప్పుల వంటి లక్షణాలే ఉంటాయి. నాలుగైదు రోజుల తర్వాత మూత్రం పసుపు పచ్చగా రావటం.. క్రమంగా చర్మం, కంట్లో తెల్లని భాగం పచ్చగా అవటం మొదలవుతాయి. కొందరికి మలం తెల్లగా, నల్లగా మారిపోవచ్చు. కడుపు నొప్పి, చికాకు, బలహీనత తలెత్తొచ్చు. కామెర్లు అనగానే చాలామంది ఆకు పసర్లు, చెట్ల మందులంటూ తాత్సారం చేస్తుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. కామెర్ల రకాన్ని నిర్ధారణ చేసుకొని, తగు చికిత్స తీసుకోవటం తప్పనిసరి.

## గొంతునొప్పి

దీనికి చాలావరకు వైరస్‌లే కారణం. నూటికి 90 మందికి సమస్య దానంతటదే తగ్గుతుంది. గొంతు నొప్పి ఉన్నప్పుడు గోరు వెచ్చటి నీటిలో కాస్త ఉప్పు వేసుకొని పుక్కిట పడితే ఉపశమనం కలుగుతుంది. జ్వరం తట్టుకోలేకపోతుంటే ప్యారాసెటమాల్ మాత్రలు వేసుకోవచ్చు. కొందరికి స్ట్రెప్టోకాకల్ వంటి బ్యాక్టీరియాతోనూ గొంతునొప్పి రావొచ్చు. ఇలాంటివారికి కొద్దిరోజులు యాంటీబయోటిక్స్ అవసరమవుతాయి. రెండు మూడు రోజుల తర్వాత గొంతునొప్పి తగ్గకపోయినా, గొంతులో తెల్లటి చీము, పొక్కుల వంటివి కనబడినా వెంటనే వైద్యులను సంప్రదించాలి. చిన్న పిల్లల్లో గొంతు నొప్పిని తేలికగా తీసుకోవటానికి లేదు. కొందరు పిల్లల్లో ఇది గుండెను దెబ్బతీసే జ్వరానికి (రుమాటిక్ ఫీవర్) దారితీస్తుంది. కాబట్టి నిర్లక్ష్యం పనికిరాదు.

## టైఫాయిడ్

ఇది కలుషితమైన ఆహారం, నీరు ద్వారా వ్యాపిస్తుంది. దీనికి మూలం సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా. ఇది టైఫాయిడ్ బారినపడ్డవారు, దాన్నుంచి కోలుకుంటున్నవారు మల విసర్జన చేసినపుడు బయటకు వస్తుంది. దీనితో కలుషితమైన ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకుంటే ఇతరులకూ వ్యాపిస్తుంది. టైఫాయిడ్‌లో విడవకుండా జ్వరం వస్తుంటుంది. సాధారణంగా 103 నుంచి 104 డిగ్రీల వరకూ జ్వరం ఉంటుంది. వాంతులు, విరేచనాలు, ఆకలి తగ్గిపోవటం, కడుపు నొప్పి, ఒంటి నొప్పులు, నీరసం వంటివీ ఉండొచ్చు. ఇలాంటి లక్షణాలు కనబడితే టైఫాయిడ్ ఉందేమో నిర్ధారించుకోవటం అవసరం. పూర్తికాలం యాంటీబయోటిక్ మందులు వాడితే నయమైపోతుంది. మధ్యలో మానేస్తే సమస్య తిరగబెడుతుంది. వారి నుంచి ఇతరులకూ బ్యాక్టీరియా వ్యాపించే ప్రమాదముంది. తాగునీరు, ఆహారం కలుషితం కాకుండా చూసుకుంటే దీన్ని చాలావరకు నివారించుకోవచ్చు.

## మలేరియా

దీనికి కారణం ప్లాస్మోడియం జాతి పరాన్నజీవులు. ఇవి ఎనాఫిలస్ దోమ ద్వారా మనుషులకు వ్యాపిస్తాయి. మలేరియా తొలిదశలో తలనొప్పి, నీరసం, కండరాల నొప్పి, కడుపులో ఇబ్బంది వంటి లక్షణాలు కనబడతాయి. అనంతరం రోజు విడిచి రోజు జ్వరం వస్తుంటుంది. విపరీతమైన చలితో వణికిపోతుంటారు. దుప్పట్లు కప్పితే కొంతసేపటికే చెమటతో తడిసి పోయి, ఒళ్లంతా చల్లబడుతుంది. మలేరియా మూలంగా కొందరిలో రక్తహీనత, ప్లీహం పెద్దగా అవటం వంటివీ తలెత్తుతాయి. కొందరికి పరాన్నజీవులతో నిండిన రక్తకణాలు మెదడులోని సూక్ష్మ రక్తనాళాల్లో చిక్కుకుపోవచ్చు (సెరిబ్రల్ మలేరియా). ఇది ప్రమాదకరమైంది. ఇందులో మెదడు వాచిపోయి, దెబ్బతినొచ్చు. మూర్ఛ రావొచ్చు. కోమాలోకీ వెళ్లిపోవచ్చు. ఊపిరితిత్తుల్లో ద్రవాలు నిండిపోయి శ్వాస కష్టం కావొచ్చు. కాబట్టి మలేరియాను విస్మరించటానికి లేదు. గర్భిణుల విషయంలో మరింత జాగ్రత్త అవసరం.

## డెంగీ

దీనికి మూలం ఫ్లావి వైరస్. ఇది ఈడిస్ ఈజిప్టై అనే దోమల ద్వారా వ్యాపిస్తుంది. స్వచ్ఛమైన నీటిలో పెరిగే ఇవి పగటి పూట.. ముఖ్యంగా కాళ్లు, చేతుల వంటి భాగాల మీద ఎక్కువగా కుడతాయి. దోమ కుట్టిన తర్వాత 2-7 రోజుల మధ్యలో డెంగీ లక్షణాలు మొదలవుతాయి. హఠాత్తుగా, వణుకుతో కూడిన జ్వరం వస్తుంది. జ్వరం 101 నుంచి 104 డిగ్రీల వరకు ఉండొచ్చు. తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనక నొప్పి, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులూ ఉంటాయి. నిస్సత్తువ, వాంతి, వికారం వేధిస్తాయి. డెంగీ జ్వరం రెండు, మూడు రోజుల్లో తగ్గిపోతుంది. అలాగని నిశ్చింతగా ఉండటానికి వీల్లేదు. చర్మం మీద ఎర్రటి మచ్చలు, ప్లేట్‌లెట్ కణాలు పడిపోవటం, బీపీ తగ్గటం వంటివి మొదలయ్యేది జ్వరం తగ్గే దశలోనే. ఈ సమయంలో వైద్యుల సలహా మేరకు నడుచుకోవటం మంచిది.

### నివారణే కీలకం

వానకాలంలో వచ్చే సమస్యలన్నింటికీ అపరిశుభ్రతే మూలం. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత.. ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకుంటే వీటిని చాలావరకు నివారించుకోవచ్చు.

- తరచుగా చేతులు కడుక్కోవటం చాలా ముఖ్యం. భోజనానికి ముందు, మల మూత్ర విసర్జన తర్వాత విధిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- దగ్గినపుడు, తుమ్మినపుడు నోటికి చేతి రుమాలు లేదా టిష్యూ పేపర్ అడ్డం పెట్టుకోవాలి. ఇవి దగ్గర లేకపోతే మోచేతినైనా నోటికి అడ్డం పెట్టుకోవాలి.
- జలుబు చేసినపుడు సాధ్యమైనంతవరకు విశ్రాంతి తీసుకోవాలి. ఆఫీసులకు వెళ్లకపోవటం మంచిది. దీంతో ఇతరులకు వ్యాపించకుండా చూసుకోవచ్చు.
- వానకాలంలో కరచాలనాలు మానెయ్యటం మేలు. జలుబుతో ఉన్నవారిని ముద్దు పెట్టుకోవటమూ మంచిది కాదు.
- కాచి చల్లార్చి, వడగట్టిన నీటిని తాగటం మంచిది. వేడిగా ఉన్న ఆహారాన్నే తినాలి. వీలైనంతవరకు ఇంట్లో వండిన ఆహార పదార్థాలనే తినాలి.
- కూరగాయలు, ఆకు కూరలను బాగా కడిగిన తర్వాతే వండుకోవాలి. పండ్లనూ శుభ్రంగా కడిగాకే తినాలి.
- ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. దీంతో దోమలు పెరగకుండా చూసుకోవచ్చు.
- దోమలు కుట్టకుండా శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించాలి. మంచానికి దోమ తెరలు వాడుకోవాలి.
- పిల్లలకు, వృద్ధులకు రోగనిరోధకశక్తి తక్కువ. కాబట్టి వాన కాలంలో వీరిని ఎక్కువమంది గుమిగూడే చోట్లకు తీసుకెళ్లకపోవటమే ఉత్తమం.
- పిల్లలకు ఏదైనా సమస్య వస్తే తగ్గేవరకు స్కూలుకు పంపకపోవటం మంచిది. దీంతో ఇతర పిల్లలకు వ్యాపించకుండా చూసుకోవచ్చు.
- ఆస్థమా గలవారు చల్లగాలి, చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలి.
- ఫ్లూ, టైఫాయిడ్ వంటివి రాకుండా టీకాలు అందుబాటులో ఉన్నాయి. ముందు జాగ్రత్తగా వీటిని తీసుకోవటం మంచిది.

# నీరసాన్ని ఢీ కొట్టండి!



**కొద్దిపాటి పనులకే నీరసం, నిస్సత్తువ ముంచుకొస్తున్నాయా? అయితే విటమిన్ల లోపం ఉందేమో ఒకసారి చూసుకోండి. కొన్ని విటమిన్లు.. ముఖ్యంగా విటమిన్ బి12, విటమిన్ డి తగ్గటం మూలంగానూ నిస్సత్తువ ముంచుకొస్తుంది మరి.**

- **విటమిన్ బి12:** ఆరోగ్యకరమైన ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి తగినంత విటమిన్ బి12 అవసరం. ఇది లోపిస్తే రక్తహీనత.. ఫలితంగా నీరసం ముంచుకొస్తుంది. విటమిన్ బి12 ప్రధానంగా మాంసం, పాల ఉత్పత్తులతోనే లభిస్తుంది. అందుకే శాకాహారుల్లో చాలామందిలో దీని లోపం కనబడుతుంటుంది. మరోవైపు వయసు పెరుగుతున్నకొద్దీ మన శరీరం విటమిన్ బి12ను గ్రహించుకోవటం తగ్గిపోతుంటుంది. పేగుల్లో పూత వంటి సమస్యలతోనూ ఈ సామర్థ్యం తగ్గుముఖం పడుతుంది. ఇవీ బి12 లోపానికి దారితీస్తాయి. ఆహార అలవాట్ల మూలంగా లోపం తలెత్తితే- వాటిని మార్చుకోవటం, బి12 మాత్రలు తీసుకోవటం ద్వారా భర్తీ చేసుకోవచ్చు. ఇతరత్రా కారణాలతో లోపిస్తే- బి12 ఇంజెక్షన్లు తీసుకోవాల్సి ఉంటుంది.
- **విటమిన్ డి:** ఇది లోపిస్తే ఎముకల, కండరాల పటుత్వం తగ్గుతుంది. ఇది నిస్సత్తువ, నీరసానికి దారితీస్తుంది. విటమిన్ డి విశిష్టమైంది. చర్మానికి ఎండ తగిలినపుడు మన శరీరమే దీన్ని తయారుచేసుకుంటుంది. కాబట్టి రోజూ చర్మానికి ఎండ తగిలేలా చూసుకోవటం మంచిది. కొన్నిరకాల ఆహార పదార్థాలతోనూ దీన్ని పొందొచ్చు. ట్యూనా, సాల్మన్ వంటి చేపలతో ఇది లభిస్తుంది. ప్రస్తుతం విటమిన్ డిని కలిపిన పాలు, పళ్ల రసాలు, అల్పాహార తృణధాన్యాలు కూడా అందుబాటులో ఉంటున్నాయి. వీలైతే వీటిని తీసుకోవచ్చు. లోపం మరీ ఎక్కువగా ఉంటే విటమిన్ డి మాత్రలు వేసుకోవచ్చు.

# గుండెకూ విహారం!

ఎప్పుడూ పనులేనా? అప్పుడప్పుడు విహార యాత్రలకూ బయలుదేరండి. ఇవి ఒత్తిడి తగ్గటానికే కాదు.. గుండెకూ మేలు చేస్తాయి! తరచుగా విహార యాత్రలకు వెళ్లేవారిలో గుండెజబ్బుకు దారితీసే జీవక్రియల రుగ్మత (మెటబాలిక్ సిండ్రోమ్), లక్షణాలు తక్కువగా ఉంటున్నట్టు తాజా అధ్యయనం ఒకటి పేర్కొంటోంది. రక్తపోటు.. రక్తంలో గ్లూకోజు, కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ల మోతాదులు ఎక్కువగా ఉండటం వంటి అన్నింటినీ కలిపి జీవక్రియల రుగ్మతగా భావిస్తారు. ఇవి గుండెజబ్బు, పక్షవాతం, మధుమేహం ముప్పు పెరగటానికి దోహదం చేస్తాయి. ఈ ముప్పు కారకాల సంఖ్య పెరుగుతున్నకొద్దీ ఆయా జబ్బులు వచ్చే అవకాశమూ ఎక్కువవుతుంది. మంచి విషయం ఏంటంటే- మన జీవనశైలితో ముడిపడిన వీటిని మార్చుకునే వీలుండటం. తరచుగా విహార యాత్రలు చేయటంతో ఇవి తగ్గుముఖం పడుతున్నట్టు తేలటం గమనార్హం. కాబట్టి వీలున్నప్పుడల్లా అలా విహార యాత్రలకు బయలుదేరితే అటు ఉల్లాసం, ఇటు ఆరోగ్యం.. రెండూ సొంతమవుతాయి.



## సమస్య-సలహా

# అప్పుడే రొమ్ములు వదులయ్యాయి..

**సమస్య:** నా వయసు 30 సంవత్సరాలు. రెండేళ్ల కిందట పెళ్లి అయ్యింది. రొమ్ములు వదులుగా, జారుతున్నట్టుగా అయిపోయాయి. నాకింకా పిల్లలు పుట్టలేదు. ఇప్పుడే ఇలా ఉంటే పిల్లలు పుట్టాక ఎలా ఉంటుందోనని భయంగా ఉంది. దీనికేమైనా పరిష్కారముందా?

– జ్యోతి ఎన్. (ఈమెయిల్ ద్వారా)

**సలహా:** చిన్న వయసులో రొమ్ములు వదులుగా అయితే కంగారు పడటం సహజమే. అదీ పిల్లలు పుట్టకముందే వదులైతే మరింత ఆందోళన కలుగుతుంది. అలాగని ఆకృతిని మెరుగుపరచుకోవటానికి ఇప్పుడప్పుడే ఆపరేషన్ల వంటివేవీ చేయించుకోవటం తగదు. ముఖ్యంగా రొమ్ములను పైకి లేపటానికి చేసే ఆపరేషన్‌తో (మ్యాస్టోపెక్సీ) కాన్పు తర్వాత పాలు పడే అవకాశం తగ్గుతుంది. కాబట్టి పిల్లలు పుట్టిన తర్వాత.. ఇక సంతానం వద్దని అనుకున్నాకే సరి చేసుకోవటానికి ప్రయత్నించటం మేలు. గర్భధారణ సమయంలో సహజంగానే రొమ్ముల పరిమాణం పెరుగుతుంది. ఇది కాన్పు తర్వాత.. బిడ్డకు పాలివ్వటం ఆపేశాక కొంతవరకు తగ్గుతుంది గానీ తిరిగి మునుపటి స్థితికి రావటం కష్టం. వదులుగానూ అవుతాయి. అందువల్ల ఇప్పుడే ఆపరేషన్ల వంటివి చేయించుకుంటే అంతగా ఫలితం ఉండదు. ఆపరేషన్‌తో కాస్త బిగువుగా అయినా కొన్ని సమస్యలు తలెత్తే అవకాశముంది. కాబట్టి అప్పటివరకు బ్రా ధరించటం మంచిది. ఇది రొమ్ములకు దన్నుగా నిలుస్తుంది. మరింత వదులు కాకుండా చూస్తుంది.



– డా॥ వై.వి. రావు
ప్లాస్టిక్, కాస్మెటిక్ సర్జన్

# హిమోగ్లోబిన్ ఎక్కువుంటే ఇబ్బందా?

**సమస్య:** మా బాబు వయసు 16 సంవత్సరాలు. ఇటీవల రక్తం దానం చేయటానికి వెళ్తే హిమోగ్లోబిన్ ఎక్కువగా ఉందని చెప్పి, రక్తం తీసుకోలేదు. ఇదేమైనా సమస్యా? మున్ముందు ఏదైనా ఇబ్బంది వస్తుందా?

– పరిమళ రాణి, హైదరాబాద్

**సలహా:** కేవలం ఒకసారి పరీక్షతోనే హిమోగ్లోబిన్ అధికంగా ఉందని నిర్ధారించలేం. కొన్నిసార్లు పరీక్ష ఫలితాల్లో తప్పులు దొర్లొచ్చు. ఒక ల్యాబ్ ఫలితాలకు, మరొక ల్యాబ్ ఫలితాలకు తేడాలుండొచ్చు. అందువల్ల మీరు ముందుగా మంచి ల్యాబ్‌లో మరొకసారి రక్తపరీక్ష చేయించటం మంచిది. అవసరమైతే రెండు, మూడు సార్లు పరీక్షించి.. ఆ తర్వాతే హిమోగ్లోబిన్ మోతాదులను నిర్ధారించాల్సి ఉంటుంది. సాధారణంగా మగవారికి 17 గ్రా/డీఎల్.. ఆడవారికి 16 గ్రా/డీఎల్ వరకు హిమోగ్లోబిన్ ఉండొచ్చు. అంతకన్నా మించితే ఎక్కువుందనే అర్థం. ఇందుకు రకరకాల అంశాలు దోహదం చేయొచ్చు. మామూలుగా పొగతాగే అలవాటు, ఎత్తయిన ప్రదేశాల్లో నివసించేవారిలో హిమోగ్లోబిన్ ఎక్కువగా ఉండటం చూస్తుంటాం. మీ పిల్లాడి వయసు, నివాస ప్రాంతాలను బట్టి చూస్తుంటే ఇవేవీ కారణం కాదనే అనిపిస్తోంది. ఎర్ర రక్తకణాలు తయారయ్యే ఎముకమజ్జలో ఏదైనా సమస్య ఉన్నా హిమోగ్లోబిన్ ఉత్పత్తి పెరుగుతుంది (పాలీసీథీమియా). కిడ్నీల్లో ఎరిత్రోపాయిటిన్ ఉత్పత్తి ఎక్కువైనా హిమోగ్లోబిన్ మోతాదులు పెరగొచ్చు. కొన్నిరకాల మందులూ దీనికి దోహదం చేయొచ్చు. కాబట్టి అసలు కారణమేంటన్నది తెలుసుకోవటం ముఖ్యం. అవసరమైతే జాక్2 మ్యుటేషన్, ఎముక మజ్జ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. కాబట్టి మీరు ఒకసారి జనరల్ ఫిజిషియన్‌ను గానీ హెమటాలజిస్టును గానీ సంప్రదించటం మంచిది. కారణాన్ని గుర్తించి.. ఏవైనా చికిత్సలు అవసరమైతే సూచిస్తారు. హిమోగ్లోబిన్ మరీ ఎక్కువగా ఉంటుంటే రక్తం చిక్కబడి సూక్ష్మరక్తనాళాలు మూసుకుపోయే ప్రమాదముంది. ఇది తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి నిర్లక్ష్యం చేయటం తగదు.



– డా॥ ఎస్.మనోహర్
జనరల్ ఫిజీషియన్

మీ ఆరోగ్య సమస్యలను సందేహాలను పంపాల్సిన చిరునామా
సమస్య – సలహా **సుఖీభవ**
ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
email: sukhi@eenadu.in




Eenadu epaper

ఈనాడు సినిమా

# టామ్ బాయ్‌లా ఉండడమే ఇష్టం



రకుల్‌ప్రీత్ సింగ్ హుషారైన అమ్మాయి. అందం, అణకువతో పాటు.. అల్లరి తెలిసిన పిల్ల. 'టామ్ బోయ్' ట్యాగ్ ఆమెకు అతికినట్టు సరిపోతుంది. ఈ విషయాన్ని తనే చెప్పింది. "టామ్ బోయ్ అని పిలిపించుకోవడం నాకు ఇష్టం. నేను కూడా అలానే ఉంటాను. స్నేహితులతోనో, ఇంట్లోనో ఉన్నప్పుడు అసలు నేనేంటో అర్థం అవుతుంది. కుదురుగా ఓ చోట కూర్చోను. అందుకే చాలా సార్లు దెబ్బలు తగులుతుంటాయి. అలా దెబ్బలు తినడం నా జీవితంలో భాగం అయిపోయింది. ఏదైనా ఓరోజు నాకేం జరక్కపోతే.. 'ఏంటి? ఈరోజు చిన్న దెబ్బ అయినా తగల్లేదు' అని ఆలోచిస్తుంటా. ఇది వరకు నా తీరు చూసి ఇంట్లోవాళ్లు కంగారు పడేవాళ్లు. ఆ తరవాత వాళ్లకీ అలవాటైపోయింది. ఇంట్లో నడుస్తూ నడుస్తూనే కింద పడిపోతుంటాను. నా మనసు ఒకలా, శరీరం మరోలా ఆలోచిస్తున్నప్పుడే ఇలా జరుగుతుం దేమో. సెట్లో, జిమ్ చేసేటప్పుడు మాత్రం నా దృష్టంతా వాటిపైనే ఉంటుంది. అప్పుడు నాలోని సిన్సియారిటీని చూస్తారు" అని చెప్పింది రకుల్.

రకుల్‌ప్రీత్ సింగ్

పంచ్ డైలాగ్

**రోడ్‌కి స్పీడ్ లిమిట్ ఉంటుంది. ఏటీఎమ్‌కి మనీ లిమిట్ ఉంటుంది. ఎగ్జామ్‌కి టైమ్ లిమిట్ ఉంటుంది. కానీ నా యాక్షన్‌కి నో లిమిట్.**

చిత్రం: పంతం

– పంపినవారు: ఎస్.సాయికిరణ్ రెడ్డి, మంచిర్యాల



ప్రవీణ్ సత్తారు, జీవిత, రాజశేఖర్, ప్రశాంత్ వర్మ, సి.కల్యాణ్

# 'గరుడవేగ'ని దాటేస్తుంది

"ప్రవీణ్ సత్తారు 'గరుడవేగ'తో నాకు గొప్ప విజయం దక్కింది. దానికి మించిన ఫలితం 'కల్కి'తో అందుతుందని నమ్ముతున్నా" అన్నారు రాజశేఖర్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'కల్కి'. సి.కల్యాణ్ నిర్మాత. ప్రశాంత్ వర్మ దర్శకుడు. ఈనెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ప్రవీణ్ సత్తారు ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "కల్కి' గొప్ప విజయాన్ని అందుకుంటుందనిపిస్తోంది. ప్రశాంత్ చక్కగా తెరకెక్కించార"న్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ "డబ్బింగ్ చెబుతున్నప్పుడు ఈ సినిమాలో మూడు రీళ్లు చూశా. నాకే తరవాత ఏం జరుగుందా అనే ఆసక్తి కలిగింది. ప్రవీణ్‌తో 'గరుడవేగ 2' త్వరలో తెరకెక్కనుంది. సరికొత్త కథాకథనాలతో నడిచే సినిమాల్ని యువదర్శకులతో చేయాలని కోరికగా ఉంది" అన్నారు. ప్రశాంత్‌వర్మ మాట్లాడుతూ "కల్కి' సరికొత్త కోణంలో నడుస్తాడు. 1983 ప్రాంతంలో జరిగే కథ. ఓ అంతుపట్టని విషయంలో కథానాయకుడు సాగించే అన్వేషణ థ్రిల్లింగ్‌గా ఉంటుంది. తన పాత్రకి రాజశేఖర్ ప్రాణం పోశార"న్నారు. "అన్ని వర్గాలకీ నచ్చేలా ఉంటుంది. అంచనాల్ని అధిగమిస్తుంద"న్నారు సి.కల్యాణ్. కార్యక్రమంలో జీవిత తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మడికాయ కొట్టేశారు



చిరంజీవి

చిరంజీవి కథానాయకుడిగా నటించిన 'సైరా నరసింహా రెడ్డి' చిత్రీకరణ పూర్తయింది. ఛాయాగ్రాహకుడు రత్నవేలు సోమవారం ట్విటర్ ద్వారా ఆ విషయాన్ని ప్రకటించారు. బ్రిటిష్ పాలనపై పోరాటం సాగించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా రూపొందుతున్న ఈచిత్రంలో నయనతార, తమన్నా నాయికలు. అమితాబ్ బచ్చన్, విజయ్ సేతుపతి, జగపతిబాబు, సుదీప్‌తో పాటు అనుష్క కీలక పాత్రలు పోషించారు. సురేందర్‌రెడ్డి దర్శకుడు. రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. 2017 చివరన సెట్స్‌పైకి వెళ్లిన ఈ చిత్రం సుదీర్ఘకాలం చిత్రీకరణ జరుపుకొంది. నిర్మాణానంతర కార్యక్రమాల్లో భాగంగా డీఐ పనులు మొదలైనట్టు రత్నవేలు తెలిపారు. యుద్ధ నేపథ్యం, పోరాట ఘట్టాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

# 'రుద్రాక్ష' కట్టేస్తారు!



కృష్ణవంశీ

సృజనాత్మక దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు కృష్ణవంశీ. గత కొన్నాళ్లుగా ఆయన్నుంచి సరైన సినిమా రాలేదు. 'నక్షత్రం' తరవాత ఆయన మెగాఫోన్ పట్టలేదు. కాస్త విరామం తరవాత మళ్లీ ఆయన 'యాక్షన్.. కట్' చెప్పబోతున్నారని తెలిసింది. కృష్ణవంశీ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుందని సమాచారం. బండ్ల గణేష్ నిర్మాతగా వ్యవహరించే అవకాశాలున్నాయి. 'రుద్రాక్ష' అనే పేరు పరిశీలిస్తున్నారు. కథానాయిక ప్రాధాన్యం ఉన్న చిత్రమిది. ఓ స్టార్ నాయికని ఎంచుకునే పనిలో చిత్రబృందం ఉంది. త్వరలోనే అధికారిక ప్రకటన రావొచ్చు.

# ఆది మంచి నటనని ప్రదర్శించాడు

\- వెంకటేష్

నా శత్రువు నాతోనే ఉన్నాడంటున్నాడు ఆది. ఆ కథేమిటో తెలియాలంటే 'బుర్రకథ' చూడాల్సిందే. ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. మిస్తీ చక్రవర్తి, నైరాశా కథానాయికలు. డైమండ్ రత్నంబాబు దర్శకుడు. శ్రీకాంత్ దీపాల, కిషోర్, కిరణ్ రెడ్డి నిర్మాతలు. ప్రముఖ కథానాయకుడు వెంకటేష్ ట్రైలర్‌ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "మంచి కథతో తెరకెక్కిన చిత్రమిది. ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది. ఆది మంచి నటన ప్రదర్శించార"న్నారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ "ఇది వినోదాత్మకంగా సాగే చిత్రమే కానీ... మేం ఆ వినోదం కోసం ఒక యుద్ధమే చేశాం. నాని, సందీప్‌కిషన్, సాయిధరమ్ తేజ్ తదితర కథానాయకులంతా ప్రచార చిత్రాల్ని మెచ్చుకున్నారు. నాకు విజయం వచ్చి చాలా కాలమైంది. ఈ సినిమాతో నాకు విజయంతో పాటు ప్రేక్షకులకు వినోదం లభిస్తుంది" అన్నారు. "తండ్రీ కొడుకుల మధ్య అనుబంధం నేపథ్యంలో వినోదాన్ని పంచే చిత్రం. ఇందులోని పాత్రలు కంటతడి పెట్టిస్తాయి" అన్నారు దర్శకుడు. శ్రీకాంత్ దీపాల మాట్లాడుతూ "టీజర్‌ని చూసి వింటేజ్ క్రియేషన్స్ సంస్థ విడుదల హక్కులు కొనింది. ఈ నెల 28న విడుదల చేస్తామ"న్నారు. కార్యక్రమంలో గాయత్రి గుప్తా, పృథ్వీరాజ్, సాయికార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేష్, ఆది, సాయికార్తీక్

## క్లాప్.. క్లాప్

# ప్రేమ ప్రయాణం



రంజిత్, సౌమ్య మేనన్

రంజిత్, సౌమ్య మేనన్ జంటగా మహాలక్ష్మీ మూవీ మేకర్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. రామకృష్ణ మైలా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. యమ్.రవికుమార్ నిర్మాత. సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ క్లాప్‌నిచ్చారు. నిర్మాత భరత్ కెమెరా స్విచ్చాన్ చేశారు. విజయ్‌కుమార్ కొండా స్క్రిప్టుని దర్శకుడికి అందజేశారు. కథానాయకుడు మాట్లాడుతూ "ఈ చిత్రం భావోద్వేగాలతో కూడిన ప్రేమప్రయాణం. వచ్చే నెల నుంచి చిత్రీకరణ ప్రారంభిస్తాం" అన్నారు. "యువతరానికి నచ్చే అంశాలుంటాయి. అందరికీ నచ్చేలా ఉంటుంది" అన్నారు దర్శకుడు. నిర్మాత మాట్లాడుతూ "ప్రతిభని ప్రోత్సహించడంలో మా నిర్మాణ సంస్థ ఎప్పుడూ ముందుంటుంది. మరో పది సినిమాలు మా సంస్థ నుంచి మొదలవుతున్నాయ"న్నారు. రావు రమేష్, వి.కె.నరేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, ఛాయాగ్రహణం: బాలిరెడ్డి, కళ: నారాయణ, సమర్పణ: పత్తికొండ కుమారస్వామి.



రాశీఖన్నా, సాయిధరమ్‌తేజ్

# పండగలా మొదలైంది

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ప్రతి రోజూ పండగే'. రాశీఖన్నా నాయిక. మారుతి దర్శకుడు. బన్నీ వాస్ నిర్మాత. అల్లు అరవింద్ సమర్పకులు. సోమవారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత దిల్‌రాజు క్లాప్‌నిచ్చారు. అల్లు అరవింద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈవారంలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలవనుంది. వచ్చే సంక్రాంతికి విడుదల చేస్తారు. మారుతి మాట్లాడుతూ "కుటుంబ బంధాల నేపథ్యంలో సాగే కథ. ఇంటిల్లిపాదికీ నచ్చేలా, ప్రతి సన్నివేశం పండగలా ఉంటుంది. నవ్విస్తూనే ఓ మంచి మాట కూడా చెప్పబోతున్నాం. సత్యరాజ్, రావు రమేష్ పాత్రలు ఆకట్టుకుంటాయ"న్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: జై కుమార్ సంపత్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, కళ: రవీందర్.

# తలచిందే జరిగిందా?



రామ్ కార్తీక్, ఊర్వశి పరదేశి

రామ్ కార్తీక్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'తలచినదే జరిగినదా'. సూర్యతేజ తెరకెక్కిస్తున్నారు. శేఖర్‌రెడ్డి, సంధ్యరెడ్డి నిర్మాతలు. ఊర్వశి పరదేశి కథానాయిక. సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. నాయకానాయికలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాత సి.కల్యాణ్ క్లాప్‌నిచ్చారు. దర్శకుడు సంజీవ్ కుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు మాట్లాడుతూ "2000 సంవత్సరాల క్రితం జీవితాలకీ, నేటికీ మధ్య తేడాని తెలిపే ఓ కల్పిత కథతో తెరకెక్కిస్తున్నాం. 'జెర్సీ'కి సహాయ దర్శకుడిగా పనిచేశా. కొన్ని ప్రకటనలు రూపొందించా. ఆ అనుభవంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నా" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "జులై 8 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలవుతుంది. హైదరాబాద్, గోవాల్లో చిత్రీకరణ చేస్తాం" అన్నారు. "వేర్ ఈజ్ వెంకటలక్ష్మి' తర్వాత నేను నటిస్తున్న చిత్రమిది" అన్నారు రామ్‌కార్తీక్. పోసాని కృష్ణమురళి, సత్యం రాజేష్, సత్య, కేదార్ శంకర్, నళిని తదితరులు నటిస్తున్నారు. సంగీతం: మిహి రామ్స్.

# రాముడంటే ఎన్టీఆర్ ఎన్టీఆర్ అంటే రాముడు



ఎన్టీఆర్

## మీకు తెలుసా

కృష్ణుడంటే ఎన్టీఆర్.. ఎన్టీఆర్ అంటే కృష్ణుడు అనుకునేలా ఆయన కృష్ణుడి పాత్రకు జీవం పోసిన సంగతి తెలిసిందే. కానీ ఆయన నటించిన కొన్ని సినిమాల పేర్లు చూస్తే రాముడంటే ఎన్టీఆర్.. ఎన్టీఆర్ అంటే రాముడు అనిపిస్తుంది. ఎందుకంటే ఏకంగా 16 చిత్రాల్లో ఆయన పాత్ర పేరు రాముడు అని ఉండటమే కాదు.. ఆయా సినిమాల టైటిల్స్‌లోనూ రాముడు అనే పేరు కనిపించడం విశేషం. 1954లో వచ్చిన 'అగ్గిరాముడు'తో మొదలైన ఆ రామ నామ స్మరణ 1982లో వచ్చిన 'కలియుగ రాముడు' వరకూ అప్రతిహతంగా కొనసాగింది. మంచి వాడిగా 'శభాష్ రాముడు' అనిపించుకున్న ఆయనే మొండి దొంగగా మారి 'బండ రాముడు' అని పిలిపించుకున్నారు. డ్రైవర్ అవతారంలో 'టాక్సీ రాముడు' అయ్యారు. గజ దొంగగా పోలీసుల పాలిట 'టైగర్ రాముడు'గా మారారు. వీటితో పాటు రాముడు భీముడు, పిడుగు రాముడు, రాముని మించిన రాముడు, డ్రైవర్ రాముడు, శృంగార రాముడు, ఛాలెంజ్ రాముడు, సర్కస్ రాముడు, రౌడీ రాముడు కొంటె కృష్ణుడు, సరదా రాముడు.. లాంటి టైటిల్స్‌తో అలరించారు ఎన్టీఆర్. ఆయన కెరీర్‌లోనే మరపు రాని విజయాన్నందించిన మరో చిత్రమూ ఈ కోవలోనే ఉంది. అదే 'అడవి రాముడు'. ఈ అరుదైన ఘనత మరే హీరోకీ దక్కకపోవచ్చు.

# పోలీస్ పరిశోధన



బెల్లంకొండ శ్రీనివాస్, అనుపమ

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'రాక్షసుడు'. రమేష్ వర్మ దర్శకుడు. సత్యనారాయణ కోనేరు నిర్మాత. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. జులై 18న అభిషేక్ పిక్చర్స్ ద్వారా విడుదల చేస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ "నేర పరిశోధన నేపథ్యంలో సాగే చిత్రమిది. కథానాయకుడు పోలీసు అధికారిగా కనిపిస్తాడు. తమిళంలో విజయవంతమైన 'రాక్షసన్'కి ఇది రీమేక్. జిబ్రాన్ నేపథ్య సంగీతం సమకూరుస్తున్నార"న్నారు. "ఒక మంచి బృందం కలిసి చేస్తున్న చిత్రమిది" అన్నారు దర్శకుడు.



వివేక్ ఆత్రేయ

# అమ్మాయిలు చూడాల్సిన చిత్రం

మెంటల్ మదిలో'తో దర్శకుడిగా పరిచయమయ్యారు వివేక్ ఆత్రేయ. ఇప్పుడు 'బ్రోచేవారెవరురా'తో వస్తున్నారు. శ్రీవిష్ణు, సత్యదేవ్, నివేదా థామస్, నివేతా పేతురాజ్ ప్రధాన పాత్రధారులు. ఈనెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వివేక్ హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ "మహిళలపై జరిగే వేధింపుల నేపథ్యంతో క్రైమ్ కామెడీ కథతో తెరకెక్కించాం. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో చూసే అనేక సంఘటనలను ఈ కథలో చూడొచ్చు. అమ్మాయిలు కచ్చితంగా చూడాల్సిన చిత్రం. ఇందులోని ఆరు పాత్రలు వేటికవే ప్రత్యేకం. కథ రాసుకున్నప్పుడే హీరోగా శ్రీవిష్ణు సరిపోతాడనుకున్నా. ఇలాంటి కథలు రాయడం సులువుగానే ఉంటుంది కానీ, తెరపై చూపించడమే కష్టం. 'మెంటల్ మదిలో' హిట్టా? కాదా? అన్న దానిపై నాకిప్పటికీ స్పష్టత రాలేదు. గత తప్పులను దృష్టిలో పెట్టుకొని ఈ స్క్రిప్ట్‌ను జాగ్రత్తగా తీర్చిదిద్దా. తర్వాతి సినిమా థ్రిల్లర్ కథాంశంతో చేయాలనుకుంటున్నా" అన్నారు.

# నువ్వు ఫిట్ గురూ!



సల్మాన్‌ఖాన్

సల్మాన్‌ఖాన్ వయసు ఐదు పదులు దాటేసింది. కానీ ఎక్కడా ఆ ఛాయలు కనపడవు. యువతరం కథానాయకుల్ని మించి దూసుకుపోతున్నాడు. అతడి సినిమాలు బాక్సాఫీసు వద్ద రికార్డుల మోత మోగిస్తున్నాయి. ఫిట్‌నెస్ విషయంలో సల్మాన్ చాలా కచ్చితంగా ఉంటాడు. అందుకోసం ఎంతటి కష్టాన్నికైనా సిద్ధమే అంటాడు. ఇటీవలే 'భారత్' చిత్రంతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకొన్న సల్మాన్ ప్రస్తుతం సరదాగా గడిపేస్తున్నాడు. ఫిట్‌నెస్ వీడియోలు, ఫొటోలతో అభిమానుల్ని అలరిస్తున్నాడు. మొన్నీమధ్య నవ యువకుడిలా సల్మాన్ స్విమ్మింగ్ పూల్‌లోకి దూకిన వీడియో అభిమానులను ఖుషీ చేసింది. తాజాగా స్ట్రెచింగ్ చేస్తున్న ఫొటోను ట్విటర్‌లో పంచుకొన్నారు. ఏ వర్కవుట్ చేయడానికైనా తన శరీరాన్ని ఎలా కావాలంటే అలా వంపులు తిప్పగలను అనే ధీమా సల్మాన్‌లో కనబడుతుంది. ఈ ఫొటో చూసి అభిమానులు 'నువ్వు ఎవర్‌గ్రీన్ ఫిట్ గురూ' అని సంబరపడుతున్నారు.

# వసుంధర

# 56 ప్రయోగాలు 555 వాస్తవాలు...!

**భూమి వయసు ఎంత? అంతరిక్షంలో ఎలాంటి వాసనలు ఉంటాయి? జిరాఫీకి స్వరపేటిక ఉండదా? తిమింగలం నాలుక బరువు ఓక్స్‌వాగన్ కారంత ఉంటుందా... పిల్లలకు ఎదురయ్యే ఇలాంటి సందేహాలను తీర్చడానికే ఆమె 'ద బుక్ ఆఫ్ అమేజింగ్ ఫ్యాక్ట్స్' అందుబాటులోకి తెచ్చింది. తన చిన్నారి స్ఫూర్తితో యాభై ఆరు ప్రయోగాలను 'ఫన్ విత్ సైన్స్' పేరిట పుస్తకంగా రూపొందించింది. ఆమే ప్రకాశం జిల్లా దర్శికి చెందిన రాచపూడి శరత్ కౌముది.**









'నేటి కాలంలో చిన్న, పెద్ద అని తేడా లేకుండా అందరూ ఫోన్లకు అతుక్కుపోతున్నారు. నేనూ ఓ తల్లిగా మా బాబుని దాన్నుంచి బయటపడేసేందుకు ఏదైనా వ్యాపకం కల్పించాలనుకున్నా. ముఖ్యంగా చదువుపై ఆసక్తి కలిగించాలనుకున్నా. ఏదైనా అంశాన్ని ప్రయోగపూర్వకంగా చేస్తే బాగా గుర్తుంటుందని అనిపించింది. చివరకు మా అబ్బాయితో ఇంట్లో ఉండే వస్తువులను ఉపయోగించి దాదాపు 56 ప్రయోగాలు చేయించా. అవి కేవలం వాడికొక్కడికే కాకుండా తన వయసు చిన్నారులకు ఉపయోగపడేలా ఉండాలనే ఉద్దేశంతోనే పుస్తం రాశా. అందరికి అర్థమయ్యేలా చిన్న చిన్న ఆంగ్ల పదాలే వాడా. అదే 'ఫన్ విత్ సైన్స్' పుస్తకం. ఇందులో ప్రయోగాలు ఎలా చేయాలనే సమాచారంతో పాటు బొమ్మలూ సులువుగా అర్థమయ్యేలా ఉంటాయి. దానికి సంబంధించిన వీడియోలను 'కౌశల్ ఎక్స్‌పెరిమెంట్స్' పేరుతో యూట్యూబ్‌లో పోస్టు చేశా.

**■ బొమ్మలూ ఉంటాయి...** మా అబ్బాయి ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్నాడు. మొదట్లో వాడికి అర్థమయ్యేలా ప్రతిదీ ప్రయోగం చేసి చూపించేదాన్ని. ఆ సమయంలో వాడి సందేహాలనూ నివృత్తి చేసేదాన్ని. ఈ విషయాలన్నింటిని ఓ పుస్తకంలో రాసుకునే దాన్ని. ఇలా కొన్నాళ్ల తరువాత వీటిని పుస్తక రూపంలోకి మారిస్తే మరింతమంది చిన్నారులకు ఉపయోగపడుతుందనే ఆలోచన వచ్చింది. ప్రొజెక్టర్, ఎలక్ట్రో మాగ్నటిజమ్, డెన్సిటీ... ప్రెజర్, సెల్ఫ్ వాటరింగ్ సిస్టమ్, కెమికల్ రియాక్షన్స్, ఎలిఫెంట్ టూత్‌పేస్ట్, రాకెట్ లాంచింగ్... ఈ ప్రయోగాలన్నింటినీ ఇంట్లోని వస్తువులతోనే తనంతట తానే రూపొందించేలా చేశా.

**■ ఇబ్బందులు...** ప్రయోగాలు చేయడం చెప్పినంత సులువు కాదు. దాదాపు రెండేళ్లు ఆ సమాచారాన్ని సేకరించుకున్నా. తరువాత అది సరైందో, కాదో సరిచూసుకున్నా. పుస్తకం అందుబాటులోకి తేవడానికి రెండు నెలలు పట్టింది. 'ఫన్ విత్ సైన్స్'తోపాటు 'ద బుక్ ఆఫ్ అమేజింగ్ ఫ్యాక్ట్స్'ను కూడా ముద్రించా. ఇందులోని దాదాపు 555 విషయాలు ఆసక్తిగా, ఆశ్చర్యంగా ఉంటాయి. ఉదాహరణకు భూమి మీద ఒక రోజుకు 24 గంటలు... అదే అంగారకుడిపై 25, గురు గ్రహంపై 10 గంటలకే ఓ రోజు.. శుక్ర గ్రహం అయితే 5,832 గంటలకు ఒక రోజు.... ఇలా ఇందులో ఎంతో సమాచారం ఉంటుంది. జంతువులకు సంబంధించి తీసుకుంటే.. జిరాఫీకి స్వరపేటిక ఉండదు. అది అరవలేదు. ఎక్కువసేపు నిద్రపోలేదు.

ఈ పుస్తకంలో జంతువులు, మానవ దేహం, విజ్ఞానం, చరిత్ర... ఇలా చాలా ఆసక్తికరమైన అంశాలను ఉంచా. వీటిని రూపొందించడానికి ముఖ్య ఉద్దేశం చిన్నారుల్లో పుస్తక పఠనం పెంపొందించాలనే. సైన్స్ అంశాలను అర్థం చేసుకోగలిగితే ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చు. ఇప్పటివరకు ఏడువందలకు పైగా పుస్తకాలను ముద్రించా. యాభై వేల రూపాయల దాకా ఖర్చయింది. చాలా పాఠశాలలు, లైబ్రరీలకు ఉచితంగా అందించా. మరికొన్నింటిని ఉచితంగా పంపిణీ చేయాలనుకుంటున్నా.

**నా గురించి...**

నేను బి.టెక్ పూర్తి చేశా. మావారు ఆర్.వి.ఎస్. శివప్రసాద్ ఎలక్ట్రికల్ ఏఈగా పనిచేస్తున్నారు. సుమతీ శతకం, వేమన శతకం... ఇలా మా అబ్బాయికి తొంభై వరకు తెలుగు పద్యాలు నేర్పించా. తెలుగు వ్యాకరణంపై వాడికి పట్టుంది. బాబు మూడేళ్ల నుంచే భారతదేశం, రాష్ట్రాలు, కరెన్సీ... ఇలా అన్నింటి గురించి చెప్పేదాన్ని. నాలుగేళ్ల నుంచి వీటిని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నా.

# శాంతి రక్షణకు మహిళాదళం

**వాళ్లంతా మహిళా సైనికులు. వాళ్ల బాధ్యతల్ని నిర్వర్తించడమే కాకుండా.. ప్రపంచశాంతి పరిరక్షణలోనూ ఇప్పుడు భాగం అయ్యారు. ఇంతకీ వాళ్లెవరంటే...**

ఇటీవల సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(సీఏపీఎఫ్) నుంచి మహిళా సైనికుల బృందం శాంతి భద్రతల పరిరక్షణకు డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోకు వెళ్లింది. ఈ బృందం త్వరలో అక్కడ బాధ్యతలు చేపట్టనున్నట్లు భారత దేశ ఐరాస శాశ్వత రాయబార ప్రతినిధి సయీద్ అక్బరుద్దీన్ తెలిపారు. త్వరలో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ ఆపరేషన్‌లో పాలుపంచుకోనున్నట్లు చెప్పారు. వాళ్లే సశస్త్ర సీమా బల్‌కు చెందిన మహిళలు. ఇది ప్రారంభమైన 55 ఏళ్లల్లో మొదటిసారి 22 మంది మహిళా సభ్యుల బృందం కాంగోకి వెళ్తోంది. భారత దేశం నుంచి ఇటువంటి పీస్ ఆపరేషన్‌కు వెళ్లనున్న రెండో సీఏపీఎఫ్ మహిళా బృందం ఇది. లింగ సమానత్వం సాధించడంలో భాగంగా ఐకరాజ్య సమితి ఎప్పటినుంచో ఫీమేల్ ఎంగేజ్‌మెంట్ టీం(ఎఫ్ఈటీ)లను శాంతి పరిరక్షణ కోసం జరిపే ఆపరేషన్లకు పంపిస్తోంది. త్వరలో కాంగోలో బాధ్యతలు చేపట్టనున్న ఈ బృందం అక్కడ ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా గస్తీ విధులు నిర్వర్తించనుంది. స్థానికులకు రక్షణగా ఉంటుంది. సామాజిక కార్యక్రమాలు, ఘర్షణల నియంత్రణ, విచారణ వంటివీ చేయనుంది. వీళ్లంతా అన్‌ఆర్మ్‌డ్ కంబాట్, ఆయుధాల వినియోగం, వ్యూహరచన, అంతర్జాతీయ చట్టాలు వంటి వాటిలో శిక్షణ పొందారు. కాంగో ఆఫ్రికా ఖండంలో మూడో అతి పెద్ద దేశం. ఉగాండా, రువాండా, బురుండి దీనికి సరిహద్దు దేశాలుగా ఉన్నాయి. ఇక్కడ చాలా రోజులుగా అంతర్గత ఘర్షణలు తలెత్తుతున్నాయి. వీటిని అదుపులోకి తీసుకురావడానికి ఐకరాజ్య సమితి ప్రయత్నిస్తోంది. భారత దేశం ఎన్నో ఏళ్లుగా ప్రపంచ శాంతి కోసం ఇప్పటి వరకు 6,700 మందికి పైగా సైనికులను, పోలీసులను పీస్ మిషన్లకు పంపించింది. 2007లో మొదటిసారిగా మహిళలు వెళ్లడం గమనార్హం.



# బద్ధకం వదిలి... బరువు తగ్గేలా

**బరువు తగ్గాలని ఉన్నా... వ్యాయామశాలకు వెళ్లాలంటే చాలా మందికి బద్ధకం. దీన్నుంచి బయటపడి రోజూ వ్యాయామం చేయాలంటే ఈ చిట్కాలు పాటించి చూడండి.**

చాలామంది రాత్రుళ్లు సామాజిక మాధ్యమాల్లో తీరిక లేకుండా గడిపేస్తూ సమయం వృథా చేసుకుంటారు. ఈ అలవాటు మార్చుకోవాలి. పడుకునే ముందు ఫోన్ వాడకూడదని దృఢంగా నిర్ణయించుకోవాలి. త్వరగా పడుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడే సులువుగా ఎనిమిది గంటలు నిద్రపోవచ్చు. ఉదయం తొందరగానూ లేవొచ్చు. అలసట, బద్ధకం దరిచేరవు. లేచిన వెంటనే బరువు తగ్గడం ఎంత అవసరమో మీ మెదడుకు వివరించుకోండి. మిమ్మల్ని మీరు వ్యాయామానికి సిద్ధం చేసుకున్నట్లే.



- స్నేహితులందరూ కలిసి బృందంగా జిమ్‌కు వెళ్లేలా ప్రణాళిక వేసుకోండి. వ్యాయామం ఓ పనిలా అనిపించదు. ఉల్లాసంగా గడిచిపోతుంది.
- కొంతమంది చాలా దూరంగా ఉండే జిమ్‌ను ఎంచుకుంటారు. అక్కడికి వెళ్లి రావడానికే సమయం సరిపోతుంది. ఇతర పనులు ఉన్నప్పుడు జిమ్ మానేయడానికే ప్రాధాన్యం ఇస్తారు. దీనికి పరిష్కారం మీ దగ్గర్లో జిమ్ ఉండేలా చూసుకోవడమే. సమయం వృథా కాదు. ఎలాంటి సమస్యలు ఎదురుకావు.
- వ్యాయామాలు చేయడం మొదలుపెట్టిన కొన్నిరోజులకే ఇంకా సన్నగా కాలేదని ఆందోళన చెందుతారు కొందరు. ఎవరూ రాత్రికి రాత్రే సన్నగా కారు. కొన్నాళ్లపాటు దాన్నే లక్ష్యంగా పెట్టుకోవాలి. కష్టపడాలి. అప్పుడే ఫలితం లభిస్తుందని గుర్తుంచుకోవాలి.

# బంగారం వెండి

24న ముగింపు-క్రితం

| తమిళనాడు (రూ. లలో) | | |
|---|---|---|
| ఆర్నమెంట్ (గ్రా) | 3,265 | 3,259 |
| వెండి (గ్రా) | 41.30 | 41.30 |



| | హైదరాబాద్ | | విజయవాడ | | ప్రొద్దుటూరు | | రాజమహేంద్రవరం | | విశాఖపట్నం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| బంగారం(24 క్యా) | 35,320 | 35,142 | 35,300 | 35,170 | 34,000 | 34,000 | 35,340 | 35,130 | 35,100 | 34,980 |
| ఆర్నమెంట్ | 32,990 | 32,800 | 32,700 | 32,600 | 31,450 | 31,480 | 32,650 | 32,340 | 32,650 | 32,540 |
| వెండి(కిలో) | 39,100 | 38,950 | 39,300 | 39,200 | 39,000 | 39,000 | 39,100 | 39,000 | 39,500 | 39,500 |



ఇంజినీరింగ్‌లో చేరాలి.. అని అనుకోగానే వెంటనే ఎదురయ్యే ప్రశ్న.. ఏ బ్రాంచి? అన్నీ మంచి బ్రాంచీలే. అయితే మనకు తగినది ఏది? బంధువులు బోధించిన బాటలో నడుద్దామా.. స్నేహితులతో సాగిపోదామా.. తోచింది తీసుకుందామా? సరైన నిర్ణయం అవుతుందా.. తర్వాత జీవితాంతం చింతించాల్సి ఉంటుందా? ఎవరి మాట వినాలి.. ఏ దారిలో వెళ్లాలి? తగిన బ్రాంచిని తెలుసుకోడానికి కొలమానాలు ఏమైనా ఉన్నాయా? కొన్ని చెక్‌పాయింట్లు చూసుకుంటే కొంత వరకు తెలుసుకోవచ్చంటున్నారు నిపుణులు. అయితే అదే వందశాతం కాదు. నైపుణ్యాలు పెంచుకోవడంపై శ్రద్ధ పెడితే ఏ బ్రాంచి తీసుకున్నా రాణించవచ్చని చెబుతున్నారు.



ఎంసెట్ కౌన్సెలింగ్ గైడెన్స్

# తగిన బ్రాంచి.. తెలుసుకునేదెలా?

ఎంసెట్‌లో ర్యాంకులు సాధించి ఇంజినీరింగ్ చదవాలనుకున్న విద్యార్థుల్లో మొదట ఉత్పన్నమయ్యే ప్రశ్న ఏ బ్రాంచి ఎంచుకోవాలన్నదే. వారూ వీరూ.. .ఇరుగూ పొరుగూ చెప్పేదాన్ని బట్టి బి.ఇ./ బీటెక్ బ్రాంచీలను ఎంచుకుంటున్నవారే అధికమని నిపుణులు చెబుతున్నారు. కోర్సులో చేరే వరకు ఆ బ్రాంచిలో ఏ సబ్జెక్టులుంటాయి?...ఏ పాఠ్యాంశాలను బోధిస్తారన్నది తెలియనివారు అధికమని చెబుతున్నారు. కౌన్సెలింగ్‌లో ఎంసెట్ ర్యాంకును బట్టి కళాశాల, బ్రాంచి కేటాయిస్తారు. దాంతో కనీసం 20-30 శాతం మందికి తాము ఎంచుకున్న తొలి ఐచ్ఛికం ప్రకారం కళాశాలలే కాదు....బ్రాంచి కూడా దక్కదు. అయినా ఇంజినీరింగ్ చేయాలనుకున్నారు కాబట్టి కళాశాలలో చేరతారు. ఆసక్తి ఉన్న సబ్జెక్టు ఒకటైతే...చేరిన బ్రాంచిలో చదవాల్సింది....పట్టు సాధించాల్సింది మరొక సబ్జెక్టు. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ఒక బ్రాంచిలో చేరాలంటే ఏ సబ్జెక్టులో...ఏ పాఠ్యాంశాలపై ఆసక్తి, పట్టు ఉండాలో గ్రహిస్తే చాలా వరకు మంచి నిర్ణయం తీసుకోవడం సాధ్యమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.



## ఎక్కడైనా కొనసాగింపే..

ఏ కోర్సులోనైనా సిలబస్ రూపకల్పన చేసేటప్పుడు కింది తరగతిలో ఏయే పాఠ్యాంశాలు ఉన్నాయో నిపుణులు పరిశీలిస్తారు. ఇంటర్ పాఠాలు పదో తరగతికీ, బీటెక్ పాఠ్యాంశాలు ఇంటర్‌కూ కొనసాగింపుగానే ఉంటాయి. కింది తరగతుల్లో ఏమీ చెప్పకుండా పైతరగతిలో కొత్త పాఠ్యాంశాలను చేర్చరు. దీన్ని బట్టి బీటెక్‌లో చేరేవారికి ఇంటర్‌లో ఏ పాఠ్యాంశాలపై పట్టు ఉందో మననం చేసుకోవడం అవసరం. అదే సమయంలో బీటెక్‌లో ఏ బ్రాంచిలో ఏయే సబ్జెక్టులు, పాఠ్యాంశాలు చదవాల్సి ఉంటుందో తెలుసుకుంటే ఏ బ్రాంచి తీసుకోవాలనే విషయంపై చాలావరకు స్పష్టత వస్తుంది.

ఎంపీసీలో గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలకు సంబంధించిన సబ్జెక్టులే ఉన్నా.. అవి బీటెక్‌లో ఇంజినీరింగ్‌కు సంబంధించినవే అవుతాయి. కాకపోతే ఇంటర్‌లో నేర్చుకున్న దాన్ని బీటెక్‌లో వినియోగించి సమస్య పరిష్కరిస్తారు అంతే తేడా. అంటే ఇంజినీరింగ్‌లో అప్లికేషన్ ఓరియంటేషన్, ఎక్కువగా ప్రయోగాలు, ఆచరణకు ప్రాధాన్యం ఉంటాయి. ఇంటర్‌లో బట్టీ కొట్టినా మార్కులు వస్తాయి. ఇంజినీరింగ్‌లో బట్టీ కొడితే కొంతవరకు మార్కులు తెచ్చుకోవచ్చు గానీ....జీవితంలో స్థిరపడేందుకు ఉద్యోగం దొరకడం కష్టం. అంటే సమస్యలకు పరిష్కారం చూపే నైపుణ్యాలు ఇక్కడ అత్యంత ముఖ్యం. ఇంటర్ తరహాలో స్పూన్ ఫీడింగ్ ఉండదు. సొంతంగా చదువుకోవడం...అర్థం చేసుకోగల సామర్థ్యం అవసరం. ఒక్కమాటలో చెప్పాలంటే ఇంటర్‌లోని మూడు ప్రధాన సబ్జెక్టులపై పునాదులు గట్టిగా ఉంటే ఇంజినీరింగ్‌లో బాగా రాణించవచ్చని నిపుణులు స్పష్టంచేస్తున్నారు.

- ఊహాశక్తి ఎక్కువున్నవారికి సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచీలు బాగుంటాయి.
- ఈఈఈకి గణితంపై ఆసక్తి, పట్టు చాలా ముఖ్యం.
- గణితంపై పట్టు ఉంటే సీఎస్ఈ సులభమవుతుంది.
- సీఎస్ఈ, ఈసీఈల మధ్య 25 శాతం సిలబస్ తేడా ఉంటుంది. ఈసీఈ, ఈఈఈల మధ్య 30-40 శాతం వ్యత్యాసం ఉంటుంది.

## ఒకసారి చేరితే అంతే..!

ఏ బ్రాంచిని ఎంచుకోవాలన్నదానిపై ముందుగానే ఓ నిర్ణయానికి రావడం చాలా ముఖ్యం. ఎందుకంటే అమెరికా లాంటి పాశ్చాత్య దేశాల్లో ఒక ఏడాది గడవగానే ఆసక్తి లేకుంటే మరో బ్రాంచిలోకి మారవచ్చు. కానీ ఇక్కడ అసాధ్యం. బీటెక్ మొదటి ఏడాది పూర్తయిన తర్వాత రెండో ఏడాదిలో కళాశాల మారవచ్చుగానీ....బ్రాంచి మార్చుకోవడానికి వీలులేదు. ఒకసారి చేరితే నాలుగేళ్లు ఇష్టం ఉన్నా లేకున్నా అదే బ్రాంచి చదవాల్సిందే. కళాశాలతో నాలుగేళ్ల బంధమే ఉంటుంది. అదే బ్రాంచి విషయానికి వస్తే చదువు పూర్తయిన తర్వాత జీవితాంతం దాని చుట్టూనే కెరియర్‌ను వృద్ధి చేసుకోవాల్సివుంటుంది. అందుకే బ్రాంచిపై స్పష్టత అత్యంత ప్రధానం.

## పట్టున్న అధ్యాయాలేమిటి?

ఇంటర్‌మీడియట్‌లోని గణిత, భౌతిక, రసాయన శాస్త్రాల్లోని కొన్ని అధ్యాయాలు మన అభిరుచిని గుర్తించడంలో సహాయపడతాయని చెప్పవచ్చు. వాటిలో ఆసక్తి, పట్టును బట్టి ఏ ఇంజినీరింగ్ బ్రాంచిలో రాణించగలమో ఒక అంచనాకు రావచ్చు. అందుకు ఇంజినీరింగ్‌లో వివిధ బ్రాంచీల నిపుణులు ఆచార్య విజయ్‌కుమార్‌రెడ్డి, ఆచార్య జీకే విశ్వనాథ్, ఆచార్య కామాక్షి ప్రసాద్, డాక్టర్ జయశంకర్, ఆచార్య అచ్చయ్య, డాక్టర్ బాలకృష్ణారెడ్డి, డాక్టర్ వరప్రసాద్ బ్రాంచీల వారీగా ఆయా సబ్జెక్టుల్లో పట్టు ఉండాల్సిన అధ్యాయాలను సూచిస్తున్నారు. అభ్యర్థులు తమ స్పష్టత కోసం ఈ సమాచారాన్ని వినియోగించుకోవచ్చు.

### సీఎస్ఈ



**గణితం:** లీనియర్ ఆల్జీబ్రా • బూలియన్ ఆల్జీబ్రా • పర్మ్యుటేషన్స్ అండ్ కాంబినేషన్స్. ఇప్పుడు బిగ్ డేటాకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్‌పై ఆసక్తి, పట్టు అవసరం.

**భౌతికశాస్త్రం:** ఎలక్ట్రిసిటీ అండ్ మాగ్నటిజమ్ • సెమీ కండక్టర్స్ ఎలక్ట్రానిక్స్

**రసాయనశాస్త్రం:** కెమిస్ట్రీ ఇన్ ఎవ్రీడే లైఫ్ • అటామిక్ స్ట్రక్చర్ • సాలిడ్ స్టేట్

### ఈసీఈ



**గణితం:** వెక్టర్ ఆల్జీబ్రా • కాల్క్యులస్ • ట్రిగనామెట్రీ • ప్రాబబిలిటీ • ర్యాండమ్ వేరియబుల్స్ అండ్ ప్రాబబిలిటీ డిస్ట్రిబ్యూషన్స్ • కాంప్లెక్స్ నంబర్స్ • లీనియర్ ప్రోగ్రామింగ్

**భౌతికశాస్త్రం:** ఎలక్ట్రిక్ ఛార్జెస్ అండ్ ఫీల్డ్స్ • ఎలక్ట్రో స్టాటిక్ పొటెన్షియల్ అండ్ కెపాసిటెన్స్ • ఎలక్ట్రో మాగ్నటిక్ మూవింగ్ ఛార్జెస్ అండ్ మాగ్నటిజమ్ • మాగ్నటిజమ్ అండ్ మ్యాటర్ • ఇండక్షన్ • ఎలక్ట్రో మాగ్నటిక్ వేవ్స్ • సెమీ కండక్టర్ ఎలక్ట్రానిక్స్ • కమ్యూనికేషన్ సిస్టమ్స్ • మోడ్రన్ ఫిజిక్స్ • రే ఆప్టిక్స్ అండ్ ఆప్టికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ • వేవ్ ఆప్టిక్స్

**రసాయనశాస్త్రం:** కెమిస్ట్రీ ఇన్ ఎవ్రీ డే లైఫ్ • అటామిక్ స్ట్రక్చర్ • సాలిడ్ స్టేట్

### ఈఈఈ

**గణితం:** వెక్టర్ ఆల్జీబ్రా • కాల్క్యులస్ • ర్యాండమ్ వేరియబుల్స్ అండ్ ప్రాబబిలిటీ డిస్ట్రిబ్యూషన్స్ • కాంప్లెక్స్ నంబర్స్ • కోఆర్డినేట్ జామెట్రీ • లోకస్



**భౌతికశాస్త్రం:** ఎలక్ట్రిక్ ఛార్జెస్ అండ్ ఫీల్డ్స్ • ఎలక్ట్రో స్టాటిక్ పొటెన్షియల్ అండ్ కెపాసిటెన్స్ • కరెంట్ ఎలక్ట్రిసిటీ • మూవింగ్ ఛార్జెస్ అండ్ మాగ్నటిజమ్ • మాగ్నటిజమ్ అండ్ మ్యాటర్ • ఎలక్ట్రో మాగ్నటిక్ ఇండక్షన్ • ఆల్టర్నేటివ్ కరెంట్ • ఎలక్ట్రో మాగ్నటిక్ వేవ్స్

**రసాయనశాస్త్రం:** ఎలక్ట్రో కెమిస్ట్రీ

### మెకానికల్

**గణితం:** వెక్టర్ ఆల్జీబ్రా • కాల్క్యులస్ • ట్రిగనామెట్రీ • ప్రాబబిలిటీ • ర్యాండమ్ వేరియబుల్స్ అండ్ ప్రాబబిలిటీ డిస్ట్రిబ్యూషన్స్ • కాంప్లెక్స్ నంబర్స్ • లీనియర్ ప్రోగ్రామింగ్



**భౌతికశాస్త్రం:** కైనెటిక్ థియరీ • థర్మోడైనమిక్స్ • మెకానిక్స్ • థర్మల్ ప్రాపర్టీస్ ఆఫ్ మ్యాటర్స్ • మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ సాలిడ్స్ • మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ ఫ్లూయిడ్స్

**రసాయనశాస్త్రం:** స్టాయికియోమెట్రీ • థర్మో డైనమిక్స్ • జనరల్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ మెటలర్జీ

### సివిల్

**గణితం:** వెక్టర్ ఆల్జీబ్రా • కాలుక్యులస్ • కోఆర్డినేట్ జామెట్రీ • ర్యాండమ్ వేరియబుల్స్ అండ్ ప్రాబబిలిటీ డిస్ట్రిబ్యూషన్స్



**భౌతికశాస్త్రం:** థర్మో డైనమిక్స్ • స్టాటిక్స్ • మెకానిక్స్

**రసాయనశాస్త్రం:** థర్మో డైనమిక్స్ • కెమికల్ కైనెటిక్స్ • ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ

### ఫార్మసీ

**గణితం:** లీనియర్ ఆల్జీబ్రా • డిఫరెన్షియల్ కాల్క్యులస్ • ఇంటిగ్రల్ కాల్క్యులస్ • ప్రాబబిలిటీ డిస్ట్రిబ్యూషన్

**భౌతికశాస్త్రం:** ప్రాపర్టీస్ ఆఫ్ ఫ్లూయిడ్స్ • ప్రాపర్టీస్ ఆఫ్ లిక్విడ్స్ • హీట్ ట్రాన్స్‌ఫర్

**రసాయన శాస్త్రం:** కెమిస్ట్రీ ఇన్ ఎవ్రీడే లైఫ్ • అటామిక్ స్ట్రక్చర్ • సాలిడ్ స్టేట్ • సొల్యూషన్స్ • ఆర్గానిక్ కెమిస్ట్రీ



**బయాలజీ:** బాడీ ఫ్లూయిడ్స్ అండ్ సర్క్యులేషన్ • సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్ • మైక్రో బయాలజీ • రెస్పిరేటరీ సిస్టమ్

- **పెమ్మసాని బాపనయ్య,** ఈనాడు, హైదరాబాద్

# నోటీస్ బోర్డు

## ప్రభుత్వ ఉద్యోగాలు

### ఏపీలో 1,84,498 గ్రామ వాలంటీర్లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతనం ప్రాతిపదికన గ్రామ వాలంటీర్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **గ్రామ వాలంటీర్**

**ఖాళీలు:** 1,84,498 **అర్హత:** మైదాన ప్రాంతాల్లో ఇంటర్, గిరిజన ప్రాంతాల్లో పదోతరగతి ఉత్తీర్ణత. అభ్యర్థులు ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోనివారై ఉండాలి. **వయసు:** 18-35 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా. **ఇంటర్వ్యూ తేదీలు:** జులై 11 నుంచి 25 వరకు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** జులై 5
**వెబ్‌సైట్:** http://gramavolunteer.ap.gov.in/

### మౌలానా ఆజాద్ ఎన్ఐటీ

భోపాల్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)... నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**పోస్టులు-ఖాళీలు:** డిప్యూటీ రిజిస్ట్రార్-02, అసిస్టెంట్ రిజిస్ట్రార్-02, డిప్యూటీ లైబ్రేరియన్-01, లైబ్రేరియన్-01, మెడికల్ ఆఫీసర్-01, ఎస్ఏఎస్ ఆఫీసర్-01, టెక్నికల్ ఆఫీసర్-02, జూనియర్ అసిస్టెంట్-15, సీనియర్ అసిస్టెంట్-05, జూనియర్ ఇంజినీర్-05, ఎస్ఏఎస్ అసిస్టెంట్-04, టెక్నికల్ అసిస్టెంట్-21, ఫార్మాసిస్ట్-01, టెక్నీషియన్-27. **ఎంపిక:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు:** జూన్ 25 నుంచి జులై 16 వరకు.
**వెబ్‌సైట్:** www.manit.ac.in

### ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) గువాహటి...ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**పోస్టులు-ఖాళీలు:** ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్-07, కోచ్-11.
**విభాగాలు:** బ్యాడ్మింటన్, బేస్‌బాల్, క్రికెట్, హాకీ, టేబుల్ టెన్నిస్ తదితరాలు. **అర్హత:** డిగ్రీ, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో బ్యాచిలర్ డిగ్రీ/ డిప్లొమా, కోచింగ్‌లో డిప్లొమా/ సర్టిఫికెట్, అనుభవం. **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ప్రాక్టికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** జులై 5
**వెబ్‌సైట్:** www.iitg.ac.in

## ప్రవేశాలు

### నిర్మాణ నిర్వహణలో పీజీ ప్రోగ్రాం

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రిసెర్చ్ (నిక్‌మార్).. 2019 సంవత్సరానికిగానూ కింది పీజీ ప్రోగ్రాములో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
NICMAR
**కోర్సు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్
**కాలవ్యవధి:** రెండేళ్లు
**ఆఫర్ చేస్తున్న ప్రాంగణం:** దిల్లీ ఎన్‌సీఆర్ (బహదూర్‌గఢ్) **అర్హత:** ఇంజినీరింగ్/ ఆర్కిటెక్చర్/ ప్లానింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. **ఎంపిక:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. **చివరితేది:** జులై 5
**వెబ్‌సైట్:** https://nicmar.ac.in/

NEW! క్యాంపస్ మెయిల్

# పాఠాల కంటే చర్చలే ఎక్కువ!

**దేశవిదేశాల్లోని ప్రసిద్ధ సంస్థలు, కళాశాలలకు చదువుల కోసం ఏటా వేలమంది మన వాళ్లు వెళుతుంటారు. కానీ అక్కడి విద్యావిధానం గురించి తెలుసుకొని చేరేవాళ్లు చాలా తక్కువ. అందుకే ఆయా సంస్థల్లో బోధనా పద్ధతులు, వాతావరణం, జీవనం, ఇతర సౌకర్యాలు ఎలా ఉంటాయో ప్రత్యక్ష అనుభవంతో తెలుసుకున్న విద్యార్థులు ఈ కొత్త శీర్షిక 'క్యాంపస్ మెయిల్' ద్వారా వాటిని పంచుకుంటున్నారు. ఒక్కో సంస్థలో.. ఒక్కో కోర్సులో.. ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. విద్యాభ్యాసంతోపాటు బహుముఖ వికాసాన్ని పొందే అవకాశాలను క్యాంపస్‌లు కల్పిస్తాయి. ఆ వివరాలను ఈ 'మెయిల్'లో తెలుసుకోవచ్చు.**

**అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్ (యూ-పిట్)లో ఎంఎస్ సోషల్ వర్క్ కోర్సు చేస్తున్న మేధా మురళీధర్ అలాంటి విశేషాలను వివరిస్తున్నారు.**



సోషల్ వర్క్ అత్యుత్తమ శిక్షణ పొందిన వ్యక్తుల చేతిలో విలువైన మానవీయ పరికరం. ఇదో శాస్త్రం. ఈ విద్యలో డిగ్రీ, పీజీ, డాక్టరేట్ మొదలైన స్థాయిలున్నాయి. అన్నిటిలాగే ఈ వృత్తిలోనూ అంచెలంచెలుగా పైకి వచ్చే అవకాశాలున్నాయి. ఆర్థికంగా మంచి జీతభత్యాలున్నాయి. మానవ సంబంధాల పట్ల శాస్త్రజ్ఞానం, నైపుణ్యం ఉన్న వ్యక్తులు చేసే సంఘసేవ యావత్ సమాజానికీ ఉపయోగపడుతుంది.

నా సంగతికొస్తే- యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ-హెల్త్ సైకాలజీ పూర్తిచేసిన తర్వాత స్కాలర్‌షిప్‌తో యూ-పిట్‌లో రెండేళ్ల ఎంఎస్ సోషల్ వర్క్‌లో గత ఏడాది చేరాను. చేరిన మూడు నెలలకే సోషల్ వర్క్ విభాగం నుంచి అంతర్జాతీయ ప్రతినిధిగా ఎన్నికవటం సంతోషాన్నిచ్చింది.

మనదేశ విద్యావిధానానికి భిన్నమైనది అమెరికన్ బోధనా పద్ధతి. 'ఎంత ఎక్కువ' నేర్చుకున్నామన్నదానికన్నా 'ఎంత బాగా' నేర్చుకున్నామన్నది ఇక్కడ ముఖ్యం. క్షేత్ర స్థాయిలో తెలుసుకున్న విషయాన్ని ఎంత ప్రభావపూరితంగా అన్వయించగలమనేది గమనిస్తారు. 'పిట్స్ బర్గ్ స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్' అంతర్జాతీయ ప్రాముఖ్యమున్న విద్యాసంస్థ. కిందటి సంవత్సరమే శత వార్షికోత్సవాన్ని నిర్వహించుకుంది.

### నైపుణ్యాలకు పదును...

మా డిపార్ట్‌మెంట్లో మాస్టర్స్ విద్యార్థుల అధ్యయనం కోసం డైరెక్ట్ ప్రాక్టీస్, కోసా (కమ్యూనిటీ ఆర్గనైజేషన్, సోషల్ యాక్షన్) అనే స్ట్రీములుంటాయి. నేను కోసాను ఎంచుకున్నా. ప్రభుత్వాన్నీ, సంఘాన్నీ సంధానపరుస్తూ క్రియాశీలకంగా సంఘసేవ చేయటం దీనిలో ఉంటుంది. కోసా విద్యార్థిగా నా చదువు ఆసక్తికరంగా మాత్రమే కాదు; తెలివితేటలకూ, నైపుణ్యాలకూ పదును పెట్టేదిగానూ ఉంటోంది. మాస్టర్స్ విద్యార్థులు మొదటి సంవత్సరంలో ఏదైనా సేవాసంస్థలో పనిచేయాల్సి వుంటుంది. వారంలో రెండు రోజులు ఫీల్డులో గడుపుతాం. రెండో సంవత్సరానికొచ్చేసరికి వారానికి మూడు రోజులు ఫీల్డులో, మిగిలిన రెండు రోజులు తరగతిలోఉంటాం. తరగతి పాఠాలు, ఇంటర్న్‌షిప్ కాకుండా విద్యార్థులు నేర్చుకోవటానికీ, పనిచేయటానికీ ఎన్నో కమిటీలుంటాయి. వివిధ సమస్యల విషయమై ఈ కమిటీలు సాంఘిక న్యాయం కోసం పోరాడుతూ వుంటాయి. స్టూడెంట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్లో నన్ను అంతర్జాతీయ ప్రతినిధిగా ఎన్నుకున్నారు. ఈ కౌన్సిల్లో పనిచేయటం వల్ల నాయకత్వ లక్షణాలు, పరస్పర సహకారం, సంయమనం అలవాటవుతాయి. ఈ కౌన్సిల్ నేరుగా డీన్ పర్యవేక్షణలో, ప్రొఫెసర్ల మార్గదర్శనంలో పనిచేస్తుంది. నాకు సంబంధించిన ఓ విశేషం- చేరిన ఆరు నెలలకు 'ఐరిస్ మేరియాన్ యంగ్' అనే అంతర్జాతీయ సమస్యల అధ్యయనకర్త పేర నెలకొల్పిన ఉత్తమ పురస్కారం నాకు దక్కటం. బాలల హక్కుల సంస్థలో విద్యాబోధనకు నేను ప్రవేశపెట్టిన సృజనాత్మక బోధనా పరికరాలకూ, నేతృత్వ స్ఫూర్తికీ ఈ గౌరవం లభించింది. మా విద్యాసంస్థలో ప్రత్యేకంగా లెక్చర్లు అంటూ జరగటం తక్కువ. వర్తమాన అంశాల గురించి తరగతిలో విద్యార్థులకూ, ప్రొఫెసర్లకూ మధ్య చర్చలే ఎక్కువ సాగుతాయి. ఫీల్డులో పనికొచ్చే కౌశలాలను పాఠాల ద్వారా నేర్పుతారు. పరీక్షల కోసం మాత్రమే చదవటం అనేది దాదాపు ఉండదు.

**మీరూ రాయవచ్చు**

**సుప్రసిద్ధ విద్యాసంస్థల్లో మీరు చదువుతున్నారా? అయితే మీరూ ఈ శీర్షికకు రాయొచ్చు. మీ కళాశాల ప్రత్యేకతలనూ, కోర్సు, బోధన పద్ధతుల్లోని విశిష్టతలనూ అందరితో పంచుకోవచ్చు. మా మెయిల్ ఐడీ:** edc@eenadu.in

### ఆహ్లాదకరంగా క్యాంపస్

ఈ యూనివర్సిటీ నగరంలో ఒక భాగం. దగ్గర్లో చాలా వరకూ పాతకాలం ఇళ్లు ఉంటాయి. కొందరు విద్యార్థులు కలిసి అద్దెకు తీసుకునివుంటారు. మాస్టర్స్ విద్యార్థులంతా క్యాంపస్ బయటే ఉంటారు. అమెరికాలోని ఇతర నగరాలకంటే పిట్స్‌బర్గ్‌లో విద్యార్థులకు రోజువారీ జీవితం ఖర్చు చవక అని చెప్పవచ్చు. విద్యార్థులకు బస్సు వసతి ఉచితం. మ్యూజియాలను ఉచితంగా చూడొచ్చు. లైబ్రరీ, ఫిట్‌నెస్ సెంటర్, వినోదం కోసం ప్రత్యేక ప్రదేశాలు, విద్యార్థి బృందాలు ఏర్పాటు చేసే కార్యక్రమాలతో క్యాంపస్ వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. మాస్టర్స్ కోర్సులో నేనొక్కదాన్నే భారతీయురాలిని. ప్రతి సబ్జెక్టులో పాతిక మంది కంటే ఎక్కువమందికి ప్రవేశం ఉండదు. దీనివల్ల ప్రొఫెసర్లు అందరిపట్ల వ్యక్తిగత శ్రద్ధ వహించేందుకు వీలుంటుంది. భారతీయ విద్యార్థుల సంఘాలు యూనివర్సిటీలో ఉన్నాయి. కొత్తగా వచ్చిన భారతీయ విద్యార్థులకు సాయపడతారు. యూనివర్సిటీలో ఎంఎస్ సోషల్‌వర్క్ కోర్సు వివరాలు, ఇతర సమాచారం ఇంకా తెలుసుకోవాలంటే నన్ను సంప్రదించవచ్చు.

### ఈ యూనివర్సిటీలో చేరాలంటే?

ప్రపంచ ర్యాంకింగులు, రివ్యూలు అద్భుతంగా ఉన్న యూనివర్సిటీ ఇది. పైగా పిట్స్‌బర్గ్‌లో నేరాల శాతం బాగా తక్కువ. దీనిలో చేరాలంటే... అన్ని మాస్టర్స్ కోర్సులకు ఉన్నట్లే టోఫెల్ స్కోరు, చదివిన కోర్సులో మంచి మార్కులు, ప్రొఫెసర్ల దగ్గర్నుంచి చక్కటి సిఫార్సులు తప్పకవుండాలి. ముఖ్యంగా స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ (ఎస్ఓపీ)తో యూనివర్సిటీ డిపార్ట్‌మెంటును ఒప్పించగలగాలి. జీఆర్ఈ స్కోరు అవసరం లేదు.

**యూ-పిట్ వెబ్‌సైట్:** https://www.socialwork.pitt.edu/
**నా మెయిల్ ఐడీ:** kmedha26@gmail.com





Eenadu epaper

సెన్సెక్స్ ▼ 72 **39123** | నిఫ్టీ ▼ 24 **11700** | డోజోన్స్ 26736 ▲ 17 | నాస్‌డాక్ 8015 ▼ 17 | రూపాయి 69.35 ▲ 23 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడి చమురు 64.17 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).




| ఘనం (+) | | | గ్రహణం (-) | | |
|---|---|---|---|---|---|
| నిఫ్టీ | 24న | మార్పు% | నిఫ్టీ | 24న | మార్పు% |
| UPL | 936.55 | 5.22 | JSW STEEL | 257.80 | -3.50 |
| YES BANK | 111.95 | 2.14 | ONGC | 165.20 | -3.36 |
| M & M | 634.85 | 1.18 | EICHER MOTORS | 19098.20 | -3.15 |
| INDIABULLS HSG | 619.10 | 1.16 | VEDANTA | 168.45 | -2.29 |
| TCS | 2275.50 | 1.14 | TATA STEEL | 486.25 | -2.29 |
| SBI | 353.20 | 1.09 | BAJAJ AUTO | 2816.90 | -2.04 |
| ADANI PORT | 406.00 | 1.00 | TECH MAHINDRA | 728.25 | -1.65 |

**విదేశీ మారకపు రేట్లు**

(థామస్ కుక్) (రూ.లలో)



| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం | కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|---|
| అమెరికా డాలరు | 63.30 | 73.40 | బహ్రెయిన్ దీనార్ | 171.34 | 196.04 |
| పౌండ్ స్టెర్లింగ్ | 80.69 | 93.57 | కువైట్ దీనార్ | 189.41 | 235.87 |
| యూరో | 72.04 | 83.56 | ఒమన్ రియాల్ | 167.67 | 192.07 |
| జపనీస్ యెన్/100 | 58.95 | 68.36 | సౌదీ రియాల్ | 16.83 | 19.95 |
| ఆస్ట్రేలియా డాలరు | 44.02 | 50.94 | యూఏఈ దిర్హమ్ | 17.23 | 20.14 |
| సింగపూర్ డాలరు | 46.75 | 55.37 | మలేసియా రింగిట్ | 14.95 | 18.38 |
| థాయ్ బాత్/100 | 205.55 | 245.75 | చైనీస్ యువాన్ | 7.15 | 11.62 |

**సోమవారం నిఫ్టీ కదలికలు**




# ఇక్కడి రాయినీ అమెరికా వదిలిపెట్టదా!

- దేశీయ క్వార్ట్జ్ స్టోన్‌కు అధిక సుంకాల ముప్పు
- అమెరికా వాణిజ్య శాఖ, ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ వద్ద ఫిర్యాదులు
- స్థానిక పరిశ్రమ వర్గాల ఆందోళన



ఈనాడు, హైదరాబాద్: మనదేశం నుంచి గత కొంతకాలంగా యూఎస్ మార్కెట్‌కు పెద్దఎత్తున జరుగుతున్న క్వార్ట్జ్ స్టోన్ ఎగుమతులకు అడ్డుకట్ట పడే ప్రమాదం కనిపిస్తోంది. యూఎస్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలే దీనికి ప్రధాన కారణం. చైనా నుంచి క్వార్ట్జ్ స్టోన్ దిగుమతులను అధిక సుంకాలతో అడ్డుకున్న చందానే మనదేశం నుంచి కూడా దిగుమతులను అడ్డుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందుకు వీలుగా మనదేశం నుంచి జరిగే దిగుమతులపై అధికంగా సుంకాలు వడ్డించాలని కోరుతున్నాయి. యూఎస్‌లోని కాంబ్రియా కంపెనీ ఎల్ఎల్‌సీ అనే సంస్థ మనదేశంతో పాటు టర్కీ నుంచి దిగుమతి అయ్యే క్వార్ట్జ్ స్టోన్ ఉత్పత్తులపై యాంటీ- డంపింగ్ (ఏడీ), కౌంటర్‌వేలింగ్ డ్యూటీ (సీవీడీ) విధించాలనే డిమాండ్‌తో యూఎస్ వాణిజ్య శాఖతో పాటు యూఎస్ ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ వద్ద గత నెలలో ఒక పిటీషన్ దాఖలు చేసింది. ఈ రెండు దేశాల నుంచి క్వార్ట్జ్ ఉత్పత్తులు అమెరికాను ముంచెత్తుతున్నాయని, తద్వారా ఆ దేశాలకు చెందిన కంపెనీలు పెద్ద ఎత్తున లాభాలు గడిస్తున్నాయని అందులో పేర్కొంది. చైనా ఉత్పత్తుల మీద యాంటీ-డంపింగ్ డ్యూటీల కోసం ఒత్తిడి తీసుకువచ్చిన సంస్థల్లో ఇది కూడా ఒకటి కావటం గమనార్హం. కాంబ్రియా యూఎస్‌లో క్వార్ట్జ్ స్టోన్ ఉత్పత్తులు తయారు చేస్తున్న సంస్థ. భారత్, టర్కీ దేశాల నుంచి కౌంటర్‌టాప్స్, టైల్స్, బార్ సర్ఫేసెస్, షోవర్- టబ్ సరౌండ్స్ వంటి ఎన్నో రకాలైన క్వార్ట్జ్ ఉత్పత్తులు అమెరికా మార్కెట్‌కు రావటం వల్ల తమ వంటి దేశీయ తయారీదార్లకు నష్టం కలుగుతోందని కాంబ్రియా వాదిస్తోంది. ఈ పిటీషన్‌పై ఇప్పటికే అక్కడ చట్టపరమైన పరిశీలన ప్రారంభమైంది.

అమెరికా- చైనా మధ్య వర్తక యుద్ధం వల్ల గత కొంతకాలంగా మనదేశంలో తయారయ్యే క్వార్ట్జ్ స్టోన్ (ఇంజనీర్డ్ స్టోన్) కు ఎగుమతి అవకాశాలు పెరిగాయి. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌కు పెద్దఎత్తున ఎగుమతులు మొదలయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా క్వార్ట్జ్ స్టోన్‌కు అమెరికా అతి పెద్ద మార్కెట్ అనేది తెలిసిన విషయం. దాన్ని ఇంతకాలం చైనా సొమ్ము చేసుకుంటూ వచ్చింది. చైనా నుంచి క్వార్ట్జ్ స్టోన్ పెద్దఎత్తున అమెరికాకు ఎగుమతి అవుతోంది. అక్కడ దాదాపు మూడో వంతు మార్కెట్‌ను చైనా కంపెనీలే ఆక్రమించాయి. కొంతకాలం క్రితం చైనా నుంచి దిగుమతి అయ్యే క్వార్ట్జ్ స్టోన్ ఉత్పత్తులపై యూఎస్ వాణిజ్య శాఖ ప్రాథమికంగా 34.48 శాతం నుంచి 190.99 శాతం వరకూ డంపింగ్ సుంకాలు విధించింది. అప్పటి నుంచి చైనా కంపెనీల స్థానంలో మనదేశానికి చెందిన తయారీదార్ల నుంచి అమెరికా వినియోగదార్లు క్వార్ట్జ్ స్టోన్ కొనుగోలు చేయటం మొదలు పెట్టారు. ఈ పరిస్థితి అక్కడి తయారీదార్లకు మింగుడుపడటం లేదు.

క్వార్ట్జ్ స్టోన్ తయారీదార్ల సంఖ్య మనదేశంలో ఇటీవల కాలంలో ఎంతో పెరిగింది. ఆసియన్ గ్రానైటో నుంచి శివ గ్రానిటో ఎక్స్‌పోర్ట్స్, క్వార్ట్జ్ స్టోన్ ఇండియా, అలికాంటే సర్ఫేసెస్, మార్బుల్ సెంటర్ ఇంటర్నేషనల్ వంటి ఎన్నో కంపెనీలు దేశీయ విక్రయాలతో పాటు ఎగుమతులకు సిద్ధపడుతున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా క్వార్ట్జ్ స్టోన్ తయారీలో నిమగ్నమైన పెద్ద కంపెనీలు రెండు, మూడు ఉన్నాయి. చైనా నుంచి నుంచి యూఎస్‌కు ఎగుమతి చేస్తే అధిక సుంకాలు చెల్లించాల్సి రావటంతో ప్రత్యామ్నాయంగా చైనా కంపెనీలు మనదేశంలోని కంపెనీల ద్వారా ఎగుమతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీనివల్ల ఇక్కడ క్వార్ట్జ్ స్టోన్ తయారీ రంగంలో చైనా పెట్టుబడులు పెరుగుతున్నాయి. అదే సమయంలో దేశీయ కంపెనీల మధ్య పోటీ కూడా పెరుగుతోంది. చైనా- యూఎస్ వర్తక యుద్ధం మనకు మంచి అవకాశాన్ని ఇచ్చిందని భావిస్తుంటే, ఇప్పుడు దానికి గండి కొట్టేందుకు యూఎస్‌లో ప్రయత్నాలు జరగటం సంబంధిత వర్గాలకు మింగుడు పడటం లేదు. దీన్ని అడ్డుకోవాలని క్వార్ట్జ్ స్టోన్ పరిశ్రమ వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈ విషయంలో అమెరికా మీద ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నాయి.



ఐఎంఏ మహిళా విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ మోనా దేశాయ్ నుంచి ఒప్పంద పత్రాలు అందుకుంటున్న అపోలో హాస్పిటల్స్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి

## ఐఎంఏ మహిళా విభాగంతో అపోలో హాస్పిటల్స్ ఒప్పందం

### అవయవదానంపై ప్రజా చైతన్యానికి కృషి

ఈనాడు, హైదరాబాద్: అవయవదానాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో అపోలో హాస్పిటల్స్, ఇండియన్ మెడికల్ అసోషియేషన్ (ఐఎంఏ)కు చెందిన మహిళా విభాగంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం అవయవదానానికి ఉన్న ప్రాధాన్యం, అవసరాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావటానికి ఐఎంఏ మహిళా విభాగంతో కలిసి అపోలో హాస్పిటల్స్ కృషి చేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలో చూసినా అవయవదానానికి ఎంతో ప్రాధాన్యం కనిపిస్తోంది. అవసరాలు పెరిగిపోవటమే దీనికి కారణం. ఇతర దేశాలతో పోల్చితే మనదేశంలోనే అవయవ దాతల సంఖ్య తక్కువగా ఉంటోంది. ప్రతి 10 లక్షల మందిలో 0.8 మంది మాత్రమే అవయవ దానానికి ముందుకు వస్తున్నారు. కాలేయ వ్యాధులతో ఏటా మనదేశంలో దాదాపు ఒక లక్ష మంది చనిపోతున్నారు. కేవలం 1,000 మందికి మాత్రమే కాలేయ మార్పిడి సాధ్యమవుతోంది. మూత్రపిండాల మార్పిడి కోసం 2.2 లక్షల మంది ఎదురుచూస్తున్నారు. కేవలం 15,000 మందికి మాత్రమే మూత్రపిండాల మార్పిడి సాధ్యపడుతోంది. ఈ నేపథ్యంలో అవయవ దానంపై ప్రజల్లో చైతన్యం పెరగాల్సి ఉందని అపోలో హాస్పిటల్స్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి పేర్కొన్నారు. ఈ దిశగా ఐఎంఏ మహిళా విభాగంతో కలిసి పని చేస్తామని వివరించారు. ఐఎంఏ మహిళా విభాగంలో దేశవ్యాప్తంగా 3.5 లక్షల మంది వైద్యులు ఉన్నారు. ఎంతో ప్రాధాన్యం కల అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు తాము ముందుకు వచ్చినట్లు ఐఎంఏ మహిళా విభాగం ఛైర్‌పర్సన్ డాక్టర్ మోనా దేశాయ్ తెలిపారు.

## కేపీఆర్ అగ్రో పబ్లిక్ ఇష్యూ

- రూ.59-61 ధరల శ్రేణిలో జారీ
- ఈ నెల 28న ఇష్యూ ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కేపీఆర్ అగ్రోకెమ్ లిమిటెడ్ తొలిసారిగా పబ్లిక్ ఇష్యూకు (ఐపీఓ) వస్తోంది. ఈ ఇష్యూ ఈ నెల 28న ప్రారంభమై, వచ్చే నెల 2న ముగుస్తుంది. రూ.10 ముఖ విలువ కల ఒక్కో ఈక్విటీ షేర్‌ను రూ.59- రూ.61 ధరల శ్రేణిలో జారీ చేయాలని ప్రతిపాదించారు. కొత్త షేర్ల జారీ ద్వారా రూ.210 కోట్లు సమీకరించాలనేది కంపెనీ ప్రణాళిక. ఇదే కాకుండా 'ఆఫర్ ఫర్ సేల్' కింద 1.20 కోట్ల ఈక్విటీ షేర్లు విక్రయిస్తారు. మొత్తం షేర్లలో 40 శాతానికి తక్కువ కాకుండా రిటైల్ మదుపరులకు షేర్లు జారీ చేయాలనేది ప్రణాళిక. రిటైల్ మదుపరులతో పాటు కంపెనీ ఉద్యోగులకు ఒక్కో షేర్‌కు రూ.3 చొప్పున డిస్కౌంట్ ఇస్తారు. పంట రక్షణ ఉత్పత్తులతో పాటు విత్తనాలు, పోషకాలు, పశు పోషకాహార పదార్థాలను కేపీఆర్ అగ్రోకెమ్ లిమిటెడ్ తయారు చేస్తోంది. ఈ ఉత్పత్తులకు సల్ఫ్యూరిక్ యాసిడ్ కీలకం కాబట్టి, సల్ఫ్యూరిక్ యాసిడ్ తయారీ కూడా సొంతంగా చేపట్టింది. సొంత అవసరాలు తీరిపోగా మిగిలిన సామర్థ్యం మేరకు సల్ఫ్యూరిక్ యాసిడ్ ఉత్పత్తులను ఫార్మా కంపెనీలు, డిటెర్జెంట్లు తయారు చేసే కంపెనీలకు సరఫరా చేస్తోంది. 2018-19 ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలల కాలానికి రూ.483 కోట్ల టర్నోవర్‌ను, రూ.27.59 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది.

## ఆంధ్రా బ్యాంకు రూ.2000 కోట్ల మూలధన సమీకరణ

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రా బ్యాంకు రూ.2000 కోట్ల మూలధన నిధులు సమీకరించనుంది. దీని కోసం సంస్థాగత మదుపరులకు క్యూఐపీ పద్ధతిలో కానీ లేదా ఎఫ్‌పీఓ (ఫాలో-ఆన్ పబ్లిక్ ఆఫర్) లేదా ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్ పద్ధతిలో ఈక్విటీ షేర్లను ముఖ విలువ (రూ.10) కు కొంత ప్రీమియం నిర్ణయించి జారీ చేస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఈ నిధుల సమీకరణ పూర్తి చేయాలనేది ఆలోచన. దీనికి అవసరమైన అనుమతుల సేకరణ ప్రక్రియను చేపడతారు. సోమవారం నాడు జరిగిన బోర్డు సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు.

## మార్కెట్ కబుర్లు

- ✦ బిహార్‌లోని బక్సర్‌లో అల్ట్రా-సూపర్‌క్రిటికల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఎస్‌జేవీఎన్ నుంచి రూ.7000 కోట్లకు పైగా ఆర్డరును **ఎల్&టీ** విద్యుత్ విభాగం దక్కించుకుంది.
- ✦ టాటా సన్స్‌కు 2.46 కోట్ల వరకు ఈక్విటీ షేర్లను కేటాయించడం ద్వారా నిధులు సమీకరించేందుకు **ట్రెంట్** వాటాదార్ల అనుమతి కోరింది. రుణభారాన్ని తగ్గించుకోవడానికి ఈ నిధులు వినియోగించనుంది.
- ✦ శ్రీరామ్ క్యాపిటల్‌లోని మొత్తం 20 శాతం వాటాను విక్రయించేందుకు **పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్** సన్నాహాలు చేస్తోంది. పిరమాల్ ఆర్థిక సేవల వ్యాపార వృద్ధికి ఈ నిధులు వాడే యోచనలో ఉంది.
- ✦ **ఇండియామార్ట్ ఇంటర్‌మెష్** పబ్లిక్ ఇష్యూ తొలి రోజున 51% స్పందన లభించింది. ఇష్యూలో 26,92,824 షేర్లను జారీ చేయగా.. 13,57,365 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.
- ✦ **రైట్స్** వాటాదార్లకు బోనస్ షేర్లను జారీ చేయనుంది. వాటాదార్లకు ప్రతి 4 షేర్లకు ఒక బోనస్ షేరును జారీ చేయనుంది.
- ✦ **జెట్ ఎయిర్‌వేస్** దివాలా ప్రక్రియ కోసం ఎన్‌సీఎల్‌టీ నియమించిన రుణ పరిష్కార నిపుణుడు రుణదాతల నుంచి క్లెయిమ్‌లను ఆహ్వానించారు. జులై 4 లోగా రుణదాతలు క్లెయిమ్‌లు దాఖలు చేయాలి.
- ✦ మిత్సుబిషి కార్పొరేషన్‌తో కలిసి ఏర్పాటు చేసిన సంయుక్త సంస్థ టీసీఎస్ జపాన్‌లో వాటాను 66 శాతానికి పెంచుకుంటున్నట్లు **టీసీఎస్** ప్రకటించింది.
- ✦ క్యాటరాక్ట్ సర్జరీ చేయించుకున్న రోగులకు వినియోగించుకునే బ్రామ్‌ఫెనాక్ ఆప్తాల్మిక్ సొల్యూషన్‌కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ అనుమతి లభించిందని **అలెంబిక్ ఫార్మా** తెలిపింది.
- ✦ నివాస, వాణిజ్య ప్రాజెక్ట్‌లు, కర్మాగార పనుల నిమిత్తం రూ.514 కోట్ల కాంట్రాక్టులు దక్కించుకున్నట్లు **జేఎంసీ ప్రాజెక్ట్స్** తెలిపింది.

## రూ.75 కోట్లతో ఐఐఎల్ యూనిట్ విస్తరణ

### యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తయారీకి అవకాశం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఇండియన్ ఇమ్యునలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) హైదరాబాద్ శివార్లలోని కర్కపట్ల యూనిట్లో రూ.75 కోట్ల పెట్టుబడితో నూతన స్టెరైల్ ఫిల్లింగ్ ఫెసిలిటీ (ఎస్ఎఫ్ఎఫ్) ని ఏర్పాటు చేయనుంది. జీనోమ్ వ్యాలీ మూడో దశలో భాగంగా ఉన్న ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసే ఈ కొత్త యూనిట్ వల్ల యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వంటి పలు రకాలైన వ్యాక్సీన్లను అధికంగా సరఫరా చేయగల సత్తా ఈ సంస్థకు లభిస్తుంది. ఒక ఏడాది వ్యవధిలో నిర్మాణం పూర్తై ఈ ప్లాంటు అందుబాటులోకి వస్తుందని అంచనా. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, యంత్ర పరికరాలను దీన్లో వినియోగించనున్నట్లు ఐఐఎల్ వెల్లడించింది.

నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) స్థాపించిన సంస్థ అయిన ఐఐఎల్‌కు నాలుగు ప్రదేశాల్లో తయారీ యూనిట్లు ఉన్నాయి. హ్యూమన్ వ్యాక్సీన్లు- యానిమల్ హెల్త్ ఫార్ములేషన్ల తయారీకి కర్కపట్లలో యూనిట్ ఉండగా, ఊటీ వద్ద కల యూనిట్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తయారు చేస్తున్నారు. హ్యూమన్ బయోలాజికల్స్, యానిమల్ వ్యాక్సీన్ల తయారీకి హైదరాబాద్‌లోనే గచ్చిబౌలీ వద్ద మరొక యూనిట్ ఉంది. న్యూజీల్యాండ్‌లో ఉన్న యూనిట్లో బొవైన్ సీరమ్ తయారు చేస్తున్నారు. దేశీయ అమ్మకాలు మాత్రమే కాకుండా దాదాపు యాభై దేశాలకు ఈ సంస్థ వ్యాక్సీన్లు ఎగుమతి చేస్తోంది.

పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా వ్యాక్సీన్ల లభ్యతను పెంచాలనే లక్ష్యంతో కర్కపట్ల యూనిట్ విస్తరణ చేపట్టినట్లు ఐఐఎల్ ఎండీ డాక్టర్ కే. ఆనంద్ కుమార్ తెలిపారు. యాంటీ రేబిస్ వ్యాక్సీన్‌కు దేశీయంగా ఎంతో కొరత ఉన్నట్లు తెలుస్తోందని, ఈ సమస్యకు తాము ఎంతో కొంత పరిష్కారాన్ని చూపగలుగుతామని అన్నారు.



కర్కపట్ల యూనిట్లో ఎస్ఎఫ్ఎఫ్ సదుపాయం శంకుస్థాపన సందర్భంగా ఐఐఎల్ డిప్యూటీ ఎండీ డాక్టర్ ప్రసన్న, ఎండీ డాక్టర్ ఆనంద్ కుమార్ తదితరులు

## ఒడుదొడుకులమయం

- చమురు, లోహ షేర్లు డీలా
- అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యం



సమీక్ష

వరుసగా రెండో రోజూ సూచీలు నష్టపోయాయి. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు, లోహ షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తాయి. రుతుపవనాల పురోగతిపై ఆందోళనలు, మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 23 పైసలు బలపడి 69.35 వద్ద ముగిసింది. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతలతో చమురు ధరలు గణనీయంగా పెరిగాయి. అంతర్జాతీయంగా చూస్తే.. ఆసియా మార్కెట్లు సానుకూలంగా ముగియగా, ఐరోపా షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 39,160.23 పాయింట్ల వద్ద స్తబ్దుగా ప్రారంభమైంది. వెంటనే లాభాల్లోకి వచ్చిన సూచీ.. 39,300.02 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. అయితే లాభాల నిలబెట్టుకోలేకపోయిన సెన్సెక్స్.. నష్టాల్లోకి జారుకుంది. అనంతరం తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ 39,021.70 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 71.53 పాయింట్ల నష్టంతో 39,122.96 దగ్గర స్థిరపడింది. ఇక నిఫ్టీ సైతం 24.45 పాయింట్లు కోల్పోయి 11,699.65 దగ్గర స్థిరపడింది.

✦ విద్యుత్ వాహనాలకు మారేందుకు రెండువారాల్లోగా ప్రణాళిక ఇవ్వాల్సిందిగా ద్విచక్ర, త్రిచక్ర వాహన తయారీ సంస్థలను నీతి ఆయోగ్ కోరిన నేపథ్యంలో వాహన షేర్లు డీలాపడ్డాయి. ఐషర్ మోటార్స్ 3.05 శాతం, బజాజ్ ఆటో 1.97%, హీరో మోటోకార్ప్ 1.28 శాతం, టీవీఎస్ మోటార్ 0.62% నష్టపోయాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 15 నష్టాలు చవిచూశాయి. ఓఎన్‌జీసీ 3.48%, టాటా స్టీల్ 2.33%, వేదాంతా 2.23%, బజాజ్ ఆటో 1.97%, టెక్ మహీంద్రా 1.49%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.29%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.25%, యాక్సిస్ బ్యాంక్ 1.18% చొప్పున డీలాపడ్డాయి. యెస్ బ్యాంక్ 2.19%, ఎం అండ్ ఎం 1.31%, టీసీఎస్ 1.11%, ఎస్‌బీఐ 1.09%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 0.83% మేర రాణించాయి.

## భళా మారుతీ

- మేలో అమ్ముడుపోయిన 10 మోడళ్లలో 8 ఈ కంపెనీవే

దిల్లీ: దేశీయంగా మే నెలలో అత్యధికంగా విక్రయమైన ప్రయాణికుల వాహన మోడళ్లలో మారుతీ సుజుకీవే అత్యధికం ఉన్నాయి. అత్యధికంగా విక్రయమైన 10 రకాల మోడళ్లలో 8 మారుతీ సుజుకీవేనని వాహన తయారీదార్ల సంఘం (సియామ్) పేర్కొంది. అత్యధికంగా విక్రయమైన మోడళ్ల జాబితాలో మారుతీ స్విఫ్ట్ అగ్రస్థానంలో నిలిచింది. 2018 ఇదే నెలలో ఈ కారు 4వ స్థానంలో ఉంది. ఆల్టో మార్పు లేకుండా రెండో స్థానంలో నిలిచింది. సెడాన్ డిజైర్ అగ్రస్థానం నుంచి 3కు, ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనో స్థానం 3 నుంచి 4కు తగ్గింది. న్యూ వ్యాగన్‌ఆర్ 5వ స్థానంలోనే కొనసాగింది. వినియోగ వాహనం ఎకో 6వ స్థానంలోకి రాగా, హ్యుందాయ్ స్పోర్ట్స్ వినియోగ వాహనం క్రెటా 7లోనే ఉంది. హ్యుందాయ్ ఎలైట్ ఐ20 స్థానం 9 నుంచి 8కి పెరగ్గా, మారుతీ ఎర్టిగా 9లో, విటారా బ్రెజా 6 నుంచి 10కి తగ్గింది. కాగా గత నెలలో మొత్తంమీద వాహన విక్రయాలు 20 శాతం తగ్గడం గమనార్హం.



**జీఎస్‌టీ** పాఠకుల ప్రశ్నలకు సతీష్ సరాఫ్ సమాధానాలు రేపటి సంచికలో

**24న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)** (100కు రూపాయలలో)



| కోడిగుడ్లు | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 415 | వరంగల్ | 418 |
| చిల్లరగా(ఒక గుడ్డు) | 4.75 | విశాఖపట్నం | 430 |
| బెంగళూరు | 445 | చెన్నై | 470 |
| 25వ తేదీకి | | చిత్తూరు | 463 |
| విజయవాడ/గోదావరి | 420 | నమక్కల్ | 455 |

## ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, (క్రితం ముగింపు), ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

### నిఫ్టీ 50

ADANI PORT & 406.00 (402.00) 2582740
ASIAN PAINTS 1376.15 (1383.00) 757055
AXIS BANK LT 762.85 (771.05) 4866859
BAJAJ AUTO L 2816.90 (2875.55) 434882
BAJAJ FINANC 3545.35 (3565.85) 543703
BAJAJ FINSER 8354.65 (8392.45) 107927
BHARTI AIRTE 345.10 (343.80) 3249667
BHARTI INFRA 272.80 (275.35) 581858
BPCL 380.85 (380.00) 3271602
BRITANNIA 2780.50 (2826.70) 369267
CIPLA 549.90 (551.55) 981017
COAL INDIA L 256.75 (254.25) 2633348
DR. REDDYS 2513.40 (2551.55) 452261
EICHER MOTOR 19098.20 (19719.20) 124036
GAIL 306.70 (311.60) 3329240
GRASIM IND 886.65 (897.75) 1069347
HCL TECH 1077.90 (1076.25) 675052
HDFC 2148.90 (2140.80) 2038683
HDFC BANK 2417.95 (2414.20) 1728750
HERO MOTOCOR 2586.25 (2606.00) 725058
HINDALCO IND 198.20 (197.65) 10464941
HINDUSTAN UN 1764.45 (1766.65) 762144
ICICI BANK 429.45 (430.80) 8545999
INDIABULLS H 619.10 (612.00) 18651952
INDIAN OIL 152.05 (153.85) 5588771
INDUSINDBANK 1461.55 (1448.65) 4102227
INFOSYS LTD 745.50 (750.20) 4758178
ITC 276.25 (274.25) 8935066
JSW STEEL LT 257.80 (267.15) 5807872
KOTAK MAHIND 1470.60 (1489.80) 2026531
LARSEN & TOU 1541.00 (1539.75) 1941777
M&M 634.85 (627.45) 2166403
MARUTI SUZIK 6459.90 (6417.25) 911826
NTPC LTD 135.60 (134.55) 5918107
ONGC 165.20 (170.95) 6585159
POWER GRID C 199.05 (199.90) 5559408
RELIANCE IND 1262.40 (1279.50) 5150998
SBI 353.20 (349.40) 17919504
SUN PHARMA 383.45 (382.80) 3702836
TATA CONSULT 2275.50 (2249.85) 1382424
TATA MOTORS 159.30 (158.90) 13185118
TATA STEEL L 486.25 (497.65) 7262000
TECH MAHINDR 728.25 (740.45) 1242655
TITAN IND 1300.05 (1292.35) 1419605
ULTRATECH 4574.80 (4595.15) 228331
UPL LIMITED 936.55 (890.10) 6506356
VEDANTA LIMI 168.45 (172.40) 8439464
WIPRO 283.90 (285.85) 3171739
YES BANK LTD 111.95 (109.60) 79695315
ZEE ENTERTAI 341.35 (345.65) 5065730

### నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1560.90 (1559.05) 73029
ACC 1537.60 (1532.45) 536701
AMBUJA CEMEN 215.00 (212.85) 2639044
ASHOK LEYLAN 85.80 (86.50) 11625336
AUROBIND PHA 586.30 (602.45) 4412032
AVENUE SUPER 1329.20 (1320.45) 118535
BAJAJ HOLDIN 3603.95 (3633.40) 18104
BANDHAN BANK 533.90 (530.75) 339147
BANK OFBAROD 118.25 (118.05) 16957023
BHEL 73.70 (71.40) 18372701
BIOCON LTD 249.50 (249.55) 1812625
BOSCH LTD 16401.40 (16466.40) 5669
CADILA HEALT 229.05 (235.05) 2063844
COLGATE PALM 1135.45 (1130.55) 135974
CONTAINER 553.35 (553.40) 872206
DABUR INDIA 392.35 (392.60) 1284017
DIVIS LAB 1576.30 (1545.75) 512756
DLF LIMITED 175.55 (177.55) 7231257
GENERAL INS 205.80 (205.90) 60195
GODREJ CONSU 674.20 (669.40) 351635
HAVELLS INDI 785.40 (786.15) 770379
HDFC AMC LIM 1933.85 (1872.25) 275168
HDFC STAND L 440.10 (438.15) 479020
HINDUSTAN ZI 227.95 (230.75) 441784
HPCL 288.60 (291.90) 3593539
ICICI LOMBAR 1175.65 (1155.55) 169951
IDEA CELLULR 12.10 (12.15) 36858260
INTERGLOBE A 1555.05 (1552.10) 856218
L&TFIN.HOLD 113.75 (114.20) 6192416
LUPIN 732.80 (712.80) 2572927
MARICO LIMIT 369.40 (369.30) 2449869
MCDOWELL 560.05 (551.90) 706786
MOTHERSON 121.15 (126.50) 11494503
MRF 54660.70 (54922.40) 5044
NHPC LTD 25.05 (25.20) 1948350
NMDC LTD 109.85 (111.25) 2251595
ORACLE FIN S 3113.80 (3098.65) 19758
P&G HYG&HEAL 10717.95 (10765.25) 2064
PAGE INDUSTR 20630.35 (20887.45) 15758
PETRONET LNG 242.00 (241.55) 1331895
PIDILITE IND 1226.30 (1233.00) 201599
PIRAMAL ENTE 1943.10 (1890.20) 1588437
SAIL 49.15 (50.05) 21205616
SBI LIFE INS 710.60 (699.95) 376039
SHREE CEMENT 21081.30 (21154.40) 21987
SHRIRAM TRAN 1114.20 (1098.40) 3237919
SIEMENS 1247.85 (1240.15) 340429
THE NEW INDI 149.05 (148.70) 22467
UNITED BREWE 1359.95 (1350.65) 287326

### బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 3.65 (3.75) 120
AISHWARYA TE 2.10 (2.21) 410
ALPHAGEO 430.35 (423) 268
AMAR RAJA BA 601.20 (607.75) 17793
ANDHRA BANK 22.70 (22.55) 33756
ANDHRA CEMEN 4.05 (4.05) 16689
ANDHRA PAPER 424.30 (424.45) 12603
ANDHRA PETRO 55.35 (55.05) 19363
ANDHRA SUGAR 325.10 (324.05) 503
ANJANI PORTL 162 (165.65) 2891
ASTRA MICROW 85.90 (87.30) 8470
AUROBINDO PH 586.20 (602.35) 154911
AVANTEL SOFT 238 (238.95) 628
AVANTI FEEDS 355.55 (364.30) 26128
AVON ORG 2.47 (2.47) 7
BALAJI AMIN 377.10 (375.60) 1595
BARTRONICS 3.51 (3.61) 7499
BHAGIRA CHEM 464.80 (470.65) 1767
BHAGYA NAG 24.10 (24.60) 350
BN RATHI SEC 18.30 (18.70) 2104
BRILLIANT SE 0.95 (0.97) 4600
CAMBRIDGE TE 32.10 (32.80) 1443
CIL SECURI 13.70 (12.47) 4667
COMBAT DRUGS 21.35 (22.45) 100
CONT COFFEE 252.30 (249.05) 3627
COROMAN FERT 406.05 (410.05) 4367
CUBEX TUB 10.93 (11.43) 273
CYBERMATE 1.94 (1.91) 3165
CYIENT LIMIT 555.65 (564.75) 2678
DECCAN CEMEN 386.65 (391.55) 1036
DIVI'S LAB 1576.25 (1547.05) 22279
DIVYA GRANIT 79.30 (75.90) 209
DR REDDY 2511.80 (2549.95) 25683
FOUR SOFT 27.50 (27.90) 720
GATI CORPN 66.50 (65.35) 96956
GAYATRI PROJ 158.70 (157.90) 281
GMR INFRASTR 15.40 (15.40) 525712
GOLDST INFRA 178.50 (188.80) 14864
GOLDSTONE EN 9.45 (9) 969
GRANULES (I) 95.85 (93.20) 46644
GSS AMERICA 93.55 (99.80) 45618
GVK POWER 6.09 (6.35) 168777
HBL NIFE POW 22.50 (23.25) 23012
HERITAGE FOO 409.40 (404.50) 1465
HIL LTD 1544.25 (1541.70) 953
HIND FLUROCA 10.04 (10.21) 5861
IDL INDUSTRS 272 (271.80) 44
ILFS ENGINEE 5.74 (5.74) 7038
INCAP 32.45 (32.95) 350
IVRCL INFRAS 0.73 (0.70) 7030
JEEVAN SCIEN 26.55 (25.25) 1147
KAKATIYA CEM 175.75 (172.30) 4112
KALLAM SPG 12.95 (12.80) 1713
KAVERI SEED 470.30 (472.05) 18918
KCP LTD 85.45 (85) 4768
KERNEX MICRO 26.70 (27.15) 2218
KNR CONSTRUC 280.90 (282.80) 1441
KREBS BIO 81 (86.85) 222
LANCO INDUS 167.25 (164.70) 3597
LAURUS LABS 329.45 (332.05) 3846
LOKESH MACH 47.60 (42.35) 38720
MADHUCON PRO 6 (6.12) 4025
MEGA SOFT 7.43 (7.08) 1370
MIC ELECTRON 0.75 (0.78) 8924
MOLD-TEK.TEC 52 (53.40) 4334
MOLDTK PLA 240.60 (240.50) 231
MSR INDIA LT 9.59 (9.56) 341
NAGARJAGRICH 30.05 (29.75) 14070
NATCO PHARMA 546.30 (538.60) 7884
NAVA BH VENT 96.20 (95.30) 9167
NCC 100.55 (99.60) 274812
NCL IND 134.25 (133.30) 1243
NEHA INTER 1.55 (1.48) 4711
NETTLINX 36.35 (35.75) 5237
NEULAND LAB 517.15 (521.25) 1918
NIHAR INFO 9.50 (9.50) 500
NILE 254.90 (259.35) 359
NORTHGATE TE 0.36 (0.37) 7719
OIL COUNTRY 6.87 (6.80) 21054
PENNER IND 33.05 (33.70) 4022
PHYTOCHEM I 27.80 (25.05) 120
PITTI LAMIN 46.90 (47.20) 6812
POKARNA 147.50 (143) 4789
PRAJAY ENGS 7.22 (7.70) 300
PREMIER EXPL 194.90 (190.60) 569
PRISM CEMENT 91.10 (91.75) 5240
PRUDENTL PHA 3.59 (3.54) 2070831
RAASI REFRAC 5.30 (5.30) 50
RAGSAN PETRO 86.15 (85.20) 58
RAIN INDUSTR 99.30 (97.80) 98657
RAJ PACKAGIN 22.75 (21.70) 33
RAM INFORMAT 35.35 (38.95) 827
REG.CERAMIC 2.39 (2.45) 16346
SAGAR CEM 611.50 (612.40) 1077
SAMKRG PIST 130.20 (135.75) 3952
SAMPRE NUTRI 14 (14.15) 10
SATVAH. ISPA 6.64 (6.98) 4171
SMS PHARMA 53.10 (55) 402
SOUTH BIO TE 0.91 (0.92) 1100
SREE RAYAL A 30 (30) 28940
STEEL EXCHAN 12.25 (12.05) 554
SUJANA METAL 0.38 (0.40) 7700
SUJANA TOWER 0.92 (0.96) 2298
SUJANA UNIVE 0.25 (0.26) 5820
SURANA TELE 3.66 (3.60) 4000
SURYALAKSH.C 26 (23.70) 4037
SURYALATA SP 145.35 (150) 1272
SUVEN PHARMA 270.45 (270.20) 16881
TAJ GVK HOTE 181.95 (183.60) 549
TANLA 70.25 (67.20) 125402
TERA SOFTWAR 35.90 (35.75) 1625
TRANS BIOTEK 3.22 (3.29) 11487
VAMSHI RUBB 20 (20.20) 407
VICEROY HOTE 1.75 (1.83) 8400
VIJAY TEXTIL 20.60 (20) 3466
VIMTA LABS 174.40 (175.40) 90
VISAKA IND 370.65 (377.50) 275
VISTA PHARMA 14.25 (13.90) 225
VIVIMED LABS 17.10 (16.95) 13300
VJIL CONSULT 41.75 (40) 350
VST INDUS 3432 (3457.70) 46
YBRANT DIGIT 5.10 (4.86) 129972
ZENOTECH LAB 14.75 (15.15) 6861
ZENTECH 71.50 (71.20) 3615

# ఒక్కసారిగా మార్చేయగలమా?

# 'విద్యుత్ షాక్'పై వాహన కంపెనీలు

- 2025 కల్లా ద్వి, త్రిచక్ర వాహనాలన్నీ సాధ్యం కాదు
- ఆధార్ వివరాలతో కార్డులు ముద్రించినంత సులభమా?
- దశలవారీగా మారడమే పరిష్కారం
- నీతిఆయోగ్ ప్రతిపాదనలపై హీరో, బజాజ్, టీవీఎస్

**దిల్లీ:** ఆటోలను 2023కు, బైక్‌లను 2025 కల్లా పూర్తిగా విద్యుత్తుతో నడిచేలా తయారు చేయడం సాధ్యమయ్యే పనికాదని దిగ్గజ వాహన తయారీ కంపెనీలు హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, టీవీఎస్ మోటార్ పేర్కొన్నాయి. కోట్ల మందితో ముడిపడిన, ఆర్థిక వ్యవస్థపై అత్యంత ప్రభావం చూపే ఈ నిర్ణయాన్ని 'ఆధార్ వివరాలతో ప్లాస్టిక్ కార్డు తయారు చేసినంత సులభంగా' చూడొద్దని హితవు పలికాయి. 100 శాతం ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు విద్యుత్తుతో నడిచేలా తయారు చేసేందుకు, గడువును నిర్దేశిస్తూ నీతిఆయోగ్ చేసిన ప్రతిపాదనలను కంపెనీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. నిశిత అధ్యయనం, పరిశీలన లేకుండానే ఇలా చేశారంటూ ఆక్షేపించాయి. విద్యుత్తు వాహనాలకు సత్వరం మారేందుకు ఎలాంటి చర్యలు అవసరమో 2 వారాల్లోగా వాహన తయారీదార్ల సంఘం (సియామ్), కంపెనీలు తెలపాలంటూ నీతిఆయోగ్ గతవారం కోరడంపై ఇలా స్పందించాయి.



**ఆ**ధార్ లేదా సాఫ్ట్‌వేర్‌తో కార్డులు ముద్రించినంత సులభంగా, ప్రస్తుతం తయారు చేస్తున్న వాహనాలను విద్యుత్తులోకి మార్చడం సాధ్యం కాదని గుర్తించాలి. పూర్తిస్థాయి సరఫరా వ్యవస్థలు సిద్ధం కావాలి. ప్రస్తుత వ్యవస్థల నుంచి ఇవి కొత్తగా మారాల్సి ఉంది. తగిన ప్రణాళికలను 4 నెలల్లో రూపొందిస్తామని చెప్పాం. అత్యధిక ద్విచక్ర వాహనాలున్న ఒక నగరంతో ప్రారంభించి, క్రమంగా విస్తరించుకుంటూ వెళ్లాలి. 2 కోట్ల వాహనాలు, 15 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.05 లక్షల కోట్ల) అమ్మకాలు, 10 లక్షల మంది ఉద్యోగులతో ముడిపడిన వాహన వ్యవస్థను ఒక్కసారిగా పూర్తిగా మార్చేయడం ఎంత కష్టం. దీనివల్ల పడే వాస్తవ ప్రభావాలపై ప్రజల నుంచి ఆలోచనలు వస్తాయి.

**- వేణు శ్రీనివాసన్, ఎండీ, టీవీఎస్ మోటార్**

**150** సీసీ లోపు సంప్రదాయ ద్విచక్ర వాహనాలను పూర్తిగా నిషేధించాలనే నీతిఆయోగ ప్రతిపాదన వల్ల అవాంఛనీయ పరిణామాలు సంభవించవచ్చు. 2020 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తున్న ప్రమాణాల వల్ల, ప్రపంచంలోనే అధిక ఇంధన సామర్థ్యంతో పనిచేస్తూ, అతి తక్కువ ఉద్గారాలు మాత్రమే వెదజల్లేలా మన ద్విచక్ర వాహనాలుంటాయి. విద్యుత్తు వాహనాలను బలవంతంగా రుద్దక, రెండు రకాల వాహనాలు ఆరోగ్యకరంగా సాగేలా విధానాలుండాలి. వినియోగదారుల అంగీకారం, మార్కెట్ పరిస్థితులనూ పరిగణనలోకి తీసుకోవాలి. అందుకు భిన్నంగా సంప్రదాయ వాహనాలను నిషేధించడం అంటే, వాహన పరిశ్రకు భారీ నష్టం తప్పదు. కల్పిస్తున్న లక్షల ఉద్యోగాలు, జీడీపీలో వాటాలను గమనిస్తే, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర దుష్ప్రభావం ఏర్పడుతుంది. ఒక్కసారిగా అన్నీ మారాలంటే, తయారీసంస్థలు, విడిభాగాల సంస్థలు, అమ్మకందార్లు, మెకానిక్కులకు వీలు కాదు. ఇందువల్ల కోట్ల మందిపై ప్రభావం పడుతుంది. అందువల్ల దశలవారీగా అమలు చేయడమే పరిష్కారం.

**- హీరో మోటోకార్ప్**



**ద్వి,** త్రిచక్ర వాహనాలన్నీ 100 శాతం విద్యుత్తుతోనే నడిపించాలన్న ప్రతిపాదనే సరికాదు. వాస్తవ కార్యాచరణకు దూరంగా, ప్రస్తుత సమయంలో చేశారు. పరిశ్రమ పరిమాణం, ఇందులో ఎంతమంది భాగస్వాములున్నారనే అంశాన్ని గమనిస్తే, అర్థవంతమైన సూచనే కాదు. ఒకపక్క పెట్రోల్, డీజిల్ వాహనాలను బీఎస్ 6 ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు ఇచ్చిన గడువుకు సమీపంలోనే, మళ్లీ విద్యుత్తుకు మారాలంటే ఎంత వ్యయాలు అవసరం. బొగ్గుతో జరిగే విద్యుదుత్పత్తితో ఛార్జింగ్ అయ్యే బ్యాటరీలను వాహనాల్లో వినియోగించినంత మాత్రాన కాలుష్యం ఏమీ తగ్గదు. మొత్తం కాలుష్యంలో వాహన ఉద్గారాల వాటా 20 శాతం. వాహన ఉద్గారాల్లో ద్విచక్ర వాహనాల వాటా 20 శాతం. అంటే మొత్తం కాలుష్యంలో వీటి వాటా 4 శాతం మాత్రమే. స్థిర విధానాల వల్లే, ద్విచక్ర వాహన రంగంలోకి విదేశీ పెట్టుబడులు వస్తున్నాయన్నది గమనించాలి. అత్యంత పోటీ ఉన్న ఈ రంగంలో, బాగా వృద్ధి చెందుతోంది ఇదే.

**- రాజీవ్ బజాజ్, ఎండీ, బజాజ్ ఆటో**




## వైదొలగుతున్న ఆర్థికవేత్తలు

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య వైదొలగడంతో ఆర్థికవ్యవస్థలో కీలకమైన వ్యక్తుల రాజీనామా జాబితా పెరిగింది.

- మే 2009న రాకేశ్ మోహన్ కూడా డిప్యూటీ గవర్నర్ బాధ్యతలకు పదవీ కాలం కంటే ముందుగానే వైదొలగారు.
- ఆర్‌బీఐ గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ తన మూడేళ్ల పదవీ కాలం పూర్తి కాకముందే డిసెంబరు 10, 2018న రాజీనామా చేశారు.
- అరవింద్ పనగడియా రెండున్నరేళ్ల పాటు నీతి ఆయోగ్ అధిపతిగా పని చేసినా ఆగస్టు 2017న బాధ్యతల నుంచి వైదొలిగారు.
- మే 2019 వరకూ పదవీకాలం ఉన్నా జూన్ 2018నే అరవింద్ సుబ్రమణియన్ ముఖ్య ఆర్థిక సలహాదారు బాధ్యతల నుంచి తప్పుకున్నారు.
- ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి తాత్కాలిక సభ్యుడిగా ఉన్న సుర్జీత్ భల్లా కూడా రాజీనామా చేశారు.

### ఆచార్య: తీరే వేరు

**అ**త్యంత పిన్న వయస్కుడిగా డిప్యూటీ గవర్నర్ బాధ్యతలను చేపట్టిన ఆచార్యకు సమస్యను అర్థం చేసుకోవడం, దానికి పరిష్కారం కనుగొనడంతో పాటు.. దానికి అందరినీ ఒప్పించడం కూడా బాగా తెలుసు. 45 ఏళ్ల ఆచార్యకు సాంకేతిక అంశాలపై గట్టి పట్టు ఉంది. అదే సమయంలో సామాన్యులతోనూ మమేకం కాగలరు. ముఖ్యంగా గణేశ్ ఉత్సవాల్లో ప్రజలతో కలిసి.. నిమజ్జన కార్యక్రమాల్లోనూ పాల్గొనేవారు. ఇక ఆర్‌బీఐపై తనదైన ముద్రవేసి మరీ వెళుతున్నారు. ముఖ్యంగా ఆయన అక్టోబరు 26, 2018న చేసిన ప్రసంగం చరిత్రలో నిలిచిపోతుంది. ఆర్‌బీఐకి చెందిన మొదటిసారిగా అంతర్గత విషయాలను ప్రజలతో పంచుకోవడం.. అది కూడా ప్రభుత్వంపై ధ్వజమెత్తడం అదే తొలిసారి మరి. ఐఐటీ బెంగళూరులో చదువుకున్న ఆచార్య.. న్యూయార్క్‌లో ఆచార్యుడిగా పనిచేశారు. ఆ తర్వాత ఆర్‌బీఐకి వచ్చినా.. తన అత్యాధునిక అధికార నివాసంలో ఉండలేదు. తన కుటుంబ సభ్యులతో విలే పార్లేలో ఉంటూ.. మింట్ రోడ్‌కు రోజూ ట్రాఫిక్‌లో వెళ్లివచ్చేవారు. ముఖ్యంగా రోజూ ఉదయం టెన్నిస్ ఆడడం; సమయం ఉన్నపుడు హిందీ పాటలను వినడం మరచిపోయేవారు కాదు. ఒక్కోసారి స్వరాన్ని కూడా సవరించేవారట.



# విరాల్ నిష్క్రమణ

- కొద్ది వారాల కిందటే రాజీనామా
- జులై 23 తర్వాత పనిచేయలేనని స్పష్టీకరణ
- ఇపుడు వెలుగులోకి ✦ ధ్రువీకరించిన ఆర్‌బీఐ
- పదవీ కాలానికి ఆరు నెలల ముందే బయటకు
- ఆర్‌బీఐ స్వతంత్రతపై గొంతు విప్పింది ఈయనే

**ఆర్‌బీఐ స్వతంత్రతను దెబ్బతీస్తున్నారని ప్రజా వేదికలపైనే బహిరంగంగా ప్రభుత్వంపై విమర్శలు చేసిందా స్వరం. ఆర్‌బీఐపై సెక్షన్ 7 లాంటివి ప్రయోగించినపుడు, అదనపు నిల్వధనాన్ని ఇవ్వాలన్నపుడు తీవ్రంగా మండిపడిందా స్వరం. ముక్కుసూటిగా వ్యవహరిస్తూ అప్పటి ఆర్‌బీఐ గవర్నర్, మితభాషి అయిన ఉర్జిత్‌పటేల్‌కు బాసటగా నిలిచారా వ్యక్తి. గతేడాది డిసెంబరులో ఉర్జిత్ నిష్క్రమించినపుడే ఆయన కూడా బయటకు వెళతారని అందరూ అనుకున్నారు.**

**అదే జరిగింది. అయితే కాస్త ఆలస్యంగా. అవును విరాల్ ఆచార్య తన ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ బాధ్యతలకు రాజీనామా చేశారు. అది కూడా పదవీ కాలం ఇంకా ఆరు నెలలు ఉండగానే.**

**విచిత్రం ఏమిటంటే కొద్ది వారాల కిందటే రాజీనామా చేసినా.. తాజాగా ఆర్‌బీఐ ఆ విషయాన్ని ధ్రువీకరించింది. అది కూడా మీడియా కథనాల నేపథ్యంలో. వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకునే కమిటీలో ఏకైక డిప్యూటీ గవర్నర్ ఈయనే కావడం గమనార్హం.**

దిల్లీ

కిశోర్ కుమార్ పాటలను ఇష్టపడే విరాల్ ఆచార్య స్వరం ఇక ఆర్‌బీఐలో వినిపించకపోవచ్చు. జనవరి 20, 2017న మూడేళ్ల కాలానికి డిప్యూటీ గవర్నర్‌గా పగ్గాలు చేపట్టారాయన. ఆ స్థానాన్ని దక్కించుకున్న అతిపిన్న వయస్కుడాయన. ఆచార్య జులై 23న నిష్క్రమిస్తున్నట్లు ఆర్‌బీఐ కూడా సోమవారం ధ్రువీకరించింది. వచ్చే జనవరి వరకు ఈయన పదవీ కాలం ఉండడం గమనార్హం. ఆరు నెలల ముందే పదవీకాలాన్ని ఈయన ఎందుకు త్యజించినట్లు? ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో ఉంచిన ప్రకారం.. 'అనివార్య వ్యక్తిగత పరిస్థితుల' రీత్యా ముందుగానే ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ బాధ్యతల నుంచి విరాల్ ఆచార్య వైదొలగుతున్నారు. 'జులై 23, 2019 తర్వాత బాధ్యతలను కొనసాగించలేనని..కొద్ది వారాల కిందట డాక్టర్ ఆచార్య ఆర్‌బీఐకి లేఖ రాశారు. అయితే ఆయన నిష్క్రమణపై కంపీటెంట్ అథారిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంద'ని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో పేర్కొంది.

**ఎలా బయటకు వచ్చిందంటే..:** జులై చివరి కంటే ముందే ఆచార్య వైదొలగుతున్నారని ఒక ఆంగ్లపత్రిక తన కథనంలో పేర్కొంది. ముఖ్యంగా ఆచార్యనే ఆ విషయాన్ని చెప్పినట్లు తెలిపింది. ఇక ఆర్‌బీఐ తన వెబ్‌సైట్‌లో ఆ విషయాన్ని ధ్రువీకరించక తప్పలేదు. ఎందుకు నిష్క్రమిస్తున్నారని ఆయన్ని అడగ్గా.. 'ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో చూడండ'న్నారు.

## ఎందుకు బయటకెళుతున్నారు..

**ఉ**ర్జిత్ పటేల్ ఆర్‌బీఐ గవర్నర్ పదవికి ఏడాది ముందుగానే రాజీనామా చేశారు. అప్పట్లో అది పెద్ద కలకలం సృష్టించింది. ఆయనకు ఇష్టమైన ఆచార్య సైతం తన బాధ్యతల నుంచి ఆరు నెలల ముందుగానే వైదొలగుతున్నారు. ఈ రెండింటికి కారణాలు దాదాపు ఒకటే. ఇవి తెలుసుకోవాలంటే కాస్త వెనక్కి వెళ్లాలి.

**సెక్షన్ 7 కలకలం:** గతేడాది అక్టోబరులో విరాల్ ఆచార్య బహిరంగ సమావేశంలో ప్రభుత్వాన్ని విమర్శించారు. అది కూడా ఆర్‌బీఐ స్వతంత్రతను ప్రమాదంలోకి నెడుతున్నారని తీవ్ర స్వరంతోనే హెచ్చరించారు. అందుకు ఉర్జిత్ పటేల్ కూడా మద్దతునిచ్చారు. అది కాస్తా.. ప్రభుత్వం, ఆర్‌బీఐ మధ్య సంఘర్షణకు దారితీసింది. అంతలా విరాల్ తీవ్ర స్వరంతో విరుచుకు పడడానికి కారణం ఆర్‌బీఐపై ప్రభుత్వం ప్రయోగించిన సెక్షన్ 7. ఆర్‌బీఐ చట్టంలోని ఈ సెక్షన్ ప్రకారం.. ప్రభుత్వం ఆర్‌బీఐకి ఆదేశాలు జారీ చేయవచ్చు. అంటే అది ఏం చెబితే అది చెయ్యాల్సిందేనన్నమాట. సరిగ్గా ఇక్కడే విరాల్ ఆచార్య వంటి యువ ఆర్థికవేత్త ప్రతిస్పందించారు.

**దిద్దుబాటు చర్యలూ నచ్చలేదు:** అదీకాక ప్రభుత్వం చేపడుతున్న ఆస్తుల నాణ్యత నిబంధనల కఠినతరం, బ్యాంకులపై దిద్దుబాటు చర్యలు.. తదితరాలపైనా ప్రభుత్వం ప్రతికూల భావనలతో ఉంది.

**అసలు కారణం.. అదనపు నిధులు:** వీటన్నిటినీ పక్కనపెడితే.. ఆర్‌బీఐ వద్ద ఉన్న అదనపు నిధులను ప్రభుత్వానికి తరలించాలన్న సూచన ప్రభుత్వం, ఆర్‌బీఐల మధ్య దూరాన్ని మరింత పెంచింది. అదనపు నిధుల బదిలీకి అప్పటి ఆర్‌బీఐ గవర్నర్, డిప్యూటీ గవర్నర్ ససేమిరా అన్నారు. అదనంగా ఉన్న రూ.3.6 లక్షల కోట్ల మూలధనంలో అధిక భాగాన్ని బదిలీ చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం తన ద్రవ్యలోటును తగ్గించుకోవాలనుకుంది. అయితే తన అక్టోబరు ప్రసంగంలో విరాల్ ఆచార్య వీటన్నిటినీ తప్పుపట్టారు.

**సంఘర్షణ.. ఉర్జిత్ రాజీనామా:** దీంతో ఆర్‌బీఐ బోర్డులో ఉన్న ప్రభుత్వ నామినీలు ఆర్‌బీఐ నిర్ణయాలపై ప్రతికూల స్వరాన్ని వినిపించారు. ఇది కాస్తా బోర్డు సమావేశాలన్నీ రోజంతా కొనసాగినా.. ఏ చర్చా.. ఏ నిర్ణయమూ తుది రూపునకు రాలేకపోయింది. ఆ తర్వాత రెండు నెలల పాటు ఎటువంటి ధిక్కారం ఆర్‌బీఐ నుంచి కనిపించకపోయే సరికి అన్నీ సర్దుకుపోయాయి అనుకున్నారు. అయితే చాపకింద నీరులాగా ఉన్న ఆ సంఘర్షణ ఉర్జిత్ డిసెంబరులో రాజీనామా చేయడానికి కారణమైంది.

**సంఘర్షణ మొత్తం సర్దుబాటు:** ఆ తర్వాత ఆర్‌బీఐ గవర్నర్‌గా శక్తికాంతదాస్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం చేసిన విన్నపాలపై.. ముఖ్యంగా అదనపు నిధుల విషయంలో నిర్ణయం తీసుకోవడం కోసం ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఇక ఆర్‌బీఐ దిద్దుబాటు చర్యల(పీసీఏ) చట్రం నుంచి బ్యాంకులను ప్రభుత్వం బయటపడేసింది. బ్యాంకులకు మూలధనాన్ని చొప్పించడం ద్వారా విజయవంతంగా ఆ పనిచేయగలిగింది. ఇక ఆస్తుల నాణ్యతపై ఆర్‌బీఐ ఇచ్చిన ఫిబ్రవరి 12 సర్క్యులర్ సాంకేతిక కారణాల వల్ల సుప్రీం కోర్టు కొట్టివేసింది. దీంతో బ్యాంకుల నుంచి స్పందనను తీసుకుని.. మరింతగా నిబంధనలను సరళీకరించింది. ముఖ్యంగా ఎగవేత నిబంధనలను సరళీకరించింది.

అయితే వివిధ అంశాలపై కఠిన ధోరణి ఉండక తప్పదని భావించే విరాల్ ఆచార్యకు ఇవన్నీ రుచించలేదు. ఇక పరపతి విధాన కమిటీలోనూ ఆయన రెపో రేటు కోతకు ఓటు వేసినా కూడా తన అభిప్రాయాలను మాత్రం గట్టిగానే చెప్పేవారు. జూన్ 3-6 పరపతి విధాన కమిటీ సమావేశం మినిట్స్ ప్రకారం.. ప్రభుత్వం చేసే అదనపు బడ్జెటరీ వ్యయాలు ద్రవ్య లోటు నిర్వహణపై ప్రభావం చూపుతాయని విరాల్ కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. మొత్తం మీద ఉర్జిత్ వెళ్లిన వెంటనే ఆచార్య కూడా వెళతారన్న అంచనాలు ఆరు నెలలు ఆలస్యంగానైనా నిజమే అయ్యాయి.

### మళ్లీ ఆచార్యుడిగా..

**అంతక్రితం తాను చేపట్టిన అధ్యాపక వృత్తిని ఆచార్య కొనసాగించే అవకాశాలున్నాయి. న్యూయార్క్ స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో సీవీ స్టార్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనమిక్స్‌గా పనిచేశారాయన. ఇపుడు తిరిగి ఆయన అదే స్థానంలోకి వెళ్లిపోవచ్చంటున్నారు.**

## మాపై మరింత పన్ను వేయండి

### అధ్యక్ష అభ్యర్థులకు అమెరికా కుబేరుల లేఖ

**న్యూయార్క్:** సాధారణంగా ఏ దేశంలో అయినా సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఆశించేది పన్ను రాయితీలే.. ఇందుకు భిన్నంగా 'అత్యంత సంపన్నులపై మరింత పన్నులు విధించండి.. వాతావరణ మార్పులపై పోరాటానికి, ఇతర ప్రాధాన్యతలకు ఆ మొత్తాన్ని వెచ్చించండి' అంటూ స్వచ్ఛందంగా అమెరికా అధ్యక్ష అభ్యర్థులను లేఖ రాశారు, అక్కడి కుబేరులు. 'మా సంపదపై నైతికంగా, సరైన విచక్షణతో, తగిన బాధ్యతతో అధిక సుంకాలు విధించండి' అంటూ విజ్ఞప్తి చేశారు. ఈ బృందంలో జార్జ్ సోరస్, ఫేస్‌బుక్ సహ వ్యవస్థాపకులు క్రిస్ హ్యూస్, వాల్ట్ డిస్నీ, హయత్ హోటల్స్ వారసులు ఉన్నారు. 'వాతావరణ మార్పులతో చోటు చేసుకుంటున్న దుష్ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు, ఆర్థిక వ్యవస్థ మెరుగుకు, ఆరోగ్య సంరక్షణ చర్యలు మరిన్ని చేపట్టేందుకు, అవకాశాలు అధికం చేయాలన్నా, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేసేందుకు, సంపద పన్ను విధించండి' అని కోరారు. తన కార్యదర్శి కంటే తక్కువ పన్ను తనకు పడుతోందని అంతర్జాతీయ కుబేరుడు వారెన్ బఫెట్ చెప్పడాన్ని ప్రస్తావించారు. 11 కుటుంబాలకు చెందిన 18 మందితో పాటు వివరాలు వెల్లడి కాని మరో వ్యక్తి కూడా ఈ లేఖపై సంతకాలు చేశారు. ప్రగతిశీల కార్యక్రమాలకు వీరంతా సహకరించేవారు కావడం గమనార్హం. అత్యంత సంపన్నులకు అధిక పన్ను విధించడం వల్ల, సంపద కొందరి వద్దే పోగుబడటం తగ్గుతుందని వివరించారు.

## కేబుల్‌కే రూ.లక్ష కోట్లు కావాలి

- 5జీకి మార్కెట్, ఆపరేటర్లు సిద్ధంగా లేరు
- మౌలికం పంచుకుంటే భేష్ ● క్రిసిల్ నివేదిక

**ముంబయి:** దేశంలో 5జీ సేవల ప్రారంభానికి, భారీఎత్తున ఫైబర్ కేబుల్ వేయాల్సిన అవసరం ఉందని క్రిసిల్ పేర్కొంది. ఇందుకోసం టెలికాం కంపెనీలు రాబోయే మూడేళ్లలో కనీసం రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెట్టాల్సి ఉందని, అసలే రూ.4.3 లక్షల కోట్ల రుణాల్లో ఉన్న పరిశ్రమకు ఇది భారమేనని వివరించింది. ఇదికాక స్పెక్ట్రమ్‌కు మరింత వెచ్చించాల్సి వస్తుందని, ప్రభుత్వమేమో అధిక ధరలు నిర్ణయిస్తోందని తెలిపింది. ప్రస్తుతం 30 శాతం లోపే ఫైబర్ వేయగా, 5జీ సేవలకు 70 శాతమైనా కావాలని వివరించింది. ప్రతి టెలికాం కంపెనీ ప్రమాణాలను అందుకోవాలంటే, అవి రూ.లక్ష కోట్ల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని తెలిపింది. మహా నగరాల్లో భూమికి, అనుమతులకు అధికంగా చెల్లించాల్సి వస్తోందని, కిలోమీటర్‌కు రూ.కోటి వరకు అవ్వొచ్చని అంచనా వేసింది. అయితే డేటా వినియోగం ఎక్కువగా ఉంటుంది కనుక మెట్రో నగరాల్లోనే 5జీ సేవలు అందించేందుకు తొలిదశలో కంపెనీలు పరిమితం అవ్వొచ్చని తెలిపింది. భిన్న రంగాలకు విస్తరించడం, ఆస్తులను మూడో పార్టీతో పంచుకోవడం వంటి వినూత్న విధానాలను టెలికాం కంపెనీలు ఆశ్రయించాల్సి రావచ్చని పేర్కొంది. ఫైబర్, టవర్ ఆస్తులను ప్రత్యేక విభాగాలుగా తీర్చిదిద్దడం వల్ల పెట్టుబడులు తగ్గుతాయని వివరించింది.

# యువతరం లక్ష్యాలే వేరు

- ఆరోగ్యం, ఫిట్‌నెస్, విహారంపై ఆసక్తి
- జీవిత బీమాకు ప్రాధాన్యం
- బజాజ్ అలయంజ్ లైఫ్ సర్వే

**దిల్లీ:** భారత్‌లో యువతరం (మిలీనియల్స్) సంప్రదాయానికి భిన్నంగా కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుంటున్నారు. ఆరోగ్యం, ఫిట్‌నెస్, విహారం, జీవితంలో వృద్ధి వంటి లక్ష్యాలకు మొగ్గు చూపుతున్నారు. ఇక ఎక్కువ మంది జీవిత బీమాను పెట్టుబడి సాధనంగా పరిగణిస్తున్నారని బజాజ్ అలయంజ్ లైఫ్ సర్వే స్పష్టం చేసింది. 'లైఫ్ గోల్స్ ప్రిపేర్డ్‌నెస్ సర్వే 2019' పేరిట సంస్థ సర్వే చేసింది. వ్యాపారవేత్త కావడం, ఇతరులతో పోలిస్తే భిన్నంగా రాణించడానికి సైతం ఇష్టపడుతున్నారని తెలిపింది. 60 శాతం జీవిత లక్ష్యాలను సాధించడానికి జీవిత బీమా సరైనదిగా పరిగణిస్తున్నట్లు సర్వే వెల్లడించింది. 13 మెట్రో నగరాలు, ప్రథమ శ్రేణి, వర్ధమాన నగరాల్లో జరి



పిన ఈ సర్వేలోని మరిన్ని అంశాలు ఇలా..

✦ పదవీ విరమణకు సంబంధించిన లక్ష్యాలకు యువతరం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రతి అయిదుగురులో ఇద్దరికి ఇటువంటి లక్ష్యాలకు ఉన్నాయి. ఇక ప్రధాన నగరాల్లోని వారికి ప్రతి ఇద్దరిలో ఒకరికి పదవీ విరమణ లక్ష్యాలు ఉన్నాయి.

✦ వ్యాపారవేత్త కావడాన్ని సమాంతర వృత్తిగా ఎంచుకుంటున్నారు. విదేశాల్లోని కొత్త ప్రదేశాలు వెళ్లడం, దాతృత్వం వంటి యువతరం లక్ష్యాల్లో ఉండటం గమనార్హం.

✦ ఇక పిల్లల చదువు, సొంత ఇల్లు కొనుగోలు, ఖరీదైన కారు వంటి సంప్రదాయ లక్ష్యాలు సైతం యథావిధిగానే ఉన్నాయి. కుటుంబం, స్నేహితులు ఈ లక్ష్యాలపై ప్రభావం చూపుతున్నారు.

✦ కొత్త తరం లక్ష్యాలు ఏ విధంగా మారుతున్నాయో ఈ సర్వే స్పష్టం చేసిందని, సంప్రదాయేతర లక్ష్యాలకు యువత మొగ్గు చూపుతున్నారని బజాజ్ అలయంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ తరుణ చుంగ్ అన్నారు. మహిళలు సైతం ఏ మాత్రం వెనకంజ వేయడం లేదని తెలిపారు.

✦ దేశవ్యాప్తంగా దిల్లీ, లూధియానా, బరేలీ, కోల్‌కతా, పట్నా, భువనేశ్వర్, ముంబయి, సూరత్, అమరావతి, చెన్నై, బెంగళూరు, మదురై, గుంటూరుల్లో సర్వే చేశారు.

Eenadu epaper




## ప్రపంచకప్‌లో ఈనాడు

# ఇంగ్లాండ్ × ఆస్ట్రేలియా

మ.3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

**లండన్:** ప్రపంచకప్‌లో రసవత్తర పోరు. మంగళవారం ఆతిథ్య ఇంగ్లాండ్.. ఆస్ట్రేలియాను ఢీకొననుంది. ఆరు మ్యాచ్‌ల్లో నాలుగింట్లో గెలిచిన ఆతిథ్య ఇంగ్లాండ్‌కు ఆడబోయే మూడు మ్యాచ్‌లూ క్లిష్టమైనవే. టోర్నీలో ఆ జట్టుకు ఆస్ట్రేలియా రూపంలో తొలిసారి ఒక బలమైన జట్టు ఎదురుకాబోతోంది. మరోవైపు ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఐదు నెగ్గిన కంగారూ జట్టు జోరు మీదుంది. మ్యాచ్‌లో గెలిస్తే ఆ జట్టు సెమీస్ చేరినట్లే.

**144** ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ ఆడిన వన్డేలు. ఆసీస్ 81 గెలవగా, ఇంగ్లాండ్ 61 నెగ్గింది. రెండు మ్యాచ్‌లు రద్దయ్యాయి.

**7** ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా తలపడిన మ్యాచ్‌లు. ఆసీస్ ఐదు గెలవగా, ఇంగ్లాండ్ రెండే నెగ్గింది.

## ఛాంపియన్స్



# హై.. హై.. షకిబ్

**అదే అఫ్గానిస్థాన్.. అదే సౌథాంప్టన్.. భారత్ స్థానంలోకి బంగ్లాదేశ్ వచ్చింది. ఈసారి కూడా పిచ్ నెమ్మదే. అఫ్గాన్ స్పిన్నర్లు మరోసారి సత్తా చాటారు. కానీ బెదురులేని ఆటతో పెద్ద జట్లను బెంబేలెత్తిస్తున్న బంగ్లాదేశ్.. సవాల్‌ను గట్టిగానే కాచుకుంది. బ్యాట్స్‌మెన్ పట్టుదలతో ఆడి జట్టుకు మెరుగైన స్కోరు అందిస్తే.. ఆ తర్వాత బౌలర్లు అఫ్గాన్‌ను చుట్టేశారు. ముష్ఫికర్ రహీమ్ (83; 87 బంతుల్లో 4×4, 1×6) ప్రతికూల పరిస్థితుల్లో గొప్ప ఇన్నింగ్స్ ఆడాడు. అర్ధశతకంతో అతడికి సహకరించిన షకిబ్.. బౌలింగ్‌లో విజృంభించి అయిదు వికెట్లు పడగొట్టడం విశేషం. దీంతో అఫ్గాన్‌కు ఈ ప్రపంచకప్‌లో వరుసగా ఏడో పరాజయం తప్పలేదు. ఈ గెలుపుతో సెమీస్‌పై ఆశలు పెంచుకున్న బంగ్లా.. రేసును మరింత ఆసక్తికరంగా మార్చింది.**

### యువీ తర్వాత అతనే..

ప్రపంచకప్ మ్యాచ్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన తొలి బంగ్లాదేశ్ బౌలర్ షకిబ్. ఒక ప్రపంచకప్‌లో సెంచరీ, ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన మూడో ఆటగాడు అతడే. కపిల్, యువరాజ్ ముందున్నారు. ఓ ప్రపంచకప్ మ్యాచ్‌లో 5 వికెట్లు పడగొట్టడంతో పాటు అర్ధసెంచరీ చేసిన ఆటగాళ్లు యువరాజ్ (2015), షకిబ్ (2019) మాత్రమే.

**3** ఈ ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ సాధించిన మూడు విజయాల్లోనూ షకిబే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'.

## ● అఫ్గాన్‌పై బంగ్లా ఘనవిజయం
## ● సెమీస్‌పై పులుల కన్ను

**2** ప్రపంచకప్‌లో వెయ్యికి పైగా పరుగులు, 25కు పైగా వికెట్లు సాధించిన రెండో ఆల్‌రౌండర్‌గా షకిబ్ రికార్డులకెక్కాడు. ఇంతకుముందు సనత్ జయసూర్య (1165 పరుగులు, 27 వికెట్లు) మాత్రమే ఈ ఘనత సాధించాడు. షకిబ్ ప్రస్తుతం 1016 పరుగులు, 33 వికెట్లతో కొనసాగుతున్నాడు.

సౌథాంప్టన్

ఈ ప్రపంచకప్‌లో గెలిచినా.. ఓడినా.. చక్కటి ప్రదర్శనతో ప్రశంసలందుకుంటున్న బంగ్లాదేశ్.. గత మ్యాచ్‌లో భారత్‌ను తీవ్ర ఒత్తిడికి గురి చేసిన అఫ్గానిస్థాన్‌పై అలవోకగా విజయం సాధించింది. సోమవారం ఆ జట్టు 62 పరుగుల తేడాతో నెగ్గింది. మొదట ముష్ఫికర్ రహీమ్, షకిబ్ అల్‌హసన్ (51 69 బంతుల్లో 1×4) రాణించడంతో బంగ్లా 50 ఓవర్లలో 7 వికెట్లకు 262 పరుగులు చేసింది. ముజీబ్ రెహ్మాన్ (3/39) గట్టి దెబ్బ తీసినా.. వీళ్లిద్దరి రాణింపుతో బంగ్లా మెరుగైన స్కోరు సాధించింది. అనంతరం షకిబ్ (5/29), ముస్తాఫిజుర్ (2/32)ల ధాటికి అఫ్గాన్ 47 ఓవర్లలో 200 పరుగులకే ఆలౌటైంది. ఆ జట్టులో గుల్బాదిన్ నైబ్ (47), షెన్వారి (49) మాత్రమే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడారు. ఓపెనర్లు నైబ్, రహ్మత్ షా (24)లతో పాటు అస్గర్ (20), నబి (0), నజీబుల్లా (23)ల వికెట్లను పడగొట్టి అఫ్గాన్‌కు విజయావకాశాలే లేకుండా చేసింది షకిబే. 49 పరుగుల వద్ద తొలి వికెట్ పడేవరకే అఫ్గాన్ పోటీలో ఉంది. షకిబ్‌కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. టోర్నీలో ఏడు మ్యాచ్‌లాడిన బంగ్లాకిది మూడో విజయం. 7 పాయింట్లతో ఆ జట్టు పట్టికలో ఐదో స్థానానికి చేరుకుంది.

**ఇటు ముజీబ్.. అటు ముష్ఫికర్!:** శనివారం భారత్‌తో అఫ్గానిస్థాన్ తలపడ్డ పిచ్ మీదే ఈ మ్యాచ్ కూడా జరిగింది. నెమ్మదిగా ఉండి స్పిన్నర్లకు అనుకూలించిన పిచ్‌ను ముజీబ్ రెహ్మాన్ పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. మూడు కీలక


ముష్ఫికర్ (83)

వికెట్లతో బంగ్లాను గట్టి దెబ్బే కొట్టాడతను. అయితే ముజీబ్‌తో పాటు నబి (1/44) కూడా ఇబ్బంది పెట్టినా.. పిచ్ సవాలు విసిరినా.. ముష్ఫికర్ రహీమ్ గొప్ప బ్యాటింగ్‌తో జట్టుకు మంచి స్కోరునందించాడు. ముజీబ్ ఆరంభంలోనే లిటన్ దాస్ (16)ను ఔట్ చేసి అఫ్గాన్‌కు శుభారంభాన్నందించాడు. అయితే తమీమ్ (36), షకిబ్ రెండో వికెట్‌కు 59 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. తమీమ్ ఔటయ్యాక షకిబ్‌కు రహీమ్ తోడయ్యాడు. పరుగులు అంత సులువుగా రాకపోయినా.. ఈ జోడీ నిలకడగా ఆడింది. అయితే ముజీబ్ మరోసారి తన పంజా విసిరాడు. చక్కటి బంతులతో షకిబ్, సౌమ్య సర్కార్ (3)లను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని బంగ్లాను గట్టి దెబ్బ తీశాడు. దీంతో 143/2 నుంచి బంగ్లా 151/4కు చేరుకుంది. అయితే ముష్ఫికర్.. మహ్మదుల్లా (27), మొసాదెక్ (35)లతో భాగస్వామ్యాలు నెలకొల్పి స్కోరును 250 దాటించాడు. ఇదే వేదికలో అఫ్గాన్‌తో మ్యాచ్‌లో భారత్ 224 పరుగులే చేసింది.

**బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** లిటన్ దాస్ (సి) హస్మతుల్లా (బి) ముజీబ్ 16; తమీమ్ (బి) నబి 36; షకిబ్ ఎల్బీ (బి) ముజీబ్ 51; ముష్ఫికర్ (సి) నబి (బి) దవ్లత్ 83; సౌమ్య సర్కార్ ఎల్బీ (బి) ముజీబ్ 3; మహ్మదుల్లా (సి) నబి (బి) నైబ్ 27; మొసాదెక్ (బి) నైబ్ 35; సైపుద్దీన్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (50 ఓవర్లలో 7 వికెట్లకు) **262; వికెట్ల పతనం:** 1-23, 2-82, 3-143, 4-151, 5-207, 6-251, 7-262; **బౌలింగ్:** ముజీబ్ రెహ్మాన్ 10-0-39-3; దవ్లత్ జద్రాన్ 9-0-64-1; మహ్మద్ నబి 10-0-44-1; గుల్బాదిన్ నైబ్ 10-1-56-2; రషీద్ ఖాన్ 10-0-52-0; రెహ్మత్ షా 1-0-7-0

**అఫ్గానిస్థాన్ ఇన్నింగ్స్:** నైబ్ (సి) లిటన్ (బి) షకిబ్ 47; రెహ్మత్ షా (సి) తమీమ్ (బి) షకిబ్ 24; హస్మతుల్లా (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మొసాదెక్ 11; అస్గర్ (సి) షబ్బీర్ (బి) షకిబ్ 20; నబి (బి) షకిబ్ 0; షిన్వారి నాటౌట్ 49; ఇక్రమ్ రనౌట్ 11; నజీబుల్లా (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) షకిబ్ 23; రషీద్ ఖాన్ (సి) మొర్తజా (బి) ముస్తాఫిజుర్ 2; దవ్లత్ (సి) ముష్ఫికర్ (బి) ముస్తాఫిజుర్ 0; ముజీబ్ (బి) సైపుద్దీన్ 0; ఎక్స్‌ట్రాలు 13 **మొత్తం:** (47 ఓవర్లలో ఆలౌట్) **200; వికెట్ల పతనం:** 1-49, 2-79, 3-104, 4-104, 5-117, 6-132, 7-188, 8-191, 9-195; **బౌలింగ్:** మొర్తజా 7-0-37-0; ముస్తాఫిజుర్ 8-1-32-2; సైపుద్దీన్ 8-0-33-1; షకిబ్ 10-1-29-5; మెహదీ 8-0-37-0; మొసాదెక్ 6-0-25-1

షకిబ్ 51; 5/29

### ఆగని షకిబ్ ఎక్స్‌ప్రెస్

2019 ప్రపంచకప్‌పై బలమైన ముద్ర వేస్తున్నాడు బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్‌హసన్. బ్యాటుతో, బంతితో అతడి అద్భుత ప్రదర్శన కొనసాగుతూనే ఉంది. అలుపెరగకుండా.. ప్రతి మ్యాచ్‌లోనూ రాణిస్తూ అతను ఆశ్చర్యపరుస్తున్నాడు. ప్రపంచకప్ చరిత్రలోనే మరే ఆల్‌రౌండర్‌కూ సాధ్యం కాని ప్రదర్శన అతను చేస్తున్నాడు. 7 మ్యాచ్‌ల్లోనే అతను 476 పరుగులు చేయడం విశేషం. అఫ్గాన్‌తో మ్యాచ్‌లో అర్ధశతకం సాధించిన అతను వార్నర్ (447)ను అధిగమించి టోర్నీ టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. ప్రపంచకప్‌లో మహా మహా బ్యాట్స్‌మెన్ ఉండగా.. బంగ్లాదేశ్‌కు చెందిన ఆల్‌రౌండర్ ఇలా అగ్రస్థానంలో నిలవడం ఆశ్చర్యకరమే. టోర్నీలో అతడి అత్యల్ప స్కోరు 41. మిగతా ఆరు మ్యాచ్‌ల్లో కనీసం అర్ధశతకం సాధించాడు. మొత్తం షకిబ్ రెండు శతకాలు, మూడు అర్ధసెంచరీలు కొట్టడం విశేషం. బౌలింగ్‌లోనూ సత్తా చాటిన అతను 10 వికెట్లు తీసి టాప్-10 జాబితాలో ఉన్నాడు.

### పాయింట్ల పట్టిక

| జట్టు | మ్యా | గె | ఓ | టై/ర | పా | నె.రేట్ |
|---|---|---|---|---|---|---|
| న్యూజిలాండ్ | 6 | 5 | 0 | 1 | 11 | +1.306 |
| ఆస్ట్రేలియా | 6 | 5 | 1 | 0 | 10 | +0.849 |
| భారత్ | 5 | 4 | 0 | 1 | 9 | +0.809 |
| ఇంగ్లాండ్ | 6 | 4 | 2 | 0 | 8 | +1.457 |
| బంగ్లాదేశ్ | 7 | 3 | 3 | 1 | 7 | −0.133 |
| శ్రీలంక | 6 | 2 | 2 | 2 | 6 | −1.119 |
| పాకిస్థాన్ | 6 | 2 | 3 | 1 | 5 | −1.265 |
| వెస్టిండీస్ | 6 | 1 | 4 | 1 | 3 | +0.190 |
| దక్షిణాఫ్రికా | 7 | 1 | 5 | 1 | 3 | −0.324 |
| అఫ్గానిస్థాన్ | 7 | 0 | 7 | 0 | 0 | −1.634 |

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, నె: నెట్ రన్‌రేట్



### ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా

భారత్ చేతిలో ఓటమిపై పాక్ కోచ్ ఆర్థర్

**లండన్:** ప్రపంచకప్‌లో భారత్ చేతిలో తమ జట్టు ఓటమి తనను తీవ్రంగా బాధించిందని, ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన కూడా కలిగిందని పాకిస్థాన్ కోచ్ మికీ ఆర్థర్ అన్నాడు. "భారత్ చేతిలో ఓటమితో గత ఆదివారం ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా. కానీ అది ఒక పేలవ ప్రదర్శన మాత్రమే" అని చెప్పాడు. "ప్రపంచకప్ అంటే మీడియా నిశిత దృష్టి, జనం అంచనాలు ఎక్కువగా ఉంటాయి. ఓటములు చవిచూస్తే ఒత్తిడి బాగా పెరిగిపోతుంది. అందరూ అలాంటి స్థితిని ఎదుర్కొంటారు" అని ఆర్థర్ అన్నాడు. విధుల పట్ల తాను ఎంత వ్యామోహంతో ఉంటాడో చెప్పడం కోసం ఆర్థర్ తీవ్రంగా స్పందించి ఉంటాడు. కానీ 2007 ప్రపంచకప్ సందర్భంగా అప్పటి పాక్ కోచ్ వూమర్ మరణించిన నేపథ్యంలో అతడు జాగ్రత్తగా మాట్లాడాల్సివుందని కొందరు అభిమానులు అంటున్నారు. ఆదివారం భారత జట్టు 89 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన సంగతి తెలిసిందే.

### ప్రపంచకప్ నుంచి రసెల్ ఔట్



**మాంచెస్టర్:** వెస్టిండీస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ఆల్‌రౌండర్ ఆండ్రీ రసెల్ మోకాలి గాయం కారణంగా ప్రపంచకప్‌కు దూరమయ్యాడు. అతడి స్థానంలో సునీల్ ఆంబ్రిస్ జట్టుకు ఎంపికయ్యాడు. "ప్రపంచకప్‌లో మిగిలిన మ్యాచ్‌లకు రసెల్ స్థానంలో ఆంబ్రిస్‌ను తీసుకోవడానికి ఐసీసీ ఆమోదం తెలిపింది. మోకాలి గాయం వల్ల రసెల్ టోర్నీకి దూరమయ్యాడు" అని ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది.

### వేలానికి బెకర్ ట్రోఫీలు!



**లండన్:** జర్మనీ టెన్నిస్ స్టార్ బోరిస్ బెకర్‌కు పెద్ద కష్టమొచ్చింది. అప్పుల్లో కూరుకుపోయిన ఈ దిగ్గజ ఆటగాడు చివరికి తాను ఎంతో కష్టపడి సంపాదించిన ట్రోఫీలను అమ్ముకోవాల్సిన పరిస్థితికి వచ్చాడు. బెకర్‌కు సంబంధించిన అరుదైన వస్తువులను, జ్ఞాపికలను బ్రిటిష్ సంస్థ వేల్స్ హార్డీ ఆన్‌లైన్‌లో వేలానికి పెట్టింది. 17 ఏళ్ల వయసులో వింబుల్డన్ టైటిల్ గెలిచిన బెకర్.. ఇవాన్ లెండిల్‌తో ఎన్నో గొప్ప పోరాటాలు చేశాడు. ఆ తర్వాత వ్యక్తిగతంగా పతనమై 2017లో దివాలా తీసిన బెకర్.. గతేడాదే తన ట్రోఫీలు అమ్మాలని అనుకున్నా చివరి నిమిషంలో విరమించుకున్నాడు. కానీ తన ఇంటిపై ఉన్న అప్పులను తీర్చేందుకు తప్పనిసరై మళ్లీ తన ట్రోఫీలను అమ్ముతున్నాడు.

"ఐపీఎల్‌లో ఆడొద్దని చెప్పినా రబాడ వినలేదు. ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఐపీఎల్ సగం ముగిసిన తర్వాతైనా వెనుదిరగాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రబాడతో పాటు మరికొందరికి ఇలాగే చెప్పాం"

ప్రపంచకప్‌లో రబాడ వైఫల్యంపై అడిగిన ప్రశ్నకు దక్షిణాఫ్రికా సారథి డుప్లెసిస్ సమాధానమిది! ఇంతకుముందు స్టెయిన్ గాయానికి కూడా ఐపీఎలే కారణమన్నది అతడి వాదన. ప్రతిష్టాత్మక టోర్నీలో దక్షిణాఫ్రికా వైఫల్యానికి పరోక్షంగా ఐపీఎల్ కారణమంటూ డుప్లెసిస్ చెప్పకనే చెప్పేశాడు! డుప్లెసిస్ వాదన సరైందేనా? దక్షిణాఫ్రికా వైఫల్యానికి ఐపీఎల్ కారణమని అనుకోవచ్చా?

# ఆడలేక.. ఐపీఎల్!

ఈనాడు క్రీడావిభాగం



ఐపీఎల్‌లో ఆడిన వాళ్లలో భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, అఫ్గానిస్థాన్ ఆటగాళ్లే ఎక్కువ. డుప్లెసిస్ విశ్లేషణ ప్రకారం ఐపీఎల్‌లో ఆడిన దేశాలన్నీ ప్రపంచకప్‌లో వెనుకంజలో ఉండాలి! అందులో టీమ్ఇండియా ముందువరుసలో ఉండాలి. ప్రస్తుత జట్టులోని ప్రతి ఆటగాడు ఐపీఎల్‌లో ఆడటమే ఇందుకు కారణం. ప్రపంచకప్‌లో బరిలో ఉన్న అన్ని జట్లతో పోల్చుకుంటే ఐపీఎల్‌లో మొదటి మ్యాచ్ నుంచి చివరి పోరు వరకు ఆడిన ఆటగాళ్లలో అత్యధికులు టీమ్ఇండియా క్రికెటర్లే. దాదాపు రెండు నెలలు ఐపీఎల్‌లో ఆడి నేరుగా ఇంగ్లాండ్ విమానమెక్కారు. మధ్యలో ఎలాంటి టోర్నీలు ఆడలేదు. వన్డే మ్యాచ్ ప్రాక్టీస్ లేనేలేదు. దాదాపు మూడు నెలల విరామం తర్వాత భారత ఆటగాళ్లు నేరుగా ప్రపంచకప్‌లో వన్డే మ్యాచ్ ఆడారు! అయినా టీమ్ఇండియా సత్తాచాటుతోంది. వరుసగా 4 విజయాలతో అజేయ జట్టుగా కొనసాగుతుంది. అన్ని రంగాల్లోనూ ఆధిపత్యం కనబరుస్తూ ఫేవరెట్‌గా మారింది. ఇంగ్లాండ్ (స్టోక్స్, బెయిర్‌స్టో, ఆర్చర్, బట్లర్, మొయిన్ అలీ).. కివీస్ (విలియమ్సన్, గప్టిల్, మన్రో, సౌథి, బౌల్ట్, గ్రాండ్‌హోమ్, ఫెర్గూసన్, శాంట్నర్).. ఆసీస్ (స్మిత్, వార్నర్, స్టాయినిస్, బెరెండార్ఫ్)లు సైతం సత్తాచాటుతున్నాయి. భారత్ తర్వాత ఐపీఎల్‌లో అత్యధికంగా కివీస్ ఆటగాళ్లే ఆడారు. కెప్టెన్, ప్రధాన బ్యాట్స్‌మెన్, బౌలర్లతో సహా 8 మంది ఐపీఎల్ ముగిసే వరకు అందుబాటులో ఉన్నారు. అయినా ప్రపంచకప్‌లో కివీస్ అన్ని మ్యాచ్‌ల్లో గెలిచి అగ్రస్థానంలో ఉంది. ఇక బాల్ ట్యాంపరింగ్ వివాదంలో ఏడాది పాటు నిషేధానికి గురైన స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్‌లు క్రికెట్లో పునరాగమనం చేసింది ఐపీఎల్‌తోనే. అక్కడ మ్యాచ్ ప్రాక్టీస్ లభిస్తుందని క్రికెట్ ఆస్ట్రేలియా సైతం వార్నర్, స్మిత్‌లను ప్రోత్సహించింది. అందుకు తగ్గట్లే వార్నర్, స్మిత్‌లు రాణించి ప్రపంచకప్‌కు ముందు ఫామ్ దొరకబుచ్చుకున్నారు. ఇప్పుడు ప్రపంచకప్‌లో ఆసీస్‌కు వార్నర్, స్మిత్‌లే కీలకమయ్యారు. మెగా టోర్నీకి ముందు ఫామ్‌ను అందుకోవడానికి మ్యాచ్ ప్రాక్టీస్ కోసం ఐపీఎల్‌ను ఇంగ్లాండ్, కివీస్, ఆసీస్‌లు వేదికగా ఎంచుకోగా.. ఆ టోర్నీ దక్షిణాఫ్రికాకు నష్టం చేసిందని తేల్చడం డుప్లెసిస్‌కే చెల్లు! అదీ చెన్నై తరఫున ఫైనల్ వరకు ఆడిన ఆటగాడు అనడం మరీ విడ్డూరం!

**ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా**

| | |
|---|---|
| 1992 | సెమీస్ |
| 1996 | క్వార్టర్స్ |
| 1999 | సెమీస్ |
| 2003 | గ్రూపు దశ |
| 2007 | సెమీస్ |
| 2011 | క్వార్టర్స్ |
| 2015 | సెమీస్ |
| 2019 | గ్రూపు దశ |

**"2015 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ నిరాశాజనక ప్రదర్శన చేసింది. కానీ ఆ నిరాశను జట్టును పునర్నిర్మాణానికి ఉపయోగించుకుంది. ఇంగ్లాండ్ ఇప్పుడు నిర్భయంగా ఆడుతోంది. ఇంగ్లాండ్‌ను ఆదర్శంగా తీసుకుని దక్షిణాఫ్రికా మెరుగైన జట్టును నిర్మించుకోవాలి"**
**– జాక్ కలిస్, దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు**

ప్రపంచ క్రికెట్లో ఎంతో గౌరవం, అభిమానం కలిగిన దక్షిణాఫ్రికా.. ప్రపంచకప్‌లో వైఫల్యానికి సాకులు వెతుక్కోవడం సఫారీ అభిమానులకే రుచించకపోవచ్చు! అసలు దక్షిణాఫ్రికా ప్రపంచకప్ ప్రణాళికే సరిగ్గా లేదన్న విమర్శలు లేకపోలేదు. ఆటగాళ్లతో క్రికెట్ బోర్డు వ్యవహారాలు సరిగా లేవు. ప్రపంచకప్‌కు ముందు స్టార్ బ్యాట్స్‌మన్ డివిలియర్స్‌తో ఆ దేశ బోర్డుకు పొసగలేదు. ఇప్పటికీ ఏ జట్టైనా కళ్లకద్దుకుని తీసుకునే డివిలియర్స్.. బోర్డుతో మనస్పర్థలతో నిరుడు మే నెలలో రిటైర్మెంట్ ప్రకటించాడు. డివిలియర్స్ లాంటి ఆటగాడిని ప్రపంచకప్‌కు ఏడాది ముందు ఏ జట్టు వదులుకోదు. కానీ దక్షిణాఫ్రికా బోర్డు మాత్రం అతడిని ఆపే ప్రయత్నం చేయలేదు. ఆఖర్లో మనసు మార్చుకుని డివిలియర్స్ తిరిగొస్తానన్నప్పుడు బెట్టు వీడి.. అతడిని తీసుకునివుంటే దక్షిణాఫ్రికాకు మేలు జరిగేదేమో..! అతడికి మ్యాచ్ ప్రాక్టీస్ లేదనే పరిస్థితీ లేదు. ఐపీఎల్‌లో అతడు సత్తా చాటాడు. ఒక కీలక ఆటగాడు దూరమైతే జట్టు పరిస్థితి ఏమవుతుందనడానికి దక్షిణాఫ్రికానే నిదర్శనం. ఆ జట్టు బ్యాటింగ్‌లో సమతూకం దెబ్బతింది. కష్టకాలంలో ఆదుకునే ఆపద్బాంధవుడు లేడు. జట్టులో స్ఫూర్తి నింపాల్సిన నాయకుడు డుప్లెసిస్ మూడు మ్యాచ్‌లకే కాడి ఎత్తేశాడు. వర్షార్పణమైన వెస్టిండీస్‌తో మ్యాచ్‌ను కుదించి కొనసాగించడం కంటే.. రద్దుచేసి చెరో పాయింటు ఇవ్వడమే మంచిదనడం డుప్లెసిస్ అసమర్థతకు నిదర్శనం. ఇప్పుడు ఐపీఎల్‌పైనా నిందలు వేస్తుండటం అతడిలో నిజాయితీ లేమిని సూచిస్తోంది.

ఇక జట్టు వైఫల్యానికి బౌలర్లే బాధ్యులంటున్న డుప్లెసిస్.. బ్యాట్స్‌మెన్ ప్రదర్శనపైనా దృష్టిసారిస్తే మంచిదేమో. ఇప్పటిదాకా దక్షిణాఫ్రికా ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో ఒక్క సెంచరీ కూడా నమోదవలేదు. డికాక్ (238), డుసెన్ (216), డుప్లెసిస్ (191), మిల్లర్ (136), ఆమ్లా (123), మర్క్‌రామ్ (106) ఘోరంగా విఫలమయ్యారు. ఓపెనర్ నుంచి మిడిల్డార్ వరకు జట్టు బాధ్యతను భుజాన వేసుకునే ఆటగాడు ఒక్కడు లేడు. 7 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా 300 పైచిలుకు స్కోరు చేసింది ఒక్కసారే. ఆ మ్యాచ్‌లోనూ బంగ్లాదేశ్ (330/6) చేతిలో దక్షిణాఫ్రికా (309/8)ది ఓటమే. ఇంగ్లాండ్, న్యూజిలాండ్, పాకిస్థాన్‌లపై దక్షిణాఫ్రికా వరుసగా 207, 241, 259 పరుగులే చేయగలిగింది. ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీలో ఇంత తక్కువ స్కోర్లతో విజయాలు సాధిస్తామని.. బౌలర్లు కాపాడతారని అనుకోవడం డుప్లెసిస్ తెలివితక్కువ తనమే! కెరీర్ చరమాంకంలో ఉన్న డుప్లెసిస్ (34 ఏళ్లు), ఆమ్లా (36), డుమిని (35)లపై బ్యాటింగ్ భారాన్ని మోపిన దక్షిణాఫ్రికా బోర్డుది సరిదిద్దుకోలేని పొరపాటే!

# ఈ స్థితిని ఇంగ్లాండ్ ఊహించి ఉండదు

హర్ష భోగ్లే

నిరుడు దాదాపు ఈ సమయంలోనే ఆస్ట్రేలియా జట్టు ఐదు వన్డేల కోసం ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లింది. రెండు జట్ల మధ్య ఏమాత్రం పొంతన లేదు. ఇంగ్లాండ్ పునరుత్థానంలో ఉచ్ఛ స్థితిలో ఉంటే.. ఆస్ట్రేలియా అనిశ్చితిలో ఉంది. బలహీనంగా కనిపించింది. కానీ ఆటల్లో 12 నెలలు చాలా సుదీర్ఘ సమయం. ఆసీస్ ఇప్పుడు ప్రపంచకప్ సెమీఫైనల్‌కు ఒక విజయం దూరంలో ఉంది. మంగళవారం ఇంగ్లాండ్‌తో తలపడుతుంది. ఇంగ్లాండ్ ఓడితే ఇబ్బందుల్లో పడుతుంది. ఇంగ్లాండ్ ఇలాంటి స్థితిలో ఉంటుందని ఎవరూ ఊహించలేదు. ప్రత్యర్థిని హడలెత్తిస్తుందని, అలవోకగా 350 దాటుతుందని, 400 కూడా చేయగలదనే అంచనాలున్న జట్టు అది. గత ప్రపంచకప్‌లలో ఆస్ట్రేలియాలా ఈసారి ఇంగ్లాండ్ ఫేవరెట్‌గా టోర్నీలో అడుగుపెట్టింది. కానీ ఈ ప్రపంచకప్ చాలా చిత్రమైంది. ఇది ఓ జట్టు బెంచ్‌ను పరీక్షిస్తుంది. సహనశక్తినీ, అన్వయ సామర్థ్యాన్నీ పరీక్షిస్తుంది. సవాళ్లు విసురుతుంది. నైపుణ్యంతో పాటు ఒత్తిడిని తట్టుకునే శక్తి కూడా ఇక్కడ ముఖ్యమే.




Eenadu epaper

# ఉస్మానియా హంగులు



## ఆసుపత్రి పురాతన భవనం ఆధునికీకరణకు రంగం సిద్ధం

- రూ.25 కోట్లతో హెరిటేజ్ శాఖ ఆధ్వర్యంలోనే మరమ్మతులు
- పురాతన భవనంలోని 400 పడకల సర్దుబాటుకు కసరత్తు

ఈనాడు - హైదరాబాద్

చారిత్రక వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన పురాతన ఉస్మానియా ఆసుపత్రి భవనానికి కొత్త సొబగులు అద్దనున్నారు. దాదాపు రూ.25 కోట్లతో హెరిటేజ్ శాఖ ఆధ్వర్యంలోనే మరమ్మతులు చేపట్టనున్నారు. అప్పటివరకు పురాతన భవనంలో ప్రస్తుతమున్న 400 పడకలను అదే ప్రాంగణంలోని ఇతర భవనాల్లో సర్దుబాటు చేయనున్నారు. పడకల సర్దుబాటుపై వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు.

### యథాతథంగా పురాతన భవనం

పురాతన ఉస్మానియా ఆసుపత్రి భవనం క్రమేణా పగుళ్ల బారి పెచ్చులూడుతోంది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంగణంలోనే నూతనంగా బహుళ అంతస్తుల భవనం నిర్మించాలని నాలుగేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినా..ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. ఏటా వర్షా కాలంలో స్లాబు నుంచి నీళ్లు కారడం, పెచ్చులూడడం వంటి ఘటనలు సర్వసాధారణమయ్యాయి. చివరికి శస్త్ర చికిత్స గదుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో వైద్యులు, రోగులు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సత్వరమే ఉస్మానియా వారసత్వ భవనానికి మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. భవన రూపురేఖలు ఏమాత్రం మార్చకుండా యథాతథంగా ఆధునికీకరించనుంది. తొలుత మరమ్మతుల బాధ్యతలను తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్ఎంఎస్ఐడీసీ)కి అప్పగించాలని భావించినా తాజాగా ఆ ఆలోచనను ప్రభుత్వం విరమించుకుంది. ఇటువంటి పనుల్లో అనుభవమున్న హెరిటేజ్ శాఖకు పనులు అప్పగించాలనే నిర్ణయానికొచ్చింది. పనులకు గానూ రూ.25 కోట్లు పురావస్తు శాఖ ద్వారా విడుదల చేయించేందుకు అనుమతులు పూర్తయ్యాయి.

### కనీసం రెండేళ్లు

ఆధునికీకరణ పూర్తయ్యేందుకు కనీసం రెండేళ్లు పడుతుందని వైద్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. "ఈ తరహా నిర్మాణాల్లో ఆరితేరిన సంస్థలను టెండరు విధానంలో ఎంపిక చేస్తారు. ఇందుకు కనీసం ఆర్నెల్ల సమయం, పనులు పూర్తిచేయడానికి సుమారు ఏడాదిన్నర సమయమైనా పడుతుంది. మరమ్మతుల్లో భాగంగా ప్రధానంగా స్నానాల గదులు, మరుగుదొడ్ల నీరు బయటకు వెళ్లకపోవడం, మురుగు వ్యవస్థలో లోపాలు తదితర సమస్యల్ని చక్కదిద్దుతారు" అని వైద్య వర్గాలు తెలిపాయి.

### పడకల సర్దుబాటే అసలు సవాల్

గతంలో ఉస్మానియాలోని 400 పడకలను సమీపంలోని పేట్లబురుజు ప్రసూతి ఆసుపత్రి, కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రి సహా మరికొన్నింటిలో సర్దుబాటు చేయాలని భావించినా అక్కడికి వెళ్లి వైద్యసేవలందించడానికి వైద్యులు, నర్సులు నిరాకరించారు. ఈ దృష్ట్యా ఉస్మానియా ప్రాంగణంలోని ఇతర భవనాల్లోనే 400 పడకలను సర్దుబాటు చేయాలని తాజాగా నిర్ణయించారు. ఇటీవలే ఆధునికరించిన హౌస్ సర్జన్ల భవనంలో 100 పడకలు, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రోగుల సహాయకుల కోసం ఏర్పాటుచేసిన రాత్రి వసతి గృహంలో 40, కులీ కుతుబ్‌షా భవనంలోని ఐదో అంతస్తులో 200, ఇదే భవనంలోని వేర్వేరు స్పెషలిస్టు వార్డుల్లో మరో 20, శస్త్ర చికిత్స గదులున్న భవనంలో 40 పడకలను సర్దుబాటు చేయాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించిన అనుమతులు కోరుతూ టీఎస్ఎంఎస్ఐడీసీ సోమవారం వైద్యారోగ్య శాఖకు లేఖ రాసింది.

## దక్షిణ మధ్య రైల్వేలో రెండు విభాగాలకు కొత్త అధిపతులు


కె.శివప్రసాద్


జి.జాన్ ప్రసాద్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేలో ఆపరేషన్స్, కమర్షియల్ విభాగాలకు కొత్త అధిపతులు నియమితులయ్యారు. ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజరుగా కె.శివప్రసాద్, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజరుగా జి.జాన్ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీరిద్దరూ ఐఆర్‌టీఎస్ 1986 బ్యాచ్‌కు చెందిన వారు కావడం విశేషం. శివప్రసాద్‌కు సికింద్రాబాద్ జోన్‌లో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజరుగా, జాన్‌ప్రసాద్‌కు కర్ణాటక రాష్ట్రం హుబ్లి కేంద్రంగా సౌత్ వెస్టర్న్ రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజరుగా పనిచేసిన అనుభవం ఉంది.

### స్టేషన్ యార్డుల వద్ద భద్రత పెంచండి: ద.మ.రై జీఎం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: స్టేషన్ యార్డుల వద్ద భద్రతను పెంచి రైళ్ల నిర్వహణను సులభతరం చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మల్య ఆదేశించారు. రైళ్ల భద్రత, సమయపాలన అంశాలపై విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల ఆర్ఎంలతో సోమవారం జీఎం దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. ఎంపిక చేసిన ప్రధాన రైల్వే స్టేషన్లలో జాతీయ జెండాలను ఆవిష్కరించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అదనపు జీఎం జాన్ థామస్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ కేవీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మనుగడలోకి వైద్య నియామక సంస్థ?

### ఇక దాని ద్వారానే పోస్టుల భర్తీ

ఈనాడు, హైదరాబాద్: వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీలను భర్తీ చేయడానికి తెలంగాణ ప్రభుత్వం నెలకొల్పిన వైద్య నియామక సంస్థ త్వరలోనే మనుగడలోకి రానుంది. ఈ సంస్థను నెలకొల్పడానికి అవసరమైన అనుమతులను గతంలోనే ప్రభుత్వం మంజూరు చేసింది. దీనికి ఛైర్మన్‌గా ఐఏఎస్ అధికారి ఉంటారు. ఇతర సభ్యులతోపాటు కార్యాలయంలో పరిపాలన వ్యవహారాల నిర్వహణకు 15 మంది సిబ్బందిని కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. సర్కారు అనుమతించిన పోస్టుల్లో ఇప్పటివరకూ ఒక్క ఉపసంచాలకుల పోస్టును మాత్రమే భర్తీ చేశారు. సాధ్యమైనంత తొందరగా ఛైర్మన్ సహా సభ్యులు, ఇతర సిబ్బంది నియామకాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే రెండు వారాల్లోగా వైద్య నియామక సంస్థను మనుగడలోకి తీసుకొచ్చేందుకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

## విధులకు ఆలస్యమైన అధికారులపై చర్యలు

### విజయ డెయిరీ ప్రధాన కార్యాలయంలో ఒకరి సస్పెన్షన్, ముగ్గురికి మెమోలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: విజయ డెయిరీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎండీ శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం 11 గంటలు దాటినప్పటికీ 90 శాతం మంది ఫెడరేషన్ అధికారులు, ఉద్యోగులు, పొరుగుసేవల సిబ్బంది విధులకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బయోమెట్రిక్ విధానం అమల్లో ఉన్నప్పటికీ 99 శాతం మంది దాన్ని వినియోగించుకోకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. బయోమెట్రిక్ నిర్వహణలో విఫలమై, విధులకు ఆలస్యంగా వచ్చిన ఏఎంను వెంటనే సస్పెండ్ చేయడంతోపాటు మరో ముగ్గురు అధికారులకు మెమోలు ఇచ్చారు. కార్యాలయానికి ఆలస్యంగా వచ్చిన సుమారు 90 మందికి ఒక రోజు జీతాన్ని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## టీఎస్‌పీఎస్సీపై అసత్య ఆరోపణలు

### ఏడుగురు అభ్యర్థులు ఏడాదిపాటు బహిష్కరణ

ఈనాడు, హైదరాబాద్: నియామకాల విషయంలో కమిషన్, ఛైర్మన్, సభ్యులపై అసత్య ఆరోపణలు చేసిన ఏడుగురు అభ్యర్థులను ఏడాదిపాటు టీఎస్‌పీఎస్సీ పరీక్షలు, శాఖా పరమైన పరీక్షలు రాయకుండా టీఎస్‌పీఎస్సీ నిషేధం విధించింది. టీఆర్‌టీ నియామకాల సమయంలో కొందరు అభ్యర్థులు కమిషన్‌పై అసత్య, తప్పుడు ప్రచారాలు చేయడంతో పాటు ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడటం, ఆయా కాల్స్‌ను రికార్డు చేసి సోషల్‌మీడియాలో పెట్టడాన్ని కమిషన్ తీవ్రంగా పరిగణించింది. పోలీసు, సైబర్ బృందాల సహాయం తీసుకుని అభ్యర్థుల వివరాలను నిర్ధారించుకుంది. ఎస్జీటీ ఫలితాల వెల్లడి నేపథ్యంలో ఏడుగురు అభ్యర్థుల ఫలితాలను నిలిపివేసింది. ఆయా అభ్యర్థుల నుంచి రాతపూర్వక వివరణలు తీసుకుంది. ఈ సందర్భంగా తొలిసారిగా తప్పు చేశామని... భవిష్యత్తులో మరోసారి చేయబోమంటూ అభ్యర్థులు ఒప్పుకొన్నారు. నిలిపివేసిన ఫలితాలను కమిషన్ ప్రకటించింది. మే 27 నుంచి ఏడాది పాటు టీఎస్‌పీఎస్సీకి సంబంధించిన ఎలాంటి పరీక్షలు రాయకుండా కమిషన్ డీబార్ చేసింది. నియామక సమాయాల్లో వ్యక్తిగత సర్వీసు రిజిస్టరులో ఎర్రసిరాతో వివరాలు రాయాలని ప్రభుత్వానికి సూచించింది.

### ఎంసెట్ కౌన్సెలింగ్‌కు 23,715 మంది

ఎంసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా తొలిరోజు సోమవారం 23,715 మంది రుసుం చెల్లించి ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకున్నారు. ఈసెట్‌కు 17,337 మంది స్లాట్ బుకింగ్ చేసుకున్నారు.

## 'న్యాక్' బాధ్యతలు ప్రైవేట్ సంస్థలకా?

- నూతన విద్యా విధానంపై నిపుణుల పెదవి విరుపు


చర్చలో మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి. పక్కన లింబాద్రి, పాపిరెడ్డి, నవీన్ మిత్తల్, వెంకట రమణ తదితరులు

ఈనాడు, హైదరాబాద్: ఉన్నత విద్యా సంస్థలకు జాతీయ అంచనా, అక్రిడేషన్ మండలి(న్యాక్) ఇచ్చే గుర్తింపు బాధ్యతను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వాలన్న జాతీయ నూతన విద్యా విధానం నివేదికలో ప్రతిపాదనపై పలువురు నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నివేదికలో పొందుపరిచిన పలు అంశాలను స్వాగతిస్తూనే కొన్ని అంశాలపై భిన్నాభిప్రాయాలను వ్యక్తపరిచారు. ప్రైవేట్ సంస్థలకు న్యాక్ బాధ్యతలు ఇవ్వడం మంచిది కాదని, దానిబదులు రాష్ట్ర స్థాయిలోనే అక్రిడేషన్ మండలిని ఏర్పాటు చేయాలని కొందరు అభిప్రాయపడ్డారు. నూతన విద్యా విధానం నివేదికపై అభిప్రాయాలు, సూచనలను పంపించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను కోరిన నేపథ్యంలో ఉన్నత విద్యాశాఖ సోమవారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఉపకులపతులు, విద్యావేత్తలతో చర్చ నిర్వహించింది. ఈ సందర్భంగా బడ్జెట్ పెంచకుండా విద్యా నాణ్యత పెంచలేమని కొందరు అభిప్రాయపడ్డారు. సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 3 ఏళ్లు దాటిన విద్యార్థుల గురించే నూతన విద్యా విధానంలో ప్రస్తావించారని, అయితే ఆ వయసుకు పిల్లలు పదజాలం నేర్చుకుంటారని, వారికి ఏం చేయవచ్చో ఆలోచించాలన్నారు. వయోజన విద్యకు తక్కువ ప్రాధాన్యం ఇచ్చారని, వయోజనులను అక్షరాస్యులను చేయకుండా సంపూర్ణ అక్షరాస్యత సాధ్యం కాదన్నారు. సమావేశంలో వెల్లడైన అభిప్రాయాలను, సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి నివేదిక పంపిస్తామని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ఆచార్య లింబాద్రి, వెంకట రమణ, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్, ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్, న్యాక్ మాజీ సంచాలకుడు వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### విహారి బుక్-2019 ఆవిష్కరణ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: భారత దేశంలోని వివిధ పర్యాటక ప్రదేశాల గురించి లోతైన సమాచారం అందించే విహారి బుక్-2019ను సోమవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బి.వెంకటేశం సచివాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పర్యాటకులు ఎక్కడికి, ఎలా వెళ్లాలనే ప్రణాళికలను సిద్ధం చేసుకోవడానికి ఇందులోని సమాచారం ఉపయోగపడుతుందన్నారు. పర్యాటక ప్రాంతాల్లో వాతావరణం, చూడదగిన ప్రదేశాల వివరాలన్నీ ఇందులో ఉంటాయన్నారు.

### తొలివారం గ్రూప్-2 ఇంటర్వ్యూ అభ్యర్థుల జాబితా

ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-2లో జులై 1 నుంచి 6 వరకు ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సిన అభ్యర్థుల జాబితాను టీఎస్‌పీఎస్సీ వెలువరించింది. ప్రతివారం ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థుల జాబితాను ప్రతి సోమవారం ప్రకటిస్తామని పేర్కొంది. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థుల సూచనలను వెబ్‌సైట్లో పొందు పరిచామని కమిషన్ తెలిపింది.

### ఉర్దూ అకాడమీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుల ప్రకటన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఉర్దూ అకాడమీ జీవనకాల సాఫల్య (లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు) పురస్కారాలను అకాడమీ ఛైర్మన్ రహీముద్దీన్ అన్సారీ ప్రకటించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా 2014 నుంచి 2017 వరకు అవార్డు గ్రహీతలను ఎంపిక చేశామని తెలిపారు. ఏడు విభాగాల్లో మొత్తం 28 మందికి అవార్డులు ఇస్తామని పేర్కొన్నారు. అవార్డుల ప్రదానం తేదీని త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.


దిష్టిబొమ్మ దహనం సందర్భంగా మంటలు ఎగిసిపడడంతో చెల్లా చెదురైన కార్యకర్తలు, గాయపడిన బింగి శ్రీనివాస్

## భాజపా ఆందోళనలో అపశ్రుతి

### హన్మకొండలో దిష్టిబొమ్మ దహనం సందర్భంగా ఎగిసిన మంటలు, ఇద్దరికి గాయాలు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: హన్మకొండలో ఇటీవల ఓ చిన్నారిపై జరిగిన ఘాతుకాన్ని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ వరంగల్ అర్బన్ శాఖ సోమవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. దిష్టిబొమ్మ దహనానికి పెట్రోలు పోయడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి ఇద్దరికి గాయాలయ్యాయి. ఉదయం 11 గంటలకు భాజపా నాయకులు, కార్యకర్తలు హన్మకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో భాజపా అర్బన్ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ నిప్పంటించారు. వెనువెంటనే ఓ కార్యకర్త దానిపై పెట్రోల్ చల్లడంతో మంటలు ఎగిసిపడ్డాయి. రావు పద్మ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బింగి శ్రీనివాస్ మంటలు అంటుకొని గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం భాజపా నాయకులు, కార్యకర్తలు ఆగ్రహంతో అక్కడే ఉన్న పోలీసు వాహనంపై దాడి చేయడంతో అద్దం పగిలిపోయింది. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి నిలకడగా ఉంది.

## ఫీజుల దోపిడీని అరికట్టాలి

### బీజేవైఎం ఆధ్వర్యంలో స్కూల్ డైరెక్టరేట్ ముట్టడి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భరత్ గౌడ్ డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఏటా ఫీజులు పెరగడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు విద్య దూరమయ్యే పరిస్థితి నెలకొంటోందన్నారు. సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని రాష్ట్ర విద్యాశాఖ పాఠశాల డైరెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించింది. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ గత పదేళ్లలో 100 నుంచి 500 శాతం ఫీజుల్ని పెంచిన పాఠశాలలు చదువును వ్యాపారంగా మారుస్తున్నాయని దుయ్యబట్టారు. ఫీజుల్ని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని తెచ్చి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తితో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ధర్నాలో యువమోర్చా జాతీయ కార్యదర్శి భద్ర మహిపాల్, ఇతర నేతలు రమ్యతేజ, అనంతకృష్ణ ఉన్నారు.


బీజేవైఎం కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

## బోరుమన్న ఊరు

### నెల్లూరు జిల్లాలో పసిప్రాణాన్ని మింగేసిన బోరు బావి

- ఆడుకొంటూ అందులో పడిపోయిన ఇద్దరు చిన్నారులు
- కాపాడిన స్థానికులు
- బాలుడు సురక్షితం, ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందిన బాలిక


మరణించిన మోక్షిత


సురక్షితంగా బయటపడిన గోపిరాజు


చిన్నారిని బోరుబావి నుంచి బయటకు తెస్తున్న సంబంధీకులు

ఈనాడు - నెల్లూరు, న్యూస్‌టుడే - విడవలూరు: బోరుబావిలో పడిన ఇద్దరు చిన్నారుల్లో ఒకరు మరణించిన విషాద సంఘటన నెల్లూరు జిల్లా విడవలూరు మండలం ఊటుకూరు పెద్దపాలెంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన నాగమ్మ కుమార్తె మోక్షిత(4) మృతిచెందగా, నాగమ్మ సోదరి, కావలి మండలం కతారుపల్లి గ్రామానికి చెందిన పోలమ్మ కుమారుడు గోపిరాజు(3) ప్రాణాలతో బయటపడ్డాడు. రెండో ప్రసవం కోసం పోలమ్మ కొద్ది రోజుల కిందట సోదరి ఇంటికి వచ్చింది. సోమవారం సాయంత్రం సుమారు అయిదు గంటల సమయంలో గోపిరాజు, మోక్షిత ఇంటి పరిసర ప్రాంతాల్లో ఆడుకుంటున్నారు. ఇంటిని ఆనుకుని ఉన్న పాఠశాలకు నీటిని సరఫరా చేయడానికి నాలుగు రోజుల కిందటే బోరును తవ్వారు. దీనికి పైపులు వేసి వదిలేశారు. ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న చిన్నారులిద్దరూ బోరు బావి దగ్గరకు వెళ్లి అందులో పడిపోయారు. ఆఖరులో బాలుడి చేతులు బోరుబావి బయట కొంత కనిపించాయి. దీంతో స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి అరుస్తూ స్థానికులను అప్రమత్తం చేశారు. దీంతో పొలం పనులు చేయడానికి సమీపంలో వినియోగిస్తున్న జేసీబీని తీసుకువచ్చి బోరు బావి పక్కన భారీగా గుంత తవ్వారు. సుమారు పది అడుగుల లోతులోనే గోపిరాజు కనిపించడంతో అతన్ని జాగ్రత్తగా బయటకు తీశారు. తర్వాత ప్రయత్నాన్ని కొనసాగించి బాలిక మోక్షితను కూడా బయటకు తీసుకొచ్చారు. ఆ సమయంలో సరిగా ఊపిరి అందక ఆ చిన్నారి ఇబ్బంది పడుతోంది. మెరుగైన వైద్యం కోసం ఆమెను ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. మార్గమధ్యలోనే మోక్షిత మృతి చెందింది.

## కొత్త సచివాలయం, శాసనసభ నిర్మాణాలపై మంత్రివర్గ ఉపసంఘం

### ప్రభుత్వ ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ కొత్త సచివాలయం, శాసనసభ నిర్మాణాలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపసంఘానికి ఛైర్మన్‌గా రహదారులు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, సభ్యులుగా ఆబ్కారీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్‌లు నియమితులయ్యారు. శాసనసభ, సచివాలయ నిర్మాణాలు, స్థలాల గుర్తింపు, సచివాలయంలో, ఎర్రమంజిల్‌లో పాత భవనాల కూల్చివేత, శాఖల తరలింపు తదితర అంశాలపై ఉపసంఘం అధ్యయనం చేసి, దీనికి సంబంధించిన ప్రతిపాదనలతో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నివేదిక ఇస్తుంది.

## వందమందికి పైగా విద్యార్థినులకు అస్వస్థత

### కలుషిత ఆహారం తినడమే కారణం.. కమలానెహ్రూ సాంకేతిక కళాశాల వసతి గృహంలో ఘటన

అబిడ్స్, నాంపల్లి, బేగంబజార్: హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని కమలా నెహ్రూ సాంకేతిక కళాశాల వసతి గృహంలో వంద మందికి పైగా విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కలుషిత ఆహారమే ఇందుకు కారణమని తెలిసింది. బాధిత విద్యార్థినులను ఉస్మానియాతో పాటు పలు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. విషయం తెలిసిన వెంటనే కొంతమంది తల్లిదండ్రులు వసతి గృహానికి పరుగులు తీశారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన సుమారు 1200 మంది విద్యార్థినులు వివిధ సాంకేతిక కోర్సులను ఇక్కడ అభ్యసిస్తున్నారు. వీరికోసం కళాశాల పక్కనే వసతి గృహాన్ని ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వహిస్తోంది. వంటశాల మరమ్మతుల కారణంగా వారం రోజులుగా వంటలను అక్కడే గ్రౌండ్‌ఫ్లోర్‌లోని బహిరంగ ప్రదేశంలో వండి వడ్డిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం వసతి గృహం నుంచి కళాశాలకు వెళ్లిన విద్యార్థినులు పలువురు తరగతి గదుల్లోనే వాంతులు, కడుపునొప్పి, తీవ్ర జ్వరం, విరేచనాలతో సతమతమయ్యారు. ఒకరి తర్వాత మరొకరు వంద మందికి పైగా ఇదే సమస్యలతో బాధపడ్డారు. కళాశాల యాజమాన్యం తొలుత తేలికగా తీసుకున్నప్పటికీ, బాధితుల సంఖ్య పెరగడంతో కొంత మందిని ఉస్మానియా ఆసుపత్రితో పాటు, నాంపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. గత వారం నుంచి ఈ వసతి గృహంలో రోజుకు ఇద్దరు, ముగ్గురు చొప్పున కడుపు నొప్పి, జ్వరం వాంతులు విరేచనాలతో బాధపడుతున్నప్పటికీ యాజమాన్యం బయటకు పొక్కకుండా గోప్యత పాటించిందని విద్యార్థినులు ఆరోపించారు. పలువురు వైద్యులను వసతి గృహానికి రప్పించి ప్రాథమిక వైద్య సేవలు అందించారు. కలుషిత ఆహారం, నీటితోనే ఈ సమస్య తలెత్తిందని వైద్యులు నిర్ధారించారు. యాజమాన్యం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నేతలు ఆందోళనలకు దిగారు.

## మానసిక రోగులకు పునరావాసం!

### పర్యవేక్షణకు సీఎస్ నేతృత్వంలో కమిటీ

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మానసిక వైద్యం పొందిన రోగులకు చికిత్సానంతరం కోలుకున్న తర్వాత పునరావాసం కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. వేర్వేరు మానసిక రుగ్మతలతో చికిత్స పొందిన రోగుల్లో కొందరు కోలుకున్న తర్వాత సొంతింటికి వెళ్లిపోకుండా ఆసుపత్రుల్లోనే ఉంటున్నారు. వారికి సంబంధించిన వారెవరూ వారిని తమ వెంట ఇళ్లకు తీసుకెళ్లడానికి ముందుకు రావడం లేదు. దీంతో చికిత్సానంతరం ఏళ్ల తరబడి మానసిక వైద్యశాలల్లోనే కొనసాగాల్సి వస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అలాంటి వారికి ప్రభుత్వమే సాంత్వన చేకూర్చాలని సూచించింది. ఈ వ్యవహారాలను పర్యవేక్షించడానికి రాష్ట్ర స్థాయిలో ఉన్నత కమిటీని నియమించాలని పేర్కొంది. ఆ ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. సాధారణ స్థితికి వచ్చిన రోగులకు పునరావాసం కల్పించేందుకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నేతృత్వంలో పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్, ప్రజారోగ్య సంచాలకులు, వైద్య విద్య సంచాలకులు, హైదరాబాద్‌లోని మానసిక వైద్యశాల సూపరింటెండెంట్‌లను సభ్యులుగా నియమించింది. కమిటీలో సభ్యులుగా పలువురు మానసిక వైద్యనిపుణులకూ ప్రభుత్వం స్థానం కల్పించింది. వీరిలో డాక్టర్ రామసుబ్బారెడ్డి, డాక్టర్ బాలాజీ పవార్, డాక్టర్ ఎల్వీఆర్ ఉషా, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఏపీ శ్రీవత్సవ ఉన్నారు. కమిటీకి మహిళా శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

## గురుకులాల్లో సర్వీసు నిబంధనల సవరణ

- ప్రభుత్వం ముందుకు ప్రతిపాదనలు
- ఆమోదం పొందితే దాదాపు 4వేల ఉద్యోగాలకు ప్రకటనలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని గురుకులాల్లో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర పోస్టుల విభజన ప్రక్రియను రాష్ట్రపతి నూతన ఉత్తర్వుల ప్రకారం గురుకుల నియామక బోర్డు మొదలుపెట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సాధారణ గురుకులాల్లో ఈ పోస్టులను మల్టీ జోనల్, జోనల్, జిల్లా ప్రాతిపదికన విభజించనుంది. ఈ మేరకు సర్వీసు నిబంధనలకు సవరణ ప్రతిపాదనల్ని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. వీటికి ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే దాదాపు 4వేలకు పైగా గురుకుల పోస్టులకు ప్రకటన వెలువడే అవకాశముందని బోర్డువర్గాలు వెల్లడించాయి.

### డిగ్రీ లెక్చరర్, ప్రిన్సిపల్స్ పోస్టులు మల్టీజోన్‌లో

గురుకులాల్లో నూతన నిబంధనల ప్రకారం పోస్టుల విభజన లేకపోవడంతో నియామక ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నిబంధనలు గురుకుల సొసైటీలకు వర్తిస్తాయా? లేదా? అనే సందేహాలు బోర్డులో వ్యక్తమయ్యాయి. ఇదే విషయమై ప్రభుత్వానికి బోర్డు లేఖ రాసినా స్పష్టత రాలేదు. మరోవైపు ఏడాది క్రితం 119 కొత్త గురుకులాలు ఏర్పాటయ్యాయి. ఈ గురుకులాల్లో పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఇటీవల మరో 119గురుకులాలు వచ్చాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యను చెప్పించేందుకు రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకాన్ని వెంటనే చేపట్టాలని బోర్డు నిర్ణయించింది. అవసరమైతే ఆర్డర్ టు సర్వ్ కింద నియామక ఉత్తర్వులిచ్చేలా ప్రకటన వెలువరించి పోస్టులు భర్తీ చేయాలని భావించింది. అయితే న్యాయపరమైన చిక్కులు వస్తాయన్న ఉద్దేశంతో బోర్డు వెనకడుగు వేసింది. ప్రధాన అడ్డంకిగా మారిన సర్వీసు నిబంధనల సవరణ ప్రక్రియ ప్రారంభించింది. డిగ్రీ లెక్చరర్, ప్రిన్సిపల్స్ ఆపైస్థాయి పోస్టులను మల్టీజోనల్, జూనియర్ లెక్చరర్లు, టీజీటీ, పీజీటీ స్థాయి పోస్టులను జోనల్, మిగిలిన గ్రూప్-4 సర్వీసు పోస్టులను జిల్లా కేటగిరీ కింద చేర్చింది.

### మౌఖిక పరీక్షలపై శిక్షణ

గ్రూప్-2లో మౌఖిక పరీక్షలకు అర్హత పొందిన అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీసర్కిల్ డైరెక్టర్ తెలిపారు. 27 నుంచి నమూనా మౌఖిక పరీక్షల శిక్షణ ఉస్మానియా వర్సిటీ, పీజీఆర్ఆర్‌సీడీఈలోని స్టడీ సర్కిల్‌లలో ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 6302427521 లేదా 040-27077929 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

# గుజరాత్ నుంచి రాజ్యసభకు కేంద్ర మంత్రి జయ్‌శంకర్ పోటీ

## అభ్యర్థిగా ప్రకటించిన భాజపా


జయ్‌శంకర్‌కు పార్టీ సభ్యత్వ పత్రం అందజేస్తున్న జేపీ నడ్డా

**దిల్లీ:** విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయ్‌శంకర్ గుజరాత్ నుంచి రాజ్యసభ స్థానానికి పోటీచేయనున్నారు. ఈ మేరకు భాజపా ఆయన అభ్యర్థిత్వాన్ని సోమవారం ప్రకటించింది. అంతకు ముందు జయ్‌శంకర్ భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.పి.నడ్డా సమక్షంలో పార్టీ సభ్యత్వం పుచ్చుకున్నారు. దౌత్యవేత్త, విదేశీ వ్యవహారాల మాజీ కార్యదర్శి అయిన జయ్‌శంకర్ గత నెల 30న కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఆ తేదీ నుంచి ఆరు నెలల్లోగా ఆయన పార్లమెంటు సభ్యుడిగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. భాజపా అధ్యక్షుడు అమిత్ షా, ఆ పార్టీ నాయకురాలు స్మృతి ఇరానీ లోక్‌సభకు ఎన్నికవ్వగా తమ రాజ్యసభ సభ్యత్వాలకు వారు రాజీనామా చేశారు. ఆ రెండు స్థానాలకు ఇప్పుడు ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. మరో స్థానానికి జుగల్జీ మాథుర్జీ ఠాకూర్‌ను భాజపా అభ్యర్థిగా ప్రకటించింది.

# శూన్య గంట ప్రస్తావనలపై 30 రోజుల్లో సమాధానం ఇవ్వాలి

## మంత్రులకు వెంకయ్య నాయుడు ఆదేశం

**దిల్లీ:** రాజ్యసభలో శూన్య గంటలోనూ, ప్రత్యేక ప్రస్తావనల ద్వారా లేవనెత్తిన అంశాలపై 30 రోజుల్లోగా సమాధానాలు ఇవ్వాలని ఛైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు మంత్రులను ఆదేశించారు. వీటిని ప్రస్తావించిన సంబంధిత సభ్యులకు సమాధానాలు పంపాలని సూచించారు. తాము లేవనెత్తిన సమస్యలపై మంత్రుల నుంచి సమాచారం రావడం లేదంటూ ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఈ ఆదేశాలు ఇచ్చారు. సభ్యులు ప్రస్తావించిన సమస్యలకు మంత్రులు వెంటనే సభలోనే సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం లేదని, అయితే ఒకవేళ వారు జవాబు ఇవ్వడానికి సిద్ధపడితే అవకాశం కల్పిస్తానని తెలిపారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ స్పందిస్తూ దీన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## మొక్కజొన్న తోటలో...



జర్మనీలోని హల్బాక్‌లో సోమవారం రెండో ప్రపంచ యుద్ధం నాటి ఓ బాంబు పేలడంతో మొక్కజొన్న తోటలో ఏర్పడిన భారీ గుంత ఇది. తోట దిగువన ఇన్నాళ్లూ బాంబు క్రియారహితంగా ఉండొచ్చని.. అందులోని రసాయనిక డిటోనేటర్ క్రియాశీలకంగా మారడంతో ప్రస్తుతం పేలుడు సంభవించి ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. పేలుడులో ఎవరూ గాయపడలేదు.

# మోదీ పెద్ద విక్రయదారు

- అందుకే భాజపా మళ్లీ అధికారంలోకి రాగలిగింది: కాంగ్రెస్
- ప్రజాతీర్పును విపక్షాలు గౌరవించాలి: లోక్‌సభలో భాజపా

దిల్లీ

'ప్రధాని మోదీ పెద్ద విక్రయదారుడు. అందుకే భాజపా మళ్లీ అధికారంలోకి రాగలిగింది. మా ఉత్పత్తులను సరిగా మార్కెట్ చేసుకోలేక సార్వత్రిక ఎన్నికల్లో ఓటమిపాలయ్యాం' అని లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధురి అన్నారు. భాజపా సర్కారుకు రాజకీయ భావచౌర్య రుగ్మత పట్టుకుందని, పార్టీ వ్యవస్థాపక సిద్ధాంతాలను పక్కనపెట్టి, కేవలం తన విజయాలను మాత్రమే చెప్పుకొంటోందన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం లోక్‌సభలో చర్చ జరిగింది. గంటన్నర పాటు సుదీర్ఘంగా ప్రసంగించిన అధీర్... నెహ్రూ, ఇందిర, రాజీవ్‌ల హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వాల పథకాలను, చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

### 'డ్రెయిన్'పై రగడ...

భాజపా సభ్యులు ప్రధానిని స్వామి వివేకానందతో పోల్చడాన్ని అధీర్ తప్పుపట్టారు. మోదీ 'డ్రెయిన్ (కాలువ)' లాంటివారని ఆయన వ్యాఖ్యానించడంతో సభలో ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. అహంకారంతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు, ఆ పార్టీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని భాజపా సభ్యులు దుయ్యబట్టారు. అధీర్ స్పందిస్తూ-"నాకు మోదీ అంటే గౌరవం. ప్రధానితో పోల్చి వివేకానందను తక్కువ చేయడం కోపం తెప్పించింది. నేను 'కాలువ' అన్న పదమే వాడానుగానీ... 'మురుగు కాలువ' అని అనలేదు. నా వ్యాఖ్యలకు ప్రధాని నొచ్చుకొని ఉంటే వ్యక్తిగతంగా క్షమాపణలు చెబుతున్నా" అని అన్నారు.

### వారికి భారత్‌లో ఉండే హక్కుందా: షడంగి

ప్రజాతీర్పును విపక్షాలు గౌరవించాలని కేంద్రమంత్రి ప్రతాప్‌చంద్ర షడంగి అన్నారు. 'వందేమాతరం'లో విశ్వాసం లేనివారికి... పాకిస్థాన్ జిందాబాద్, అఫ్జల్ గురూ జిందాబాద్ అని నినదించేవారికి భారత్‌లో జీవించే హక్కుందా అని ప్రశ్నించారు. ఇందుకు అధీర్ బదులిస్తూ- ఈ ప్రభుత్వం పొగడ్తలకు బానిసైపోయిందని, షడంగి హద్దులు దాటిన స్తుతులతో మోదీని ముంచెత్తారని అన్నారు.

### అందరి విశ్వాసం కాంక్షిస్తున్నాం: నడ్డా

సభ సజావుగా సాగేలా విపక్షాలు సహకరించాలని భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా విపక్షాలను అభ్యర్థించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ఆయన చర్చను ప్రారంభించారు. "అందరి సహకారంతో అందరి అభివృద్ధినే కాదు... అందరి విశ్వాసాన్నీ మేం కాంక్షిస్తున్నాం. భిన్న వాదనలకు అవకాశమిద్దాం. కానీ కేవలం వ్యతిరేకించాలని మాత్రం వ్యతిరేకించడం సరి కాదు. పేదలు, మహిళలు, యువత అభ్యున్నతి కోసం ప్రభుత్వం పనిచేస్తుంది. మోదీకి వచ్చిన బహుమతులన్నీ దేశానికి వచ్చినవే. భారత్‌ది ప్రేక్షకపాత్ర కాదు. అంతర్జాతీయ యవనికపై క్రియాశీల పాత్ర పోషిస్తుంది" అని నడ్డా పేర్కొన్నారు.

### 'న్యూ ఇండియా' మాకొద్దు: ఆజాద్

'న్యూ ఇండియా'లో మనుషులను చూసి మనుషులు భయపడుతున్నారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభలో విపక్ష నేత గులాం నబీ ఆజాద్ భాజపా సర్కారుపై విరుచుకుపడ్డారు. మహాత్మాగాంధీ హంతకులను పొగిడేవారు అధికార పార్టీలో ఉన్నారనీ... వారి పాలనలో విద్వేషాలు, హింస, నిరుద్యోగం, మైనర్లపై లైంగిక దాడులు తారస్థాయికి చేరాయని ఆందోళన వ్యక్తం చేశారు. 'మీ న్యూ ఇండియాను మీతోనే ఉంచుకోండి. విద్వేషాలు, వైషమ్యాలు లేని ప్రేమైక భారత్‌ను మాకివ్వండి. హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు కలిసిమెలిసి జీవించే భారత్ మాకు కావాలి' అని అధికార పార్టీని ఉద్దేశించి ఆజాద్ అన్నారు.

# ఈవీఎంలపై లోక్‌సభలో రభస

**దిల్లీ:** రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ కాస్తా... సోమవారం లోక్‌సభలో 'ఈవీఎం'లపైకి మళ్లింది! వీటి విశ్వసనీయతపై బీఎస్పీ, అన్నాడీఎంకే సభ్యులు సందేహం వ్యక్తం చేయగా, తిరిగి బ్యాలెట్‌ను ప్రవేశపెట్టాలని తృణమూల్ డిమాండ్ చేసింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వద్దని, మళ్లీ బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలను నిర్వహించాలని తృణమూల్ ఎంపీ సౌగత రాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. 'ఎన్నికల ఫలితాలకు ముందు 300 స్థానాలు గెలుచుకుంటామని భాజపా అధ్యక్షుడు చెప్పారు. ఆ ప్రకారమే 303 సీట్లు వారికి వచ్చాయి. ముందే ఫలితాలు వారికెలా తెలిశాయి? ఈవీఎంలను నమ్మలేం. తిరిగి బ్యాలెట్ పత్రాలను ప్రవేశపెట్టాలి' అని ఆయన అన్నారు. ఈవీఎంల విశ్వసనీయతపై చర్చించేందుకు అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని బీఎస్పీ సభ్యుడు దనిష్ అలీ ప్రధానిని కోరారు.

### సుదీర్ఘ ఎన్నికలు వద్దు: అన్నాడీఎంకే

సుదీర్ఘ ఎన్నికలు వద్దనీ, భవిష్యత్తులో తక్కువ సమయంలోనే వాటిని నిర్వహించుకుందామని అన్నాడీఎంకే సభ్యుడు ఎస్.ఆర్.బాలసుబ్రమణియన్ అన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ సాధ్యమేనని రుజువైనందున వాటి స్థానంలో బ్యాలెట్ పత్రాలను ప్రవేశపెట్టాలన్నారు. అభివృద్ధి చెందిన చాలా దేశాలు బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నాయని గుర్తుచేశారు. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులను సకాలంలో విడుదల చేయాలని అభ్యర్థించారు.

# లోక్‌సభలో ఆధార్ సవరణ బిల్లు

**దిల్లీ:** బ్యాంకు ఖాతాలు తెరవడానికి, చరవాణి కనెక్షన్లు పొందడానికి 'గుర్తింపు ఆధారం'గా ఆధార్ కార్డును స్వచ్ఛందంగా ఉపయోగించడానికి వీలుకల్పించే బిల్లును లోక్‌సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2016 ఆధార్ చట్టాన్ని ఈ బిల్లు సవరిస్తుంది. మార్చిలో జారీచేసిన అత్యవసర ఆదేశం (ఆర్డినెన్సు) స్థానంలో ఈ కొత్తచట్టం వస్తుంది. నిబంధనల ఉల్లంఘనకు భారీ జరిమానాలను ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. ఆధార్‌పై సుప్రీంకోర్టు తీర్పును ఇది ఉల్లంఘిస్తోందని ఆర్ఎస్‌పీ ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ విమర్శించారు. ఇది దేశ ప్రయోజనాలకు సంబంధించినదని, గోప్యత హక్కును ఉల్లంఘించబోదని సమాచార ప్రసార, సాంకేతిక పరిజ్ఞాన శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ అన్నారు. ప్రైవేటు సంస్థలు బయోమెట్రిక్ గుర్తింపును ఉపయోగించుకోడానికి సంబంధించిన సెక్షన్ 57ను ఆధార్ చట్టం నుంచి ఇది తొలగిస్తుంది. ఆధార్ చట్టంలోని వివిధ అంశాలను ఉల్లంఘించే ప్రైవేటు సంస్థలకు రూ. కోటి వరకు జరిమానా లాంటి కొత్త అంశాలు ఈ బిల్లులో ఉన్నాయి. నిరంతర ఉల్లంఘనలకు రోజుకు రూ. 10లక్షల జరిమానా పడుతుంది. గుర్తింపు సమాచారాన్ని అనధికారికంగా ఉపయోగించినా, ఆఫ్‌లైన్‌లో తనిఖీ చేసినా మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ. 10వేల వరకు జరిమానా పడతాయి. కంపెనీలకు అయితే జరిమానా రూ. లక్ష వరకు ఉంటుంది. సెంట్రల్ ఐడెంటిటీస్ డేటా రిపాజిటరీని అనధికారికంగా ఉపయోగిస్తే శిక్షను పదేళ్ల వరకు పెంచుతున్నారు.

# రాహుల్... మీరే నడిపించాలి

- మరోసారి కోరనున్న సీడబ్ల్యూసీ
- తిరస్కరిస్తే కొత్త అధ్యక్షుడిపై నిర్ణయం
- యూపీలో జిల్లా కమిటీల రద్దు



**ఈనాడు-దిల్లీ:** పార్టీ అధ్యక్ష పదవిలో కొనసాగాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) మరోసారి రాహుల్ గాంధీని కోరనుంది. వచ్చే వారంలో జరిగే కమిటీ సమావేశంలో ఆ మేరకు తీర్మానం చేయనుంది. అప్పటికీ రాహుల్ మనసు మార్చుకోకపోతే కొత్త అధ్యక్షుడిపై నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదుల పరిశీలనకు త్రిసభ్య కమిటీని నియమించనుంది. సోమవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని జిల్లా కాంగ్రెస్ కమిటీలను ఆ పార్టీ రద్దు చేసింది. ఆ రాష్ట్ర పార్టీ బాధ్యులుగా ఉన్న రాహుల్ సోదరి ప్రియాంకా గాంధీ, జ్యోతిరాదిత్య సింధియా సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. యూపీలో 11 అసెంబ్లీ స్థానాలకు త్వరలో జరగబోయే ఉప ఎన్నికలకు సంబంధించిన సన్నాహాలను ఇద్దరు సభ్యుల బృందం పర్యవేక్షిస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

### సంతకాలకూ నిరాకరిస్తున్న రాహుల్

పార్టీ అధ్యక్ష పదవిలో కొనసాగాలని రాహుల్‌గాంధీ ఏ మాత్రం భావించటంలేదని, అందువల్ల సీడబ్ల్యూసీ వినతిని ఆయన ఆమోదించకపోవచ్చని కాంగ్రెస్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు. ఈనెల 14, 19 తేదీల్లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) చేపట్టిన సంస్థాగత నియామకాలపై పార్టీ అధ్యక్షుడి సంతకం లేదు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వాటిపై సంతకాలు చేశారు. ఇదే కాదు ఏ లేఖపైనైనా రాహుల్ సంతకం చేయటానికి నిరాకరిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు తెలిపారు.

### ప్రత్యామ్నాయంపై మల్లగుల్లాలు

గాంధీ కుటుంబయేతరులు పార్టీ అధ్యక్షపదవిని చేపట్టవచ్చని, అయితే, గాంధీ కుటుంబ సభ్యులు క్రియాశీలకంగా ఉండాలని కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ కుటుంబ విధేయుడు మణిశంకర్ అయ్యర్ అభిప్రాయపడ్డారు. ''పార్టీ అధినేతగా రాహుల్ కొనసాగితే మంచిదే. అదే సమయంలో ఆయన అభిప్రాయాన్ని కూడా గౌరవించాలి'' అని మణిశంకర్ అయ్యర్ అన్నారు. అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానని మే 25న సీడబ్ల్యూసీలో ప్రకటించినది మొదలు రాహుల్‌గాంధీ పార్టీ విషయాలకు దూరంగానే ఉంటున్నారు. నెహ్రూ-గాంధీ కుటుంబానికి చెందని వ్యక్తే పార్టీ నాయకత్వాన్ని చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు.

'రాష్ట్ర కమిటీల్లో పార్టీ పరిస్థితి ఏ మాత్రం బాగా లేదు. ముఠా రాజకీయాలు, వ్యక్తిగత ప్రయోజనాల్లో స్థానిక నాయకత్వాలు తలమునకలుగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో రాహుల్ స్థానంలో పార్టీ మొత్తాన్ని ఏకతాటిపై నడిపే వ్యక్తిని తీసుకురావటం అంత సులభం కాదు' అని పార్టీ అంతర్గత వ్యవహారాలు తెలిసిన కాంగ్రెస్ నేత ఒకరు అన్నారు.

# ఎన్ఐఏ బలోపేతానికి చట్టసవరణ!

- కేంద్ర కేబినెట్ పచ్చజెండా
- మోటారు బిల్లుకూ ఆమోదం

**దిల్లీ:** దేశంలోను, విదేశాల్లోను ఉగ్రవాద కేసులను దర్యాప్తు చేయడం కోసం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు మరింత వెసులుబాటు కల్పించేలా రెండు చట్టాలను సవరించాలన్న ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ సోమవారం ఆమోదం తెలిపింది. రానున్న రోజుల్లో పార్లమెంటులో రెండు వేరువేరు బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.

ఈ బిల్లుల ద్వారా ఎన్ఐఏ చట్టం, చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టాన్ని సవరించనున్నారు. సైబర్ నేరాలు, మానవుల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులను కూడా దర్యాప్తు చేయడానికి ఎన్ఐఏకు వీటి వల్ల వీలు కలుగుతుంది. ఉగ్రవాదులతో సంబంధాలున్నట్లు ఒక వ్యక్తిపై అనుమానాలు ఉంటే అతడిని ఉగ్రవాదిగా ప్రకటించడానికి వీలుగా చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టంలోని షెడ్యూల్-4కు ప్రభుత్వం సవరణ చేస్తోంది. ప్రస్తుతం సంస్థలను మాత్రమే ఉగ్రవాద ముఠాలుగా వర్గీకరించడానికి వీలవుతోంది. ముంబయి ఉగ్రవాద దాడుల నేపథ్యంలో 2009లో ఎన్ఐఏను ఏర్పాటు చేశారు. తాజా సవాళ్లను ఎదుర్కొనేలా ఎన్ఐఏకు మరిన్ని అధికారాలు కల్పించేందుకు ఈ రెండు చట్టాలు 2017 నుంచి కేంద్ర హోంశాఖ పరిశీలనలో ఉన్నాయి.

తమ ప్రతినిధుల ద్వారా ఓటు వేసే హక్కు (ప్రాక్సీ ఓటింగ్)ను విదేశాల్లోని భారతీయులకు కల్పించే అంశంపై ఒక బిల్లును ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను కేబినెట్ పరిశీలిస్తుందని భావించినా ఈ అంశం అజెండాలో లేదు. సర్వీసు ఓటర్ల జీవిత భాగస్వాములకు సంబంధించి ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని సవరించే అంశం కూడా తాజా కేబినెట్ భేటీలో చర్చకు రాలేదు. మోటారు వాహనాల (సవరణ) బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనికింద ట్రాఫిక్ ఉల్లంఘనలకు భారీ జరిమానాలను విధిస్తారు. అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకపోతే రూ.10వేలవరకూ చెల్లించాల్సి వస్తుంది. రవాణా సంస్థలు లైసెన్సు నిబంధనలను ఉల్లంఘిస్తే రూ.లక్ష వరకూ చెల్లించాలి.

### డీఎన్ఏ ప్రొఫైలింగ్ బిల్లుకు ఆమోదం

ఒక వ్యక్తి గుర్తింపును తేల్చడానికి డీఎన్ఏ పరిజ్ఞానాన్ని ఉపయోగించడానికి వీలు కల్పించే డీఎన్ఏ ప్రొఫైలింగ్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. నిజానికి ఈ బిల్లుతో పాటు మోటారు బిల్లుకు లోక్‌సభ గతంలోనే ఆమోదం తెలిపింది. రాజ్యసభలో నిలిచిపోయాయి. ఈలోగా 16వ లోక్‌సభ గడువు ముగిసిపోవడంతో వీటికి కాలదోషం పట్టింది. ఇప్పుడు కేబినెట్ ఆమోదముద్ర వేయడంతో త్వరలో వీటిని పార్లమెంటులో ప్రవేశపెడతారు.

# చిన్నారుల మరణాలు ఆందోళనకరం

- బిహార్‌లో పిల్లల మృతిపై సుప్రీంకోర్టు వ్యాఖ్య


బిహార్ చిన్నారుల మృత్యువాతపై కోల్‌కతాలో ఆందోళన చేపట్టిన నిరసనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**దిల్లీ:** ఏఈఎస్ బారినపడి బిహార్ ముజఫర్‌పూర్‌లో వందమందికిపైగా చిన్నారులు మరణించడం తీవ్ర ఆందోళనకరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. బిహార్‌లో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, పోషకాహారం, పారిశుద్ధ్యం తదితర పరిస్థితులపై వారం రోజుల్లో ప్రతిస్పందన తెలియజేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం స్పష్టం చేసింది. బిహార్‌లోని విభిన్న జిల్లాల్లో సుమారు 150 మందిదాకా చిన్నారులు ఏఈఎస్ వ్యాధి కారణంగా మరణించడంపై దాఖలైన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యం ప్రజల వైద్య సంరక్షణ సౌకర్యాలు, పోషకాహారం, పారిశుద్ధ్యం తదితర అంశాలపై తీవ్ర ఆందోళనను లేవనెత్తిందని, వీటిపై ప్రతివాదులు ఏడు రోజుల వ్యవధిలో ప్రతిస్పందన తెలియజేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను పది రోజులకు వాయిదా వేసింది. ఈ వ్యాజ్యాన్ని మనోహర్ ప్రతాప్ అనే న్యాయవాది దాఖలు చేశారు.

# మూకదాడి ఘటనలో 11 మంది అరెస్టు

**సరాయకెలా-ఖర్సవాం:** బైకు దొంగతనం ఆరోపణలపై ఝార్ఖండ్‌లో మూకదాడికి గురైన యువకుడు ఆ తర్వాత ఆసుపత్రిలో మరణించిన ఘటనలో 11 మందిని అరెస్టు చేశారు. ఈ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు తబ్రేజ్ అన్సారీ (24) ఇద్దరు స్నేహితులతో కలిసి ఈ నెల 18న రాత్రి జంషెడ్‌పుర్ నుంచి వస్తున్నాడు. బైకు దొంగిలించారని కొందరు గ్రామస్థులు వారిని పట్టుకొన్నారు. అన్సారీ స్నేహితులు పరారయ్యారు. అన్సారీని స్తంభానికి కట్టేసిన గ్రామస్థులు రాత్రంతా కర్రలతో చితకబాదారు. అతడితో బలవంతంగా 'జై శ్రీరామ్', 'జై హనుమాన్' నినాదాలు చేయిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లోకి వచ్చింది. ఆ తర్వాత గ్రామస్థులు అతడిని పోలీసులకు అప్పగించారు. అస్వస్థతగా ఉందని చెప్పడంతో అతడిని సరాయకెలా సదర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మర్నాడు జంషెడ్‌పుర్‌లోని టాటా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. దీంతో ఇద్దరు పోలీసు అధికారులను సస్పెండ్ చేశారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పప్పు మండల్ అనే వ్యక్తి సహా 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

# అన్ని ఎన్నికల్లో ఒంటరి పోరే: మాయ

**లఖ్‌నవూ:** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)-సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) మధ్య బంధం ఇక ముగిసినట్లే. ఇకపై జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఒంటరిగానే పోటీ చేస్తామని బీఎస్పీ అధినాయకురాలు మాయావతి సోమవారం ప్రకటించారు. అయితే ఈ పరిణామం సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటాన్ని బలహీనపరుస్తుందని సమాజ్‌వాదీ పార్టీ వ్యాఖ్యానించింది. "ఎన్నికల తరువాత ఎస్పీ అనుసరించిన తీరు పొత్తు కొనసాగింపుపై ఆలోచనలో పడేసింది. ఇలా అయితే భవిష్యత్తులో భాజపాను ఓడించడం సాధ్యం కాదు. అందువల్ల పార్టీ, ఉద్యమ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సొంత బలంతో రానున్న అన్ని ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించింది" అని మాయావతి వివరించారు.

### దళితుల మద్దతు ఉందనే: ఎస్పీ

తమ పార్టీపై బీఎస్పీ వ్యాఖ్యలు చేయడం తొందరపాటు చర్య అని ఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంశంకర్ విద్యార్థి అన్నారు. అఖిలేశ్‌కు దళిత సమాజం బాగా దగ్గరవుతోందని, దాంతో ఓర్చుకోలేకే మాయావతి ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. రాజకీయాల్లో నిబద్ధత లేకుంటే ఇలాంటి సమస్యలే ఎదురవుతాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ద్విజేంద్ర త్రిపాఠీ వ్యాఖ్యానించారు.

# యూపీలో వర్షాలు.. పిడుగులు: 17 మంది మృతి

**లఖ్‌నవూ:** భారీ వర్షాలు, పిడుగులకు ఉత్తర్‌ప్రదేశ్‌లో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 19 మంది గాయపడ్డారు. వీరంతా రాష్ట్ర వ్యాప్తంగా వేర్వేరుచోట్ల చనిపోయారని యూపీ ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది.




Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

Eenadu epaper